శీలం భద్రయ్య

పేర్పు

విభిన్న వ్యాసాలు



పేర్పు

విభిన్న వ్యాసాల సంపుటి

శీలం భద్రయ్య

***

ఈ పుస్తకం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వారి ఆర్థిక సహకారంతో ముద్రితమైంది. ఇందులోని అభిప్రాయాలు రచయిత సొంతం. విశ్వవిద్యాలయానికి ఎటువంటి సంబంధం లేదు.

శీలం భద్రయ్య

పేర్పు విభిన్న వ్యాసాల సంపుటి

మొదటి ముద్రణ: సెప్టెంబరు 2025

ధర : 150 రూ.లు

పేజీలు: 120

ప్రతులకు:

శీలం ప్రచురణలు-3

ఇం.నెం. 8-1-510, ప్లాట్ 25

పద్మావతి కాలని, నల్లగొండ పట్టణం

నల్లగొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం

508001, చరవాణి : 9885838288

badri.roses@gmail.com

*** అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును.**

ముద్రణ:

కర్షక్ ముద్రణాలయం, హైదరాబాదు

SHEELAM BHADRAIAH

PERPU-*Diversed essays*

Author: Sheelam Bhadraiah

First Print: Sep 2025

Price: INR 150

Peges: 120

For Books

Sheelam Publications-3

H.No. 8-1-510

Padmavathi Colony, Nalgonda

Town, Telangana State, 508001

Mobile: 9885838288

* All leading book shops

***Karshak Printers, Hyderabad**

ISBN NUMBER :

978-93-342-9925-0

https://sites.google.com/view/sheelam-bhadraiah/home

https://www.facebook.com/share/12LrfuMq2wE



అంకితం

ఉదయపు వాహ్యావళిలో దశాబ్ధకాలంబాటు తోడుగా నడిచిన బాటసారి, నన్ను వేలుబట్టి రంగస్థలంమీదకు నడిపించిన నటమార్గదర్శి, వయసురిత్యా తండ్రిస్థానంలో ఉన్నప్పటికీ తమ్మీ అని ఆప్యాయంగా పలకరించే అగ్రజుడు, నాటకరంగ కళాకారుడు, చరిత్ర అధ్యాపకుడు, బిఈడి ప్రిన్సిపాల్, పరిశోధకుడు, ఊట పద్యకావ్య కర్త, నాటక కర్త, కోమలి కళా సమితి కోశాధికారి, గేయరచయిత, సినీనటుడు, కీ.శే. శ్రీ లింగనబోయిన ఆదెమ్మ, జగన్నాథం సాహిత్య, సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, బహుముఖ ప్రజ్ఞాశాలి **డాక్టర్ లింగన బోయిన లేఖానంద స్వామి** అన్నకు ఈ "పేర్పు" విభిన్న వ్యాసాలు ప్రేమతో అంకితం.

–రచయిత

తెలుగు సాహిత్య విమర్శకు విలువైన చేర్పు

స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, అస్తిత్వవాద (Existentialism) భావనలు గొప్పవి. ఇది నవీన భావన కాదు. ప్రపంచమంతా విస్తరించి ఉంది. తరతరాలుగా మానవజాతి పుట్టుక నుండి వివిధ సంఘర్షణలతో ఈ అస్తిత్వ భావన ప్రారంభమైంది. ఆధునిక సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాల యుగం నడుస్తున్నది. ప్రపంచ సాహిత్య చరిత్రలో జీన్ పాల్ సార్త్రే , ఆల్బర్ట్ కామ్యూ, ఫ్యోడర్ దోస్తయేవ్స్కీ , ఫ్రాంజ్ కాఫ్కా వంటి విమర్శకుల కోవలో తెలుగు సాహిత్యాన్ని అస్తిత్వ స్పృహతో అర్థం చేసుకున్న రచయిత శీలం భద్రయ్య.

విమర్శ మంచి చెడుల పరామర్శ. రచన యొక్క అంతస్సారాన్ని, ఆత్మను ఆవిష్కరించి, సమాజానికి ఏ మేరకు ఉపయుక్తమవుతుందో తేల్చి చెప్పేవాడు విమర్శకుడు. శీలం భద్రయ్య కథారచయితగా "లొట్టపీసు పూలు, గంగెద్దు" కథలను, కవిగా "ముస్తాదు" రాశాడు. నాటకాలలో నటుడిగా నటించాడు. "ఖూని" నాటిక రాశాడు. కవులు, రచయితలు అందరూ విమర్శకులు కాలేరు. లోతైన అధ్యయనం, సునిశిత దృష్టి, కవి అంతరాన్ని దర్శించే లోచూపు ఉన్నవారే విమర్శకులుగా రాణిస్తారు. శీలం భద్రయ్య విమర్శకుడిగా సూదంటురాయిలా ఉండే విమర్శకుడు.

"పేర్పు" విమర్శలో వివిధ సాహితీప్రక్రియలను తీసుకున్నాడు. పద్యం, కవిత్వం, కథ, నవల, విమర్శ, నాటకం, అనువాదం, సైన్సు వ్యాసాలూ ఉన్నాయి. విమర్శలో ఈ రకమైన వైవిధ్యం తక్కువగా కనిపిస్తుంది. శీలం భద్రయ్య ఎంచుకున్న అంశంపై సమగ్ర మూల్యాంకనం చేస్తాడు.గ్రంథ పూర్వాపరాలు, సమకాలీన పరిస్థితులు, కవి, రచయిత అంతర కోణాన్ని గ్రహించి సులభంగా పాఠకులకు అందిస్తాడు. భాష, నిర్మాణశైలి, ఇతివృత్తం, పాత్రలు సూక్ష్మ పరిశీలనతో విశ్లేషణ చేస్తాడు. కొత్త నిర్మాణ పద్ధతులు, ఆలోచనా దృక్పథాన్ని చెప్పి అబ్బురపరుస్తాడు. ఆయన విమర్శలో సామాజికతకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. దళిత బహుజన తాత్వికత ప్రధానంగా తెలుగు సాహిత్యంలోకి వస్తున్న మరో ఆధునిక విమర్శ గ్రంథం "పేర్పు". ఇది తెలుగు సాహిత్య విమర్శకు విలువైన "చేర్పు".

– డాక్టర్ సాగర్ల సత్తయ్య

7989117415

వెతుకులాట

సృజన మర్మం తెలిసినవాడు సృజనకారుడు. రచనలోని సార్వత్రిక అనుభవాలు, సాహిత్య విలువలు, నవ్యత, ప్రాసంగికత, దార్శనికత, ఆకట్టుకునే అంశాలు, ఆకట్టుకోలేని విషయాలను వెతికేపని విమర్శకుడు చేస్తాడు. రచనను బట్టి రచయిత స్థాయి ఉన్నట్టుగా, విమర్శను బట్టి విమర్శకుడి స్థాయి ఉంటుంది. రచన జీవితమనుకుంటే, పూర్తైన జీవితంలో కొత్తదనానికై వెతుకులాట విమర్శ. కూడళ్ళలో ట్రాఫిక్ కానిస్టేబుల్ వాహనాలను మళ్ళించినట్టుగా విమర్శ పాఠకులను మళ్ళించగలదు. నేడు పుస్తకాభిరుచిని పెంచడానికి రచనల కంటే, విమర్శ అవసరమే ఎక్కువగా ఉంది.

నిఘంటువు ప్రకారం "పేర్పు" అంటే ఒకదానిమీద ఒకటి పేర్చడమనే అర్థం ఉంది. కల్లు పేర్పు, పెరుగు పేర్పు, సల్లపేర్పు, నీళ్ళ పేర్పు, కుండల పేర్పు, గడ్డి పేర్పు... ఇలా అన్ని వృత్తులలో సహజంగా కన్పించే పదం "పేర్పు. తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చినట్టు, విభిన్న ప్రక్రియలు, వైవిధ్య రచనలపై రాసిన వ్యాసాలు ఈ "పేర్పు" విభిన్నవ్యాసాలు. కవులు, రచయితలు, నాటకకర్తల మేథస్సు, జీవితానుభావాలు, విశేషమైన కృషిని ఈ వ్యాసాల్లో గౌరవిస్తూ చేసిన పరామార్శ ఉంటుంది. వారి సృజనను ఏవో కొన్ని విమర్శ పరికరాల చట్రంలో బంధించి తులాభారం వేసి వారికీ, పాఠకులకు శిరోభారం కాలేదు. అవసరమైన చోట నూతన విమర్శాపద్ధతులను సూచించడం జరిగింది. వైవిధ్యం ప్రకృతి లక్షణం. చితపాల పండు తీపి, మామిడి పండు తిన్నప్పుడు రాదు. అదేవిధంగా ప్రక్రియలలో దేని అనుభూతి దానిదే. తెలంగాణ భాష, కవిత్వం, కథ, విమర్శ, అధివిమర్శ, నవల, చరిత్ర, అనువాదం, నాటిక వంటి వివిధ ప్రక్రియాపరమైన "పేర్పు" ను ఇందులో గమనించవచ్చు. ఈ విమర్శాపుస్తకం పరిశోధకులకు, విద్యార్థులకు ఇతర వర్గాలకూ ఉపయుక్తంగా ఉండగలదని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను.

"పేర్పు" విభిన్న వ్యాసాలను ప్రచురించడానికి ఆర్థిక సాయమందించిన తెలుగు విశ్వవిద్యాలయానికి మరియు ఈ వ్యాసాలను అచ్చువేసిన పత్రికా యజమానులకు ధన్యవాదాలు. పుస్తకరచయితలకు శుభాభినందనలు.

–రచయిత

విషయసూచిక

అమ్మ భాష- అమృత భాష తెలుగు

ప్రపంచంలోనే తొలి లిఖిత సాహిత్యం సంస్కృత భాషలో ఉంది. సంస్కృత భాషను "అమరవాణి, దేవభాష, సురభాష, గీర్వాణి" అని వివిధ పేర్లతో పిలుస్తారు. భారతదేశంలో 2001 లెక్కల ప్రకారం 'పద్నాలుగు వేల నూట ముప్పై మంది' సంస్కృతం మాట్లాడుతున్నారు. ప్రజల వాడుకలో లేని భాషను మృతభాష అంటారు. భారతదేశంలో సంస్కృత భాష సాహిత్యపరంగా నిద్రాణమై ఉంది. ప్రజల వాడుక పరంగా మృతభాషగా ఉంది. "భారతీయ సాహిత్యమంతా మా యూరోపియన్ గ్రంథాలయంలోని ఒక అలమారులోని ఒక అరతో సరిపోతుంది" అన్నాడు మెకాలే. ఈయన భారతీయ ప్రామాణిక గ్రంథాలైన మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, ఆనాటి మత, సాంఘిక, సామాజిక, ఆచార వ్యవహారాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. శాస్త్రీయ విద్యను భారతీయ ప్రజలకు అందించాల్సిన ఆవశ్యకతను గుర్తించి "మినిట్ ఆన్ ఎడ్యుకేషన్" కీలక విద్యాపత్రాన్ని 1835లో తయారుచేశాడు. భారతదేశంలో ఆంగ్లేయ విద్యావిధానాన్ని అమలు చేయడంతో ఆంగ్లవిద్యాబోధనకు పునాది, సంస్కృత భాషకు సమాధి కట్టబడింది. వలసపాలనలో పరిపాలనా భాషగా ఆంగ్లం ప్రోత్సహించబడింది. అప్పటివరకు భారతీయ విద్యాబోధనలోనున్న సంస్కృతం, అరబిక్, పర్షియన్ భాషలు కనుమరుగయ్యాయి. సాధారణ ప్రజల వ్యవహారంలో లేకపోవడం, అందరికీ విద్య అందుబాటులో లేకపోవడం, సంస్కృత భాషకు దైవత్వం ఆపాదించడం వంటివి సంస్కృత భాష భారతదేశంలో అంతరించడానికి మరికొన్ని కారణాలు. భారతీయ భాషల పుట్టుకను కాల్డ్వెల్ ఆర్య భాష, ద్రవిడ భాషగా నిర్ణయించాడు. విశాల భారతీయ భాషా కుటుంబం ఆధిపత్య ఆంగ్లభాషాప్రభావం చేత చిన్నాభిన్నమైంది.

తెలంగాణ ప్రాంతంలో చారిత్రకంగా సంస్కృత భాష ప్రాచీనకాలంలో ప్రాకృత భాషను మింగేసింది. నిజాం సంస్థానంలో తెలుగు భాషను ఉర్దూ మింగేసింది.

ఆధునిక కాలంలో ఆంగ్లం ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తుంది. ప్రజల నిత్యజీవిత వ్యవహారాలు, విద్యావసరాలు, సాహిత్య సృష్టి, సాంస్కృతిక, చారిత్రక, రాజకీయ, ఆత్మగౌరవ చిహ్నంగా భాష ఉన్నన్ని రోజులు అమృతభాషగా ఉంటుంది. స్వాతంత్ర్యం తరువాత భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో భాషాత్మ గౌరవం చూపింది మనమే. తెలుగు భాషకు ప్రాచీన హోదా గుర్తింపుకు తెలంగాణ శాసనాలే ఆధారమయ్యాయి. తెలుగు భాషకు గొప్ప చరిత్ర, సాహిత్య, సాంస్కృతిక వైభవం ఉంది. సంస్కృత భాషకు సమానమైన ప్రాచీన హోదా, రాజ్యాంగ గుర్తింపు ఉంది. ఆధునిక సాంకేతిక ఉపకరణాలన్నీ చక్కగా తెలుగును ధరించాయి. కృత్రిమ మేధ సైతం తెలుగు భాషను చక్కగా అర్థం చేసుకుంటుంది. మారగలిగే స్వభావమున్న భాష ఎప్పటికీ నిలబడగలుగుతుంది. సులువుగా వ్యాప్తి చెందుతుంది. ఆధాన ప్రధానాలతో తెలుగు భాష చక్కగా విస్తరించి, 2011 లెక్కల ప్రకారం దేశంలో అధికజనాభా మాట్లాడే భాషల్లో హిందీ, బెంగాలీ తరువాత రెండవ స్థానంలో ఉంది.

"సైద్ధాంతికతకు సంబంధించినది భాష" అంటాడు హెగెల్. మానవ జ్ఞానాన్ని, అనుభవాలను తరువాత తరానికి అందించేది విద్య. ఇది భావితరానికి చుక్కాని. జ్ఞాన ప్రసారానికి వాహిని భాష. మాతృభాషలో జ్ఞానప్రసారం జరిగితే సృజనాత్మక శక్తి పెరుగుతుంది. దేశవ్యాప్తంగా పన్నెండవ తరగతివరకు పాఠశాల విద్యగానే పరిగణిస్తారు. తెలుగు రాష్ట్రాలలో ఇంటర్మీడియట్ విద్యను అందించడానికి ఇంటర్మీడియట్ బోర్డును 1971లో స్థాపించారు. విద్యార్థులకు ప్రథమ భాషగా ఆంగ్లం, ద్వితీయ భాషగా తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, ఫ్రెంచ్, తమిళం, కన్నడ, ఒరియా, మరాఠి మరియు తృతీయ భాగంగా ఆప్షనల్ సబ్జెక్ట్స్ ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే తెలంగాణలో తెలుగు ద్వితీయభాషగా, ఆప్షనల్ భాషగా విద్యార్థులు ఎంపిక చేసుకోవడమేమిటని చాలాకాలంగా విద్యావేత్తలు, మాతృభాషాభిమాన సంస్థలు, వ్యక్తులు ఆందోళనను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయినా విద్యావిధానం, ఉపాధి అవకాశాలు, తల్లిదండ్రుల ఆశలపేరుతో ఇన్నాళ్ళు నెట్టుకొచ్చారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు బోధించే అధ్యాపకులు మాత్రమే

ఉన్నారు. సంస్కృత భాషాబోధనకు అధ్యాపకులు లేరు. తాజాగా ఇంటర్మీడియట్ బోర్డు సంస్కృత భాషను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా తీసుకునే విద్యార్థుల సంఖ్య, అవసరమయ్యే సంస్కృత అధ్యాపకుల సంఖ్య కొరకు విచారిస్తూ ఉత్తర్వులను జారీచేసింది. 2000 సంవత్సరం తరువాత రాష్ట్రంలో విద్య వేగంగా ప్రైవేటీకరణకు గురయ్యింది. కార్పోరేట్ విధానంతో తల్లిదండ్రులను ఆకట్టుకోవడంలో సఫలమైంది. ఇంటర్మీడియట్ విద్య మరింత వ్యాపారగుత్తాధిపత్యంతో ఒకరు ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఇప్పుడు ప్రైవేటు కళాశాలల్లో దాదాపుగా ద్వితీయభాషగా సంస్కృత భాషనే ఉంది. విద్యార్థులు మార్కుల కొరకు తెలుగును కాదని సంస్కృత భాషనే ఎంచుకుంటున్నారనేది బహిరంగ రహస్యం.

విద్యలో శాస్త్రీయత ఉండాలి. కేంద్రప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం 2020 లో కూడా మాతృభాషకే పట్టం కట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆంగ్లాన్ని ప్రథమభాషగా, ద్వితీయ భాషగానున్న తెలుగు స్థానంలో సంస్కృత భాషకు చోటిస్తే తల్లి భాషను శాశ్వతంగా పిల్లలనుండి వేరవుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భాష బోధనలో పిల్లలు సాహిత్య, సామాజిక, సాంఘిక, నైతిక విలువలు, చక్కటి సంభాషణా నైపుణ్యం, సమాచార లేఖనా నైపుణ్యం అలవడుతాయి. మాతృభాష బోధనలో అర్థవంతమైన నైపుణ్యం, సృజనాత్మకత, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, దేశభక్తి వంటివి అలవడుతాయి.

సొంత రాష్ట్రంలో తెలుగు ద్వితీయ భాషగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తెలుగును ఐచ్ఛిక భాషగా అమలు చేయడం, తెలుగు పాఠ్యపుస్తకాన్ని, ప్రశ్నాపత్రాన్ని ప్రథమ భాషా స్థాయిలో అమలుచేసి, సంస్కృతం భాష పాఠ్యపుస్తకాన్ని, ప్రశ్నాపత్రాన్ని ద్వితీయ భాషా స్థాయిలో అమలు చేయడం వలన సంస్కృతాన్ని తీసుకున్న విద్యార్థులు అధికంగా మార్కులు సాధించడం జరుగుతుంది. పునాది లేని సౌధం నిలబడదు. సంస్కృత పూర్వజ్ఞానం, అర్హత లేకుండా సంస్కృతాన్ని ఇంటర్ స్థాయిలో ఐచ్ఛికంగా ఎంపిక చేసుకుంటున్నారు. ఇది పూర్తిగా మార్కుల కొరకు అనేది బహిరంగ రహస్యం. ద్వితీయభాషగా తీసుకున్న ఇంటర్ విద్యార్థుల సంస్కృత భాషా జ్ఞానం తరువాత ఎలా ఉపయోగపడుతుందనేది ఎవరికీ అంతు చిక్కదు.

వైయుక్తిక, కుటుంబ, సామాజిక, దేశభక్తి, మానవ విలువలను

తెలుసుకోవాల్సిన కౌమారదశలో మాతృభాషను పక్కకు పెట్టడం ద్వారా సమాజానికి తీవ్ర నష్టమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. సంస్కృత విషయంలో దేవనాగరి లిపితో బాటు, ఆంగ్ల, తెలుగు లిపికి అవకాశం కల్పించడం, తెలుగుతో బాటుగా ఇతర సబ్జెక్టులకు ఆ అవకాశం కల్పించకపోవడమనేది శోచనీయం. ఇటీవల ఇంటర్ బోర్డు ఆంగ్లభాషకు ప్రాక్టికల్స్ ను పరిచయం చేసింది. అందులో భాగంగా కనీస సామర్థ్యాలు వినడం, మాట్లాడడం, చదవడం, రాయడంపై 20 మార్కులు కేటాయించింది. ఇలాంటి వెసులుబాటు తెలుగుకు లేదు.

అలాగని మాతృభాషలో సామర్థ్యాలు చూస్తే జాతీయస్థాయి ఏసర్ గణాంకాలు విస్తుపోయే విధంగా ఉన్నాయి. ప్రజలలో ఆంగ్లం పట్ల ఉపాధిపరమైన మోజు ఉన్నప్పటికీ, పత్రికలూ, ప్రచార, ప్రసార సాధనాలు, సాంకేతిక ఉపకరణాలు, నిత్యజీవిత వ్యవహారాలు, పాలన, రాజకీయాలలో తెలుగుదే పెత్తనం అన్నది జగమెరిగిన సత్యం. ప్రజల నాలుక మీద ఉన్నంత కాలం తెలుగు భాషను ప్రజలనుండి ఎవరూ దూరం చేయలేరు.

అఖిల భారత సర్వీసులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు పదోన్నతులు, ఇంక్రిమెంట్ లు సైతం కావాలంటే డిపార్ట్మెంట్ పరీక్షలలో తెలుగు ఉత్తీర్ణులు కావడం తప్పనిసరి. ఎందుకంటే వారు తెలుగు ప్రజలతో మమేకం కావాలి. స్థానిక ప్రజల సమస్యలను, సంస్కృతిని అర్థం చేసుకుని పనిచేయాల్సి ఉంటుంది. తెలుగును ఒక భాషగానే చూడకుండా, సాహిత్యపరంగా ప్రోత్సహిస్తే ఎన్నో ఉపాధి అవకాశాలున్నాయి. సృజన కలిగిన తెలుగు బిడ్డలు సినిమా, వ్యాపార, ప్రకటన, సాంకేతిక, రాజకీయాలలో భాషను చక్కగా వాడుకున్న వారెందరో ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. ఈ స్ఫూర్తితో తెలుగును ప్రథమ భాషగా గుర్తించి, ఆంగ్లాన్ని ద్వితీయ భాషగా, ఇతర భాషలను ఐచ్ఛిక భాషగా ఎంపిక చేసుకునే విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకోవాలి.

–మన తెలంగాణ, 25 ఏప్రిల్ 2025

దీర్ఘకాలిక భాషావిధానం కావాలి

తెలుగు మన మాతృభాష. అయినా ఇతర భాషలకు దక్కే గౌరవం మన మాతృభాషకు దక్కకపోవడమనే ఆవేదన ఇటీవల తెలంగాణ హైకోర్టు జడ్జి గారొకరు వ్యక్తం చేశారు. "తమిళనాడులో ప్రజలకు ఎన్ని భాషలు వచ్చినా వారు తమిళంలోనే మాట్లాడుతారు. ఇక్కడేమో ఆంగ్లంలో మాట్లాడిన వారికే ఎక్కువ మర్యాద ఇస్తారు. ఇది నా స్వీయ అనుభవం కూడా. తెలుగులో గ్రూప్ వన్ పరీక్ష రాసిన వారికి తక్కువ మార్కులు వచ్చాయన్నది ప్రధాన ఆరోపణ. దీనికి కారణమేమిటో స్పష్టత ఇవ్వాలి. తెలుగు మూల్యాంకనం చేసే వారి ప్రావీణ్యం, ప్రాతిపదిక ఏమిటో చెప్పాలని" టిజిపిఎస్సిని ఈ సందర్భంగా ఆదేశించారు.

మాతృభాష నైపుణ్యం, ఇతర భాషల విధానం పట్ల ప్రజలు, ప్రభుత్వాల తీరుకు ఈ సంఘటన ఒక నిదర్శనం. భావ, జ్ఞాన ప్రసారానికి భాష వాహికగా ఉంటుంది. ఒక జాతి మనుగడ భాషపైననే ఉంటుంది. ప్రజల వ్యవహారంలో మరియు విద్య ద్వారా భాష ప్రధానంగా కాపాడబడుతుంది. ప్రజల భాష ముఖ్యంగా వారి జీవన వ్యవహారంలో, సంస్కృతి, నాగరికత, వారి నిత్య కార్యకలాపాలు, విజ్ఞాన, సారస్వతం, కళల్లో నిక్షిప్తమై ఉంటుంది. దీనిని వారసత్వంగా తరువాతి తరానికి అందజేయబడుతుంది. మనిషిని ఉన్నతులుగా తీర్చిదిద్దేది విద్య. అటువంటి విద్యకు భాష జ్ఞాన వాహకంగా మాత్రమే పరిమితం కాదు. సృజనకు తోడ్పడే అతిముఖ్యమైన సాధనం. ప్రహ్లాదుడు "సారమెల్ల చదివితి తండ్రీ" అన్నట్టుగా మాతృభాషలో విద్యనభ్యసించడం ద్వారా జ్ఞాన సముపార్జనతో బాటుగా అర్థవంతమైన అభ్యసన సాధ్యమవుతుంది.

ప్రాచీన కాలంనుండి ఇప్పటివరకు ప్రజల భాషకు తగిన గౌరవం లభించడం

లేదు. భాష బహిరంగమైనా విద్య ఒకప్పుడు రహస్యంగా దాచిపెట్టబడింది. ఆధునిక కాలంలో విద్య అందరికీ లభించే సమయానికి ప్రపంచ భాషలు మనుషుల మధ్య అనేక అంతరాలను సృష్టిస్తున్నాయి. మరీ ముఖ్యంగా గత అర్ధశతాబ్దంలో తీవ్ర మార్పులొచ్చాయి. డెబ్బయో దశకం వరకు ఉర్దూ మాధ్యమంలో చదువు కొనసాగింది. తరువాత తెలుగు మాధ్యమం పాఠశాలలొచ్చాయి. 2012 తరువాత ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ మోడల్ స్కూల్ లతో ఆంగ్లమాధ్యమాన్ని విద్యలో పరిచయం చేసింది. ఇప్పుడు దాదాపుగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఆంగ్లమాధ్యమంలోనే ఉన్నాయి. అంటే ఒక తరం చదివిన చదువు, తరువాత తరానికి ఉపయోగపడడం లేదు. దీనిని ప్రభుత్వాలు తీవ్రంగా ఆలోచించాలి. మాతృభాష ప్రజల వెన్నెముక. విద్యా ప్రణాళికలో మాతృభాషను ఊతం చేసుకుని దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేయాలి.

ఆంగ్ల మాధ్యమం లేదా ఇతర భాషలను నేర్చుకోవడమనేది ఐచ్ఛికంగా ఉన్నప్పటికీ, విద్య, ఉపాధి, సామాజిక గౌరవం మూలంగా ప్రజలు మాతృభాషను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం విధానపర నిర్ణయాలతో ఈ సమస్యను తొలగించవచ్చు. మాతృభాష తెలుగును నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలికంగా నష్టపోతాము. “ఉన్నస్థితి నుండి ఉన్నత స్థితికి ఎదగడమే వివేకం” అంటారు. తెలుగు భాషను ఉన్నస్థితిని ఉన్నతస్థితికి మార్చే వివేకవంతమైన నిర్ణయాలు తీసుకోవాలి.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా జరిగాయి. ప్రథమ భాషగా పన్నెండవ తరగతివరకు వరకు తెలుగును తప్పనిసరి చేయాలనుకున్నా వివిధ కారణాల వలన పదవతరగతి వరకు మాత్రమే పరిమితం చేస్తూ పాలనాపర నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ఇంటర్మీడియట్ విద్యలో ద్వితీయ భాషగా తెలుగు స్థానంలో సంస్కృత భాష ప్రవేశబెట్టడం గురించి భాషావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడం జరిగింది. వారి ఆవేదన ప్రజల ఆవేదన. అర్థవంతమైనది. భావి సమాజానికి విద్య ఒక్కటే చాలదు. విలువలు, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం, విలువలుగల సమాజ నిర్మాణానికి మాతృభాష అభ్యసనం తప్పనిసరి. ఇక్కడ తల్లిదండ్రులు కూడా ఆలోచించాల్సింది ఉంది. ఎలాగూ చదువులు ఆంగ్లభాషలోనే ఉన్నాయి. మాతృభాషను పిల్లలకు ఒక విషయంగా కూడా చదవకపోతే వారు భవిష్యత్తులో ఆత్మవిశ్వాసంతో ఎలా

జీవించగలుగుతారు. భావ వ్యక్తీకరణ ఎలా చేయగలుగుతారు.

సమాజంలోని సంక్లిష్టతలను, జీవిత సవాళ్ళను ఎలా ఎదుర్కొంటారో ఆలోచించాలి. బలవంతంగా "విద్య, ఉన్నత ఉపాధి, సామాజిక గౌరవం" ఉచ్చులో పడి వారి జీవితాలను అర్ధరహితంగా మార్చకూడదు. ఒక్క చక్కని తెలుగు పద్యం గొప్ప వ్యక్తిత్వ వికాస పాఠాన్ని, జీవన విలువలను నేర్పగలదు. సాధారణంగా ఇంటర్మీడియట్ స్థాయిలో పిల్లలు కౌమారదశలో ఉంటారు. మాతృభాష తెలుగు తప్పనిసరిగా వారికి అవసరమయ్యేది ఆ దశలోనే. కానీ విచిత్రంగా మార్కుల కొరకు ఇతర భాషలను ప్రోత్సహిస్తున్నారు. దీనిని శ్రేయోరాజ్యాలుగా ప్రజాస్వామ్య ప్రభుత్వాలు పట్టించుకోవాలి.

తెలుగు రాష్ట్రాలలో ఇంటర్మీడియట్ విద్యను అందించడానికి ఇంటర్మీడియట్ బోర్డును 1971లో స్థాపించారు. విద్యార్థులకు ప్రథమ భాషగా ఆంగ్లం, ద్వితీయ భాషగా తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, ఫ్రెంచ్, తమిళం, కన్నడ, ఒరియా, మరాఠి మరియు తృతీయ భాగంగా ఆప్షనల్ సబ్జెక్ట్స్ ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే తెలంగాణలో తెలుగు ద్వితీయభాషగా, ఆప్షనల్ భాషగా విద్యార్థులు ఎంపిక చేసుకోవడమేమిటని చాలాకాలంగా విద్యావేత్తలు, మాతృభాషాభిమాన సంస్థలు, వ్యక్తులు ఆందోళనను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయినా విద్యావిధానం, ఉపాధి అవకాశాలు, తల్లిదండ్రుల ఆశల పేరుతో ఇన్నాళ్ళు నెట్టుకొచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు బోధించే అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. సంస్కృత భాషాబోధనకు అధ్యాపకులు లేరు. ఇంటర్మీడియట్ బోర్డు సంస్కృత భాషను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా తీసుకునే విద్యార్థుల సంఖ్య, అవసరమయ్యే సంస్కృత అధ్యాపకుల సంఖ్య కొరకు విచారిస్తూ ఉత్తర్వులను జారీచేసింది.

భారతదేశంలో 2001 లెక్కల ప్రకారం 'పద్నాలుగు వేల నూట ముప్పై మంది' సంస్కృతం మాట్లాడుతున్నారు. భారతదేశంలో సంస్కృత భాష సాహిత్యపరంగా నిద్రాణమై ఉంది. ప్రజల వాడుక పరంగా మృతభాషగా ఉంది. మెకాలే "మినిట్ ఆన్ ఎడ్యుకేషన్" కీలక విద్యాపత్రంతో భారతదేశంలో ఆంగ్లేయ విద్యావిధానాన్ని అమలు చేయడంతో ఆంగ్లవిద్యాబోధనకు పునాది, సంస్కృత భాషకు సమాధి కట్టబడింది.

వలసపాలనలో పరిపాలనా భాషగా ఆంగ్లం ప్రోత్సహించబడింది. అప్పటివరకు భారతీయ విద్యాబోధనలోనున్న సంస్కృతం, అరబిక్, పర్షియన్ భాషలు కనుమరుగయ్యాయి.

తెలుగు భాషకు సంస్కృత భాషతో సమానమైన ప్రాచీన హోదా గుర్తింపు, రాజ్యాంగ గుర్తింపు ఉంది. ఆధునిక సాంకేతిక ఉపకరణాలన్నీ చక్కగా తెలుగును ధరించాయి. కృత్రిమ మేధ సైతం తెలుగు భాషను చక్కగా అర్థం చేసుకుంటుంది. మారగలిగే స్వభావమున్న భాష ఎప్పటికీ నిలబడగలుగుతుంది. సులువుగా వ్యాప్తి చెందుతుంది. ఆధాన ప్రధానాలతో తెలుగు భాష చక్కగా విస్తరించి, 2011 లెక్కల ప్రకారం దేశంలో అధికజనాభా మాట్లాడే భాషల్లో హిందీ, బెంగాలీ తరువాత రెండవ స్థానంలో ఉంది.

విద్యలో శాస్త్రీయత ఉండాలి. కేంద్రప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం 2020లో కూడా మాతృభాషకే పట్టం కట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆంగ్లాన్ని ప్రథమభాషగా అమలుజేస్తున్నారు. ద్వితీయ భాషగానున్న తెలుగును తప్పనిసరి చేయాలి. దీని ద్వారా పిల్లలకు సాహిత్య, సామాజిక, సాంఘిక, నైతిక విలువలు, చక్కటి సంభాషణా నైపుణ్యం, సమాచార లేఖనా నైపుణ్యం అలవడుతాయి. మాతృభాష బోధనలో అర్థవంతమైన నైపుణ్యం, సృజనాత్మకత, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, దేశభక్తి వంటివి అలవడుతాయి. తెలుగును విద్య, ఉద్యోగ, నిత్య వ్యవహార లక్ష్యంగా ఉన్నతీకరిస్తే తెలుగు భాష దేశంలోనే నంబర్ వన్ గా నిలుస్తుంది. అత్యధిక ప్రజలు తెలుగు మాట్లాడగలిగేదిగా మారుతుంది.

–నమస్తే తెలంగాణ, 12 మే 2025

సృజనాత్మకథలో సంస్కరణాత్మకత

వాస్తవికతను కలిగిన గద్య కల్పిత గాథను కథ అంటారు. తెలుగులో కథలు వచ్చినంతగా కథావిమర్శ లేదని అందరూ అంగీకరిస్తారు. కథానిర్మాణంలో వస్తువు, భాష, శైలి, శిల్పం, ఇతివృత్తం, పాత్రలు, సన్నివేశ చిత్రణ, సంభాషణలు, రచయిత గొంతువంటి ఇత్యాది అంశాలలో "వాస్తవికత, కల్పితాంశం" అనేవి ప్రధానమైనవి.

కథలో పాఠకునికి "వాస్తవికత" అనేది మానవ జీవన సారూప్యతను కలిగిస్తే, "కల్పితాంశం" అనేది మానవ భావోద్వేగ జ్ఞానాన్ని లోతుగా విస్తరించడానికి దోహదపడుతుంది. కథలో రచయిత కల్పితస్థాయిని బట్టి కథలను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. వాస్తవికత లోపించిన ఊహాజనిత కథలు, తక్కువ కల్పితాంశం కలిగిన కథలు, కల్పితాంశం లోపించిన వాస్తవిక కథలు, వాస్తవికత మరియు కల్పితాంశం సమపాళ్ళలో కలిగి ఉన్న కథలు.

కథ కూడా సృజనాత్మక ప్రక్రియేనని అందరూ ఒప్పుకుంటున్నా, నిజానికి కల్పితానికి, సృజనకు వ్యత్యాసం ఉంది. కథలో రచయిత ఊహకు సృజన అవసరమయినా, అది అక్కడే ఆగిపోతే దానిని "కల్పితం" అంటారు. అలా కాకుండా ఊహను వాస్తవికంగా మార్చడానికి ప్రయత్నిస్తే దానిని "సృజనాత్మకత" అంటారు. దీని ఆధారంగా కథలను వాస్తవిక, కల్పిత, సృజనాత్మక కథలుగా వర్గీకరించుకోవచ్చు. సృజనాత్మక కథల్లో సామాజిక ఆదర్శం ఉంటుంది. ఆదర్శం సామాజిక సంస్కరణను కోరుకుంటుంది. రచయిత ఊహలో కథాంశం స్వీయ లేదా సామాజిక సమస్య ప్రధానంగా, వాస్తవిక ప్రపంచంతో అనుసంధానమై పరిష్కారం కనుగొనడానికి దారిని అన్వేషిస్తున్నట్టుగా సృజనాత్మక శైలిలో ఉంటుంది. కల్పితాంశ కథలో కథకుడు తనతోబాటుగా పాఠకులను ఊహప్రపంచం వరకు మాత్రమే పరిమితం చేయగలడు. వారు మిథ్యాప్రపంచ అవధులను దాటి వాస్తవిక ప్రపంచంలోకి అడుగుపెట్టలేరు. కాబట్టి సృజనాత్మక కథల్లో "సంస్కరణవాదం" ఉంటుంది. తెలుగులో మొదటగా వచ్చిన కథల్లో ఈ సంస్కరణవాదమే ప్రధానంగా కనిపిస్తుంది. తెలుగు కథలో

కల్పితాంశం క్రమంగా సృజనాత్మకతవైపు పరిణామం చెందడంతోనే కల్పితవాదం నుండి, వాస్తవిక, సంస్కరణ వాదం పరిణామం చెందింది.

కల్పిత కథలుగా విక్రమార్కకథలు, దశకుమార చరిత్ర, పంచతంత్ర కథలు, కాశీమజిలీ కథలతో బాటుగా జానపదకథలు భారతీయసాహిత్యంలో అచిరకాలంగా ప్రజల మన్నన పొందిన కథలు. కవిత్వంలాగే కథ కూడా కాలంతో బాటు పరిణామం చెంది సంస్కరణవాదం సామాజికవాదంగా మారింది. దీని ఫలితంగా తెలుగులో వచ్చిన కథలు సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులను ప్రతిబింబించే విధంగా రాయబడ్డాయి. అభ్యుదయ కథలు, విప్లవ కథలు, దళిత కథలు, స్త్రీవాద కథలు, మైనారిటి కథలు, బహుజనవాద కథలు, ప్రాంతీయ, అస్తిత్వ ఉద్యమాల నేపథ్యం ఉన్న కథలు వంటి అనేక రకాల సంస్కరణ ప్రధానంగా కథాసాహిత్యం వచ్చింది. అయితే కథాసాహిత్యంలో ఉన్నంతగా సంస్కరణవాదమనేది కవిత్వంలో కనిపించదు. కల్పనలో సంస్కరణవాదమనేది సామాజిక మార్పును ప్రోత్సహించడానికి ఒక సృజనాత్మక కళాసాధనం.

గురజాడ అప్పారావు "దిద్దుబాటు"కథలో వేశ్యాలోలుడైన భర్తను భార్య కాపాడుకున్నా, బండారు అచ్చమాంబ రాసిన "ధన త్రయోదశి" కథలో దురాశకు లొంగకుండా ఉన్నందుకు, "నిజాయితీకి దక్కిన ఫలితం", సురవరం ప్రతాపరెడ్డి వెట్టిచాకిరికి వ్యతిరేకంగా "సంఘాల పంతులు" కథను రాశాడు. చెరబండరాజు రాసిన విప్లవకథ "చిరంజీవి". పోలీసువ్యవస్థను విమర్శిస్తూ, నక్సలిజానికి సానుభూతిగా ఈ కథను రాశాడని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శాసనసభలో హోంమంత్రి చదివి, ఈ కథను ప్రభుత్వం నిషేధించినట్టుగా ప్రకటించడం జరిగింది. నెల్లూరి కేశవస్వామి కథలు ఫ్యూడల్ సమాజానికి "యుగాంతం" పలికిన కథను, మతంతో సంబంధం లేని "కేవలం మనుషులం" వంటి కథలను రాశారు.

పివి నరసింహారావు రాసిన "గొల్లరామవ్వ" కథ నిజాం వ్యతిరేకఉద్యమ కాలంనాటి కథ. వెట్టి చాకిరి, శ్రమదోపిడీ పై బోయజంగయ్య రాసిన "ఎచ్చరిక", గ్రామీణ దోపిడీ, అణిచివేత ప్రధానంగా అల్లం రాజయ్య రాసిన "ఎదురు తిరిగితే" వంటివి అభ్యుదయ కథలు. విప్లవ సాహిత్య అవగాహనలో బహుజన, దళిత జీవన తాత్వికతతో కథలు రాసినవారు బి.ఎస్ రాములు. "పాలు" కథలు తెలంగాణ

సామాజిక పరిణామాన్ని వివరించే కథలు. తెలంగాణలో దళితకవిత్వం వచ్చినంతగా కథలు రాలేదనే విమర్శ ఉంది. ఈ లోటును గుడిపల్లి నిరంజన్ సంపాదకీయంలో "తెలంగాణ దళిత కథలు", ప్రతీ ఏటా వచ్చే "కథా వార్షికలు" ఆలోటును భర్తీచేస్తున్నాయి. బోయ జంగయ్య "పనిష్మెంట్" కథ, కాలువ మల్లయ్య "వెలి" కథ, జూపాక సుభద్ర "రామక్క మాన్యం", జాజుల గౌరీ "మన్నుబువ్వ" వంటి కథలతో దళిత స్త్రీలను చైతన్యవంతులను చేస్తే, ఇల్లిందల సరస్వతీదేవి, పాకాల యశోద "ఎచ్చమ్మ కథలు", ముదిగంటి సుజాతారెడ్డి "విసుర్రాయి", షాజాహన "సిల్ సిలా, లద్ధాఫ్ని"వంటివారు తమ కథల ద్వారా మహిళలను చైతన్యపరిచారు. ఓల్గా రచించిన "అయోని" కథ స్త్రీ సంస్కరణవాద ఇతివృత్తంతో కూడిన కథ. ఇందులో పదేళ్ళ బాలిక తన యోనిపై వ్యధాపూరిత ఆగ్రహం వ్యక్తం చేసిన సాంఘిక సంస్కరణవాదం శక్తివంతంగా కనిపిస్తుంది. పొట్లపల్లి రామారావు, వట్టికోట ఆళ్వారుస్వామి, కాంచనపల్లి చినవెంకటరామారావు, ఆవుల పిచ్చయ్యలాంటి వారు కాల్పనికతకు దూరంగా, వాస్తవిక ఉద్యమ సంఘటనలను ప్రతిబింబిస్తూ కథలు రాశారు. గూడూరి సీతారాం సిరిసిల్ల కార్మికుల జీవితాలను, బహుజన జీవితాలను దేవులపల్లి కృష్ణమూర్తి "కథల గూడు, తారుమారు" కథలలో, ఉప్పల నరసింహం "సబ్బండవర్గాల సారస్వతం" పేరుతో కథలను రాశారు. శీలం భద్రయ్య లొట్టపీసు పూలు, గంగెద్దు కథలు, సాగర్ల సత్తయ్య "బర్కతి" కథలు సంస్కరణవాద కోణంలో కనిపిస్తాయి. సాహిత్యమంటేనే సామాజిక సంస్కరణవాదం. దీని కొలబద్ధ మాట్లాడాల్సి ఉంటుంది.

సంస్కరణవాద కథల్లో కల్పితాంశంతో రాసిన కథలు, సృజనాత్మకతతో రాసిన కథలు ఉన్నాయి. సృజనాత్మక కథలలో "ఊహజనిత ప్రపంచం" కనపడదు. వాస్తవిక జీవన సమస్యలు, సామాజిక సంవేదనలు ఉంటాయి. సమాజంలోని కట్టుబాట్లను కాపాడే ఆదర్శం పట్ల నిరసన ఈ కథల్లో వ్యక్తంచేయబడి ఉంటాయి. అయితే సంస్కరణవాద కథల్లో "హితబోధనం" ప్రధానంగా ఉండి, కళాత్మకత శైలి లోపించడం వలన పాఠకులను ఆకట్టుకోలేని శైలి ఉంటుందనేది ప్రధాన విమర్శ. అయినప్పటికీ తెలుగు కథాకల్పనలో సామాజిక సంస్కరణవాదమే పై చేయిసాధించిందని నిరభ్యంతరంగా చెప్పవచ్చు.

–6 జనవరి 2025, నమస్తే తెలంగాణ, చెలిమె

పద్యం వన్స్ మోర్

చరిత్రను పరిశీలిస్తే, విద్యను కింది కులాలకు అందకుండా ప్రభావితం చేసే అగ్రవర్ణాలు ఎప్పటికప్పుడు కుట్రపూరితంగా విద్యా విధానాన్ని మారుస్తూ వచ్చాయి. ప్రాచీన కాలంలో పండిత భాష వేరు, ప్రజల భాష వేరు. పండితులు ప్రజల భాషను పామరుల భాష అని, రాక్షస భాష అని వెక్కిరించి, అవహేళన చేశారు. ప్రజలు అంటే ఉత్పత్తి కులాలని వేరే చెప్పనక్కర్లేదు. ఆధునిక కాలంలో వలసవాద ధోరణితో వారి భాషను ఇక్కడి ప్రజలపై బలవంతంగా రుద్ది, పాలనా భాష ఆంగ్లం, ఉర్దూ వంటివి అమలుజేస్తూ, ప్రజలపై తమ భాషను బలవంతంగా రుద్దడం జరిగింది. ఇప్పుడయితే ప్రతీ ముప్పై, నలభై ఏళ్లకు ఒకసారి విద్య పేరిట తరానికో మాధ్యమం ప్రవేశబెడుతున్నారు. తెలంగాణ ప్రాంతంలో డెబ్బై ఏళ్ళక్రితం ఉర్దూ మాధ్యమం ఉంటే తరువాత, మాతృభాష తెలుగు మాధ్యమం ప్రవేశబెట్టారు. అది కూడా ఆమోదయోగ్యత, స్థానికత లేని భాష. అది వేరే సంగతి. మరో ముప్పై నలుబై ఏళ్లకు ఆంగ్ల మాధ్యమం మారింది. ఇప్పుడు ప్రపంచ భాషలని చిన్నారుల మీద చైనీస్ మాండరీన్, ఫ్రెంచ్ వంటివి అక్కడక్కడా అంతర్జాతీయ పాఠశాలల పేరు మీద రుద్దుతున్నారు. ఇది విస్తరించడానికి ఎక్కువ సమయం తీసుకోకపోవచ్చు.

చెప్పొచ్చేదేమిటంటే ఇతర భాషలు చదవడం తప్పని ఎవరూ చెప్పరు. కానీ మాతృభాష గొప్పదనం గురించి మాట్లాడిరావాల్సిన దుస్థితి గురించే ఈ భాధ. ప్రజల భాషకు ప్రజలే గౌరవం ఇవ్వడం లేదు. కారణం ఉపాధి సమస్య కావొచ్చు. ప్రజల భాషకు పాలకులూ గౌరవాన్ని ఇవ్వక పోవడం కావొచ్చు. పరి పాలనా సౌలభ్యత కావొచ్చు. ప్రజల భాషకు పండితులూ గౌరవాన్ని ఇవ్వడం లేదు. కారణం అహం కావొచ్చు. పద్య విద్య అనేది పండితులకు పరిమితమైనదనే దురభిప్రాయం ఉంది. విలు విద్యకు వేలు వదులుకోవాల్సిన ఏకలవ్యుడి సాక్షిగా, కింది జాతులు ఘంటం పడితే, పద్యం నాలుకపై ఆడితే నాలుక చీరేయడం, కోయడం జరిగింది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజా అస్తిత్వ వాదం వచ్చాక, ప్రాచీన సాహిత్య ప్రక్రియలకు ప్రజాదరణ తగ్గింది. అంతకు ముందు ఉత్పత్తి కులాలు శ్రమ మర్చిపోవడానికి, పనితో బాటు పుట్టిన పాటలను పద్యాలుగా, గేయాలుగా పాడినవి అక్షరజ్ఞానం ఉన్న కొంతమంది పండితులు తమ పేరుమీదే రికార్డు చేసుకున్నారు.

రాజుల ప్రాపకం కోసం పద్యం తమదని కైవసం చేసుకున్నారు. దానితో పద్యం పండితులది కాగా, పదం జానపదులకు సొంతమైంది. సంగీతం, సాహిత్యపరంగా జానపదులలోని పదంలో ఉన్న గొప్పదనం, పద్యంలో కనిపించదు. ఈ విషయం మీద విశ్వవిద్యాలయాలు పరిశోధనకు ఉపక్రమించాలి. జానపద సాహిత్యంపై వచ్చే ఇప్పటి పరిశోధనలు తగు నాణ్యత లోపించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటే బాగుంటుంది.

నల్లగొండకు చెందిన తాజా విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోమటి మధుసూదన్ రాసిన పద్య ఖండకావ్య సంపుటిని “మధురగీతి” మెరుపున్న రచన. కష్టపడి చదివి, ఉపాధ్యాయుడుగా ఎదిగిన జీవితంలోని అనుభవాలు, తండ్రి సాంబయ్యా నేతగాడు. పద్య మాధ్యుర్యాన్ని తన కుమారుడికి పరిచయం చేశాడు. తోడు చక్కని గురువులు లభించారు. వీరంతా కలిస్తే కోమటి మధుసూదన్. వారిది చక్కని కంఠం. తెలుగును బోధించేందుకు అవసరమయ్యే గొంతు, లయ, శృతి, భావుకత, ఆసక్తితో బాటు ప్రభుత్వ పాఠశాలల మీద బాధ్యత కలిగినవాడు. అభ్యుదయ ఉపాధ్యాయ సంఘంలో బాధ్యుడుగా ఉంటూ, ఉపాధ్యాయ సమస్యల మీద శ్రమించాడు. నల్లగొండ జిల్లా “ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ సమితి” ప్రధానకార్యదర్శిగా పనిజేస్తున్నారు. అనేక పర్యాయాలు ఉపాధ్యాయ శిక్షణను ఇచ్చే బాధ్యతలను ఇష్టంతో స్వీకరించారు. సుమారు 31 సంవత్సరాలు ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిజేసి మార్చి 2024లో పదవీవిరమణ పొందారు.

ఈకాలంలో పద్యవిద్య అంటరానిదయింది. పాల్కురికి, తిక్కన, పోతన, ఎర్రన, దూర్జటిల తరువాత పద్యం రాజాశ్రయం పొంది విటులతో కొంతకాలం తిరిగింది. తరువాత వేమన, బద్దెనలతో ప్రజలను చేరింది. ఆ తరువాత ఆధునికకాలంలో రంగస్థల నాటకాలలో రాజ్యమేలింది. కానీ నేటి కాలంలో పద్యం సామాన్యులకు దూరమయింది. నిజానికి పద్యం ప్రజలకు దూరం కావడానికి దానికి ఉండే వ్యాకరణ, ఛందో నియమాలు కానేకాదు. వేల సంవత్సరాలుగా లేని ఆటంకం ఆధునిక కాలంలో ఎందుకు ఉంటుంది. ఈ పాపం అభ్యుదయ, విప్లవ వాదులదే అని నా అభిప్రాయం. స్వేచ్ఛానువాదం, ఇతర భాషల నుండి కాపీవాదం సాహిత్యమై పోయిన కాలంలో వాదాల పేర కవిత్వాన్ని గుమ్మరించిన కవి వర్గం ఒకవైపు,

పద్యాన్ని చెరబట్టి వాణిజ్యం చేసిన వర్గం మరోవైపు ఉన్నారు.

"మధురగీతి"లో మొత్తం 28 ఖండికలు, రెండొందలకు పైగా పద్యాలున్నాయి. దేవుడు దెయ్యం వంటి అభూత కల్పనలు, అంధ విశ్వాసాలు లేవు. అయినా కోమటి మధుసూదన్ తన భావప్రకటనకు ఈ పద్య ప్రక్రియను ఎంచుకుంటే, "సంప్రదాయం అనుసరించారేంటి?" అనే ప్రశ్న వస్తుంది. ఆయన పద్యం ఎంచుకోవడానికి కారణాన్ని "పద్యం-హృద్యం"పద్యంలో చెప్పాడు.

"పద్యము సాహితీ ప్రక్రియలలో మేటి
నరుని స్మరనలోన నడుపు నదియు
ప్రాస, యతులు రెండు శ్వాసలుగా గల్గి......."

నాలుగు చరణాల నడిచేటి వయ్యారి...." అంటాడు. అంతే కాకుండా పద్యం చదివితే పలుకు స్పష్టత వస్తుంది. సభ మెచ్చుతుంది. ధారణ పెరుగుతుంది. హృదయం పరవశిస్తుంది. పదసంపద పెరిగి భాష కుదురుతుంది అంటాడు. నిజమే కదా! విదేశాలలో మేనేజ్మెంట్ విద్యలో కూడా నేర్పునది ఇదే కదా!

"కవిత్వం అంటే పిల్లను పెండ్లిపిల్లను చేయడమే!" అంటాడు కవి. "మధుర గీతి" పద్యాలలో అధిక భాగం స్త్రీ ఔన్నత్యాన్ని కీర్తించినవే కావడం గమనార్హం. "సహచరి" ఖండికలో ...మగడొక సగభాగము, యా మగువొక సగమనిరి కాని మగడేమైనన్, సగమును పూర్ణము చేసేడు సగమా! సంసారమునకు సారము నీవే!" అని భర్త మధ్యలో వదిలేసి పోతే, ఆ సంసారాన్ని పిల్లలను బాధ్యతగా పరిపూర్ణం చేసే మహిళల నిండైన గొప్పదనాన్ని కవి కీర్తించాడు. అదేవిధంగా "అమ్మ" ఖండికలో "అమ్మకు శిశువే సర్వము, ఇమ్మహి శిశువునకు అమ్మయే సర్వమగున్...ఆట పాటల వయసున, లోటేరుగని అమ్మ మాట లోకులకెల్లన్! " అంటాడు. నిజమే కదా, చిన్నప్పుడు అందరికీ అమ్మమాటే సర్వస్వం. నాన్న త్యాగము, గొప్పదనం గురించి చెబుతూ " తనదు జీవితమంత పోషణకు పంచు, తండ్రి కష్టము వర్ణించ తరమె మనకు?" అని ప్రశ్నిస్తూ, దన్నుగా నిలిచెడు వెన్నుముకయే నాన్న" అంటాడు. ఈ కవిలో శాస్త్రీయత హెచ్చు. హేతుబద్ధత ఉంది. ఎక్కడా దైవిక ప్రస్తావనలు లేవు. తండ్రి చేసిన కులవృత్తి నేతపనిపై అపారమైన గౌరవం ఉంది. కవి అంటే పదాలను అర్థం చేసుకోవాలి. కొత్త పదాలను పదబంధాలను సృష్టించగలగాలి. "వస్త్రదాత"

ఖండికలో నేతన్న కష్టాన్ని ప్రస్తుతిస్తూ, ...అర్థ తనువు గోతియందు నిలిపి, ప్రజకు వస్త్రమల్లు నేత ప్రస్తుతింతు!" అంటాడు. అదేవిధంగా నేతన్నకు "నేత వలన నీకు నెయ్యి బువ్వో" అంటాడు. అంటే నేత నేస్తేనే బువ్వ కలుగుతుంది అని దాని అర్థం. కవి వైయక్తిక బాధలు, జ్ఞాపకాలు, అనుభవాలు సామాజిక పరమైనవిగా సామాన్యీకరణ జరిగినపుడు ఆ కవిత్వం నిలబడుతుంది. నోస్టాల్జియా కవిత "బాల్య జ్ఞాపకాలు, నేటి బాలలు"లలో కవి తన చదువు సాగించిన తీరును, నాటి వసతుల లేమి బాధ్యత, పట్టుదలను పెంచితే, నేటి తరానికి అన్ని సౌకర్యాలున్నా చదువు నేర్చుకోలేక పోతున్నారని బాధపడడం చూస్తాము. "చూచి రాయలేరు సాచి చదువలేరు, తెలుగు భాష నోరు తిరగదనిరి, ఆంగ్లభాష కూడ అంతంత మాత్రమే, అదియురాదు తుదకు ఇదియు రాదు" అని ఒక సమకాలీన వాస్తవాన్ని పద్యీకరించారు. "లేని నాడు వసతి లేదని వలపోత, అన్నియున్న నేడు అలుసు చూడ, బాల్యమందు చదువుపై శ్రద్ధ లేకున్న చదువు మీద ప్రేమ చచ్చిపోవు" అంటాడు.

ఈ పుస్తకంలో మకుటాయమాన పద్యం "కోడిపుంజు". కోడిపుంజు వర్ణన, కవి దానిని కాలజ్ఞానిగా గుర్తించడం బాగుంటుంది. ఇది ఎప్పటికైనా పాఠ్యపుస్తకాలలోచోటుచేసుకోవాల్సిందే. "...పగలు పగలంత జీవిత పరుగులోన, వీధి వీధికి తిరుగుటే విధిగ మారు, ఒక్కటున్నను పదియిండ్ల దిక్కు తాను, కన్ను మూయునో, మూయదో కాహళమ్ము..." అని కోడిపుంజు గొప్పదనాన్ని వర్ణించాడు. మరో ఖండిక" బంగారు పాప"లో ప్రజలు బంగారాన్ని పాపాయిలా ముద్దు చేస్తారని, ఇనుమును పట్టించుకోరని, నిజానికి ఇనుమే మనిషి జీవితాన్ని నడిపించేదని బంగారం కంటే ఇనుము గొప్పదనే నూతన స్థిరీకరణ చేశాడు. "బంగారు నగలు తొడుగుట, ..., అది చూడగ యినుము కన్న అధికంబగునే?, పొలము దున్నంగ నాగలి ముక్కు కర్రౌన? ....సుత్తి అవునా?....వ్యవసాయ పనిముట్ల ప్రస్తావన తెస్తాడు. ఈ ఖండకావ్యంలో మానవ జీవన అనుభవం, ఆకాంక్షలు, సామాజిక బాధ్యత, కవి కోరుకునే కొత్తసమాజం కనిపిస్తాయి. ప్రతి పద్యంలో ఎత్తుగడ, ముగింపు వైరుధ్యంతో కొనసాగుతాయి. సమస్య ఉన్నచోట చివరికి పరిష్కారం, కొత్తది బాలేకపోతే పాతది స్మరించడం, పాతది బాలేకపోతే కొత్తదాన్ని ఆహ్వానించడం ఇలా సాగుతుంది.

–నమస్తే తెలంగాణ, 10 జూన్ 2024

దళిత కవితకు తార్కిక పదును

దిశానిర్దేశం లేని అర్థరహిత జీవితాన్ని, కలయొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసిద్ధ అమెరికన్ బ్లాక్ పోయేట్ లాంగ్ స్టన్ హ్యూస్ "కలలు లేని జీవితం, ఎగరలేని రెక్కలు విరిగిన పక్షి" వంటిదని అంటాడు. కలలు మెరుగైన భవిష్యత్తు కోసం ప్రేరణనిచ్చి, పోరాడడానికి శక్తినిస్తాయి. ఇక్కడ కల అంటే గమ్యాన్ని నిర్దేశించుకోవడంలో హేతువాద ఆలోచన కలిగిన తాత్వికత. భారతీయ సమాజం సామాజిక కుల అంతరాలను, సమాన రాజ్యాంగ ప్రజాస్వామ్యహక్కులను కలిగి ఉంది. అయినా సామాజిక అసమానతలు ఇంకా ఒక ప్రధాన సమస్యగానే ఉంది. రాజ్యాంగం చట్టపరంగా సమానత్వాన్ని నెలకొల్పినప్పటికీ, సామాజిక స్థాయిలో మార్పును తీసుకురావడానికి కవిత్వమే శక్తివంతమైన సాధనం కాగలదు. సమస్యస్పష్టతను కలిగించడానికి, లోతుగా అర్థం చేసుకోవడానికి, కవిత్వానికి తాత్విక ఆలోచనలు అవసరమవుతాయి.

అంతర్జాతీయ బ్లాక్ పోయెట్రీలా భారతీయ కులవివక్షకు వ్యతిరేకంగా వచ్చిన నిరసన కవిత్వమే దళితకవిత్వం. ఇది బౌద్ధం, అంబేద్కర్ రాజ్యాంగం, మార్క్సిజం తాత్వికతను ఆపాదించుకున్నాక కవిత్వోద్యమస్థాయిని దాటి పరిణిత దళిత సాహిత్యంగా మార్పుచెందింది. వేముల ఎల్లయ్య రాసిన "క్రీనీడ" తార్కిక కవిత్వం దళిత తాత్వికతతో లోచూపు, విశ్వజనీన విశాల దృక్పథంతో తర్కించుకుంటూ పరిణామం చెందినట్టుగా కనిపిస్తుంది. దీనిలో కేవలం అనుభవాలను వ్యక్తీకరించడమే కాకుండా, పరిష్కారం కనబడుతుంది. వెలుతురులేని ఛాయను నీడ అంటారు. వెలుతురులో జీవించలేని జీవితాలపట్ల వివక్షకు నీడ ప్రతీక. "క్రీనీడ" అంటే కింది నీడని అర్థం. ఈ పదబంధం తీవ్ర అణిచివేత, పరాధీనతను సూచించినా, "క్రీనీడ" కవిత్వం హేతువాదంతో పరిష్కారం దిశగా ఆధిపత్యాన్ని సవాలు చేస్తుంది.

విశ్వసాహిత్యం విశ్వాసాల మీదకంటే వాస్తవాల మీద నిర్మించబడి ఉంది. గుర్తింపు, ఆత్మగౌరవం, వివక్ష, అణిచివేత, పోరాట ఆవశ్యకత, సామాజిక సమానత్వం, హక్కుల సాధనవంటి దశలను గురించి చర్చిస్తూ, తమ బలమైన మూలాలు గుర్తుచేస్తూ "క్రీనీడ" తార్కిక కవిత్వం జాతికి దిశానిర్దేశం చేస్తుంది. ఈ కవిత్వంలో సొంతభాష, స్వీయ అనుభవాలు, భావోద్వేగాలు కవికి మాత్రమే పరిమితం కాలేదు. సార్వజనీనమైనవి. ఆవిధంగా "క్రీనీడ" తార్కిక కవిత్వం అంతర్జాతీయస్థాయి కవిత్వం.

రెక్కలు లేని పక్షి ఎగరలేదు. తాత్వికత లేని కవి స్వతంత్రంగా ఆలోచించలేడు. తర్కించలేడు. అలాంటి లిల్లీపుట్ కవుల గురించి వేముల ఎల్లయ్య “గతి” కవితలో రాశాడు. “మొగవేశ్య కవీ మొఖం కప్పిన పట్టుచీర/...ఏదేశం దేవ్లాడినా మీలాంటి సంస్కృతి తస్కరీ కవులు దొరుకున?/ ఏం! లగాయించిన లత్కోర్సాఫ్ కూలిపోయే పాలకుని నిల్పే కైతా!” అని రాజకీయనాయకుల అధికారాన్ని నిలబెట్టడానికి కవిత్వాన్ని రాసే వెన్నులేని కవులను కవిత్వబోనులో దోషిగా నిలదీస్తాడు.

ఇందులోని కవితలు ఎక్కువగా సామాన్యుల విజయాలు, సామాజికంగా బలిదానాలు, వారి త్యాగాలను కీర్తించడం, మహిళలు, దళిత, బహుజన కవులు, కళాకారుల స్మృతి (ఎలీజి) కవితలు, సమకాలీన ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ రాజకీయ అంశాలు, యుద్ధోన్మాదం, దళిత రాజకీయాలపై ఆక్రోశం, దళితజాతి సంస్కృతి గొప్పదనం, దళితకవుల తాత్వికభూమికను చర్చించిన కవితలున్నాయి. ఉద్యమాలను నిర్మించే సాహిత్య ప్రక్రియ కవిత్వం. అయినా పిడికిలి ఎత్తినదే కవిత్వమనే పిడివాదాన్ని కవిగా ఆయన వ్యతిరేకిస్తాడు. దళిత కవుల జీవితంలో ఒత్తిడి, అవమానం ఉంటాయి కాబట్టి, వారి కవిత్వంలో ఎక్కువగా నిరసన ఉంటుందని కొందరు అపోహపడుతుంటారు. కానీ వారు ప్రబంధ వర్ణనను మించి రాయగలరని “ఉదయ పుంత” తెలియజేస్తుంది. ఈ కవితలో ప్రకృతి తాత్వికత, దళితజీవన సౌందర్యం కనిపిస్తుంది. “వెన్నెల వెదజల్లిన మొగులు కొప్పెర కప్పి/ తారలు పొదిగిన కంటిపొరల కింది కనుపాపల్లే/ నెమలి పురులిప్పిన భూమి బొంగురం జాల విప్పే/ ఆకాశపు కొప్పు దులిపిన గర్భం మొగులొల్లే/ బాలింత వాసన మబ్బు దిగిన వర్షం కురిసిన తలం/ పంటకు దూప పాదు మల్లి ఇగురుపొర పొద్దునద్దే/ పండు ఉదయపుంత కిరణం పానిపై లోకమల్లెచ్చే.../ అడవికొసరు పరుసుకున్న మనిషి యంత్రం పిప్పి” అంటాడు.

పై కవితలో మబ్బులు వర్షానికి తడవకుండా వెన్నెలకు కొప్పెరను కప్పి, తారలను కంటిపాపలా కాచి, కొప్పెర పట్టిన వర్షపు బిందువులను భూమిపై దులిపితే, అది బాలింత వాసనతో నిండుగర్భిణిలా మారుతుంది. పంటకు పాదుగా నీటినిచ్చి, తిరిగి మాయమై కొత్తచిగురు కాసేలా పొద్దును ఆహ్వానిస్తాయి. కవి దళిత ప్రకృతిప్రేమకు ప్రతీకగా నల్లని మబ్బును తీసుకున్నాడు. భూమిపై తన చెమటను చిందించడం,

తోటి మనిషి యంత్రం చేతిలో పిప్పిలా మారి ప్రకృతిని దెబ్బతీసే తత్వాన్ని ఈ కవితలో వ్యక్తం చేశాడు.

వేముల ఎల్లయ్య ఈ సంపుటిలో ఒకచోట "లేనితనమే మనిషి మేనిఫెస్టో" అంటాడు. ఎక్కువగా సఫాయికార్మికులు సామాజిక వెనుకబడినవారే ఉంటారు. "సఫాయి" కవితలో వారి చెమట రుచిని, వారి మురికి జీవితాలలో గట్టుతెగిన కష్టాలను పట్టించుకోని నిర్లక్ష్యాన్ని తెలియజేస్తూ "చెమట అద్దిన నాలికే మైలవగరు రుచి.../పొరతిప్పిన మోరి తట్టుతెగిన మురుగు.../కులం దూర్చిన పనిగడియ ఏ కార్మిక మేనిఫెస్టో లిఖితం?/ ...గీ దేశం మురికి కులవీలునామే! ఏర్కుందా?" అని సమాజానికి ప్రశ్నను, మేలుకొలుపును ఒకేసారి సంధిస్తాడు. కవిత్వంలో కనిపించే ఆవేశం, ఆవేదన కవి జీవితంలోనూ చాలా సహజంగా కనిపిస్తుంది. ఇది కవి నిబద్ధతను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడేదే కానీ బలహీనత కాదు. "న్యాయశాస్త్రం లైంగిక దాడి" కవితలో న్యాయశాస్త్ర పుస్తక రచయిత అయ్యుండి, కులహంకారంతో పనిమనిషి కూతురు మైనర్ బాలికను చెరబట్టడం గురించి "అరేయ్ కుక్కల కొడకా! కామానికీ కులముంది" అని ఆవేశంగా రాస్తాడు. ఇది ఆవేశ పిడికిలి కాదు. ఆవేదన నిండిన చూపుడువేలు.

అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర నియంతపాలకులపై కొన్ని కవితలున్నాయి. తండ్రి సమాధిమీద పూలు పూయలేదని కూలీలకు శిక్షను విధించిన ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జంగ్ ఉన్ యొక్క అధికారమదాన్ని ఎద్దేవా చేస్తూ, "దోపిడీ సమాధిని పూలమొక్కలు ఎక్కిరించాయి" అని భావిచరిత అతన్ని చూసే విధానాన్ని "కిమ్జొం పిచ్చిశిక్ష" కవితలో చెప్పాడు.

దేశవ్యాప్తంగా వ్యవసాయచట్టాలకు వ్యతిరేకంగా రైతుల నిరసనతో దేశం అట్టుడికిపోయింది. వారి ఆవేశాన్ని నిరోధించడానికి దేశ సరిహద్దు సైతం సైన్యంగా కదిలివచ్చింది. కానీ తెలంగాణ రైతు కదలకపోవడానికి "యుద్ధరైతు" కవితలో కారణాన్ని కళ్ళముందుపెట్టాడు. "రైతుబంధు నోట్లకట్టలు నోరుమూయించే/సరిహద్దు దేశాన యుద్ధరైతు గెలుపుదారై/ మట్టి విత్తుపాదై మొలక గొడుగెత్తిన ఆకాశం/ ప్రపంచ చిత్రపటంలో వీరులు రైతులైండ్రూ" అంటాడు.

ఉక్రెయిన్ ప్రజల తరపున పోరాడుతున్న అధ్యక్షుడి సాహసాన్ని కొనియాడుతూ

"ఉక్రెయిన్ జెలెన్స్కీ సెల్యూట్" చేశాడు. "ప్రవాసభారతీయ విద్యార్థులను అక్కడ బలికావద్దూ, బందూక్లవ్వండి" అని పిలుపునిచ్చాడు. "హమాస్" కవితలో "ఏండ్లతరబడి నర్కవడ్డ మొండాలు/...దైవదిన గండం తొండిజీవులు, లెంకినా శిధిలం దేవుడెక్కడ్రా?" అని నిలదీస్తాడు. పాలస్తీనా శతగాత్రులనుద్దేశించి "పాలస్తీనా పత్తార్పోడ్ మరణం" కవితలో "మనుండే మనుషుల వేటేంద్రా?...../నరులు తిరిగే తొవ్వల యుద్ధంలేని రోజుందా?" అని యుద్ధోన్మాదులను ప్రశ్నిస్తాడు.

"దేవుని దోపికం" కవితలో "కనిపించని నీకో దండం కనికరం చూపకు...." అని దేవుని పేరుమీద జరిగే సంస్కృతిక దోపిడీ ఒకవంక, ప్రపంచీకరణతో లాభపడి ప్రపంచ కుభేరులుగా మారినవారిని, బ్యాంకుల ఎగవేతదారులకు, కార్పోరేట్లను నిర్లజ్జగా కాపాడే రాజకీయనాయకులను ఎండగడుతూ, "అటువంటి దోపిడీదారులపై కరువుగొన్న జనులను దాడి చేయండని" నిరుపేదలకు పరిష్కారాన్ని చూపిస్తాడు. సంస్కృతిపరంగా చావు ఇంట జరిగే తంతు తప్పనిది కావడంతో మరణానంతర ఖర్చుల కారణంగా గ్రామీణపేదలు అప్పుల ఊబిలోకి నెట్టబడుతున్నారు. దీనికి తోడు కేంద్రప్రభుత్వం స్మశానం ఖర్చులకూ జి.ఎస్.టీని అమలుచేయడాన్ని నిరసిస్తూ "స్మశానం మనుషుల యాది/ దుఖం ఎగదన్నిన చుట్టరికం మతులెన్నో.../ బోడి బొచ్చు సంస్కృతి మంత్రం తలకు జి.ఎస్.టి.!?" అని పేదల తలకు భారంగా మారిన సంస్కృతిపట్ల నిరసనను వ్యక్తంచేశాడు.

"వేశ్యల సత్రం" కవితలో యాదగిరిగుట్టకింద వేశ్యావృత్తిలోనున్న ఆడపిల్లల గురించి, "తప్పిపోయిన ఆడబిడ్డలు/ బజారు వేశ్యవాడది/...విటుల రాదారీ సత్ర సంచార గర్భగుడి/...గిరిజన ఆడపిల్లలు చెరచబడ్డ నెత్తురు సిందూరం గీ కుంకుం/ ... బెల్లం పుట్నాలలో ఆడపిల్లల అంగడి/ యాది మర్శింటివా! దేవుడు కన్న లోకం పిల్లలు గలత్ క్రీనీడ" అని వారి కన్నీళ్లను, సంస్కృతి కింద ఛాయాబతుకులను కవిత్వీకరించాడు.

పుస్తకంలోని కవితలన్నీ ఒకచోట తాత్వీకరిస్తే కవితాసంపుటి శీర్షిక "క్రీనీడ" కవితలో కనిపిస్తుంది. "నిజంనీడ ....ఛాయా దొరకని వినికిడి/...మూఢ విశ్వాసి శ్వాస దేవగత్తే ఊదుపొగ యంత్ర దెయ్యం/ శాస్త్రీయ జ్ఞానదోపిడీ రాజకీయ లూటి పదవిపగ్గం/ బంధువులు బంధుపథకం ఓట్లఖరీదు ముద్దెర రొక్కం/గింత రక్తం ఎరుపు

గడ్డగట్టిన నోట్ల ముడుపులు యాగబలి/ మత కౌగిలి రాజ్యాంగ ఎచ్చిడీ/ మణీపూర్ మంటలు.../మనువాది మతశిక్ష/భూమి తిరిగిన క్రీనీడ బుగులైతుంద్ర". నిజం కనుగొనలేని సంస్కృతినీడలో దళితులు, మతం ముసుగులో మతపెద్దలు, జ్ఞానం పేరుతో, రాజకీయం పేరుతో దోపిడీలు, బలహీనులపై అన్యాయాలు...ఇవన్నీ కవిని గుబులు కలిగించేవే. అంటే సమాజాన్ని ఆలోచింపజేసేవే. కవికి తాత్వికతతో బాటు కుల, మత, సంస్కృతీ భావనల వలన అట్టడుగుప్రజలు పడే బాధల పట్ల తాత్వికత, తార్కికత అవసరమని ఈ కవిత్వం ద్వారా నిరూపించాడు. కిందనీడ దళిత అణిచివేతకు ప్రతీకయితే, దానిపైన నీడ బహుజన జీవితాల అణిచివేతకు ప్రతీక కావొచ్చు. దళిత, బహుజన స్పృహను మేల్కొలిపే గొప్పతాత్విక తార్కిక కవిత్వం "క్రీనీడ" కవిత్వం.

వేముల ఎల్లయ్య కవిత్వంలో శైలి, అభివ్యక్తి, వస్తుపరంగా పరిణామం చెందుతున్నా, భాషస్థిరంగా ఉండడం ఆయనలోని ప్రత్యేకత. వచనంలో, కవిత్వంలో భాషాపరంగా బలమైన దళితజీవిత ఇమేజరీ ఉంటుంది. ఆయన మాటలోనూ, కవిత్వంలోనూ మొనదేలిన వడపోతలేని భాష ఉంటుంది. నిండైన నిరసనతో కూడిన ఆవేదన కంఠంలో కవిత్వంలో ధ్వనిస్తుంది. కవిత్వానికి తీసుకున్న వస్తువును దేశీయపదాలలో కుదించి, సరళీకృతంగా (Simplify) చెప్పడం కవిత్వంలో కన్పిస్తుంది. శైలీపరంగా వేముల ఎల్లయ్య తనదైన సొంత ముద్రను కవిత్వంలో ఇప్పటికే వేసుకున్నాడు. ఆయన వాడుతున్న భాష, శైలిని అనేకమంది దళిత యువకవులు అనుసరిస్తున్నారు. అకాడమిక్ భాష పరిణామం చెందాల్సిన అవసరమూ ఇది గుర్తుచేస్తుంది. తెలుగులో మార్క్సిస్టు విమర్శ ప్రధానంగా కనిపిస్తుంది. ముఖ్యంగా పాఠకుడి స్పందనా ప్రాధాన్యత కలిగిన సాహిత్య విమర్శ (**రీడర్ రెస్పాన్స్ క్రిటిసిజం**) చాలా తక్కువగా ఉంది. అసలు లేదని కూడా నిర్మొహమాటంగా చెప్పొచ్చు. వేముల ఎల్లయ్య దళితతాత్విక తార్కిక కవిత్వ గడ్డివాము పొదిగిన ఆయుధపొద. కవిగా ఆయన జీవితం, ఆయన కవిత్వానికి మధ్య వైరుధ్యం తక్కువగా ఉంటుంది. కాబట్టి ఆయన కవిత్వాన్ని విశ్లేషించాలనుకుంటే "మనోవిశ్లేషణాత్మక సాహిత్య విమర్శ" ఉపయోగపడుతుంది.

–24 మార్చి 2025, ఆంధ్రజ్యోతి

దళిత తాత్వికత ఉట్టిపడే "జంత్రి"

కాలానుగుణంగా వచ్చే ఆవిష్కరణలు ప్రజల జీవన సంస్కృతిని ప్రభావితం చేస్తాయి. సంస్కృతిని గుణాత్మకంగా ప్రభావితం చేసేది సాహిత్యం. సాహిత్య భాషకూడా కాలానుగుణంగా పరిణామం చెందుతుంది. ప్రజలు, భాష, కవుల మధ్య విడదీయరాని సంబంధం ఉంటుంది. ప్రజల భాషపై కవుల భాష, కవుల భాషపై ప్రజల భాష ఎప్పటికప్పుడు ప్రభావితం చేస్తూ ఉంటుంది. పాతవాటి స్థానంలో కొత్త పదబంధాలు పుట్టుకొస్తాయి. సాహిత్యానికి భాష ప్రధానమే కానీ ప్రమాణం కాదు. అయినప్పటికీ మానవుడికి భాష అనేది మొదట బాల్యంలో అనుకరించబడి, బాల్యనంతర జీవితంలో ఆర్జించబడుతుంది. కాబట్టి సాహిత్యంలో ఒకే రచనలో వివిధ మాండలిక భాషా ప్రయోగాలు అరుదుగా కనిపిస్తాయి. ఒకవేళ అలాంటి ప్రయత్నం జరిగినా ఆ రచన పొసగదు. అతకదు. కారణమేమంటే సాహిత్యరచనకు భాష ఒక్కటే సరిపోదు. దానికి నేటివిటి, జీవితం, సంస్కృతి కావాలి. తెలంగాణ ప్రాంత సాహిత్యాన్ని, ప్రత్యేకించి దళిత సాహిత్యాన్ని ఆ దిశగా చూడని పరిణితి లేని, అపరిపక్వ చూపు వలన, ఇక్కడి సాహిత్య పరిమళాలు తెలుగులో ఎక్కువగా వెలుగుచూడడం లేదు. ఆంధ్రప్రాంతంతో పోలిస్తే తెలంగాణలోదళితవాద కవిత్వం కంటే, దళిత కవిత్వమే ఎక్కువగా వచ్చింది. దీనికి సుదీర్ఘ చరిత్ర ఉంది.

కవితా వస్తువు, భాష, శైలి, శిల్పం వంటి సంప్రదాయ విమర్శ చట్రంలో దళితకవిత్వం కుదురుకోలేదని వివిధ సందర్భాల్లో విమర్శకులు భావించారు. నిజానికి ఇక్కడి దళిత కవుల భాష చిక్కగా ఉంటుంది. చిక్కగా అంటే "ఆలోచన, వివేచన, స్మృతి భావనలు" అనేవి వీరి కవిత్వంలో ఎక్కువగా కనిపిస్తాయి.

నల్లగొండ జిల్లా నుండి దొడ్డి రామ్మూర్తి "బొక్కెన లొల్లి, బొండిగె, చిలుకల దండ" రచనల అనంతరం, మట్టి పండు కాచిన మాగువాసనతో వచ్చినదే "జంత్రి" కవిత్వం. "జంత్రి" అంటే "పాకెట్ క్యాలెండర్" అని నిఘంటువు అర్థం. కవి తాను నిర్దేశించుకున్న సామాజిక, వైయుక్తిక, సమానత్వ లక్ష్యాన్ని చేరుకోవడానికి, ప్రగతిమయ గమ్యాన్ని ఏర్పరుచుకున్న "పాకెట్ క్యాలెండర్" ప్రణాళిక ఈ కవిత్వం. విమర్శకులు కవిత్వాన్ని ఎందుకు రాయాలో, ఎందుకు రాయకూడదో, ఎలా రాయాలో చెప్పారు. ఆలోచన లేని కవిత్వం పేలవంగా ఉంటుంది. కవికి తన గురించి, తన చుట్టూ

ఉన్న సమాజం గురించి ఒక సహేతుక కొత్త ఆలోచన ఉండాలి. దానితో ఆ సమాజంలో చైతన్యం కలిగించగలగాలి. అలాంటి ఆలోచనలు కవిలో కలిగితే అది కవిత్వమయింది. దొడ్డి రామ్మూర్తి అచ్చమైన ఆలోచన కలిగిన దేశీకవి. కడుపు నిండిన జీవితాలకు కవిత్వ వెన్నెలలు తెలియవు, ప్రకృతి పులకింత, ప్రాకృతిక తిరుగుబాటు రెండూ మనిషికి సహజమైనవి. జీవితంనుండి పుట్టినదే కవిత్వమని "రక్కీసల" అనే కవితలో పేర్కొన్నాడు. ఖరీదైన భవనాల్లోని జీవితాలు కవిత్వవాసనలను గుర్తించలేవు. కవిత్వం అనేది "మట్టి పండు మాగు వాసన, గట్టుడిగిన సోయి సొదగింజ..." అంటాడు. కవిత్వం సామాజిక మార్పుకు సాధనం వంటిది. "వొడ్డుమీది వెన్నెల పుట్టకేమెరుక" అంటాడు. నిజమే, వెన్నెలను ఆస్వాదించాలంటే శారీరక, మానసిక స్వేచ్ఛ కావాలి. ఆక్రమించుకున్న పుట్టనుండి భయంతో బయటకు రాలేని దుర్భల జీవితాలకు "ప్రాకృతిక జీవితం" గొప్పదనం ఎలా తెలుస్తుంది?. "కాల్వపారిన సెమట కన్నీటి మొన....గుట్టంత గుట్టు ఎత్తిన తడల తిర్గుబాటు, పుర్రె కైగట్టిన నరం అల్లిక కైత్వం...." సాహిత్యం అనేది శరీర సౌందర్యం కాదు, బుద్ధి వికాసం అని ఈ కవితలో చెప్పాడు.

దళిత సాహిత్యంలో దళిత కవులు రాసే భాషలో పదాలు అనంతమైన శక్తిని మూటగట్టుకున్న అణుబాంబుల్లా ఉంటాయి. అవి ముద్దముద్దగా ప్రకటితమవుతూ ఉంటాయి. వారి కవిత్వ ప్రకటనలో ఉద్వేగం, ఆక్రోశం, తిరుగుబాటు, చైతన్యభరితంగా నడిపించే సామూహిక శక్తిగా ఉంటుంది. కారణం తమ జాతికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల కంటే ముందుగానే కవులే గుర్తించగలుగుతారు. అటువంటి "వివేచన"తో రాసిన కవిత్వమే మేలుకొలుపు కవిత్వం. అరాచక శక్తులు తమ స్వార్థం కోసం ఎప్పటికప్పుడు మతం, కులం, ప్రాంతం, జాతి, లింగ బేధాలతో మానవసమాజాన్ని చీల్చి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తారు. దొడ్డి రామ్మూర్తి "జంత్రి" కవితలో ఈ విభజన వాదాన్ని తీవ్రంగా నిరసించాడు. "ఆవు తల్లి, ఎద్దు తండ్రి...కడజాతి పబ్బతి గోప్రాలెగబాకి, మూలల్దిరిగిన మాల మాదిగ రుద్రాచ్చి, తలం కుమ్మిన కొమ్ము కుంకుం కల్లం కులాసా?" అని మతతత్వవాదాన్ని నిలదీశాడు. అంతే కాదు ఈ కవితలో "మత్తు దుల్పని మలిన తొత్తుల్లారా!.... అచ్చరమంటని ఒంటికి వొయిలెక్కడ?, తలెత్తని తన్నుకు కుర్చిపీటెక్కడ?" అని తన జాతి తరపున

ప్రశ్నించాడు. ఇదీ వివేచన కవిత్వం.

కవులు ఇతరుల అనుభూతులు, ఆశలకంటే, తమ అనుభవాలు, ఊహలకే అధిక ప్రాధాన్యతను ఇస్తారు. వస్తువు తనది కానీ, మరొకరిది కానీ కావొచ్చు. కానీ భాష మాత్రం కవి ఆర్జించినదే ఉంటుంది. భాషను బట్టి ఫలానా కావ్యాన్ని, ఫలానా రచయితనో లేదా కవి రాశాడని కాలాన్ని, కవిని నిర్ణయిస్తుంటారు. భాష్యశైలి అనుకరణ అనేది అంత సులువు కాకపోవడమే దీనికి కారణం. కవి నోస్టాల్జియానేపథ్యంలో రాసే రచనల్లో ఎక్కువగా "స్మృతి భావనలు" ఉంటాయి. కవులు ఎందుకు నోస్టాల్జియా నేపథ్యంలో రాస్తారు? తమ జ్ఞాపకాలు, అనుభవాల ద్వారా సమాజానికి చెప్పాల్సిన అవసరమే ముఖ్యమైన కారణంగా చెప్పవచ్చు. కవిత్వం రాయాలంటే కారణాలు ఉంటాయా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. కవిత్వమంటే కారణాలే కాదు పరిష్కారాలు. కాబట్టి కవులు "స్మృతి భావనలతో" కవిత్వాన్ని నోస్టాల్జియానేపథ్యంలో రాస్తారు. సహజంగా దళిత కవిత్వంలో ఆక్రోశం మాత్రమే ఉంటుందని అనుకుంటుంటారు. కానీ సమపాళ్ళలో వారి జీవన సౌందర్యం కూడా ఉంటుంది. వారి హృదయసంస్కారం వారి అనుభూతులను రాసే విధంగా ప్రోత్సహిస్తుంది. దొడ్డి రామ్మూర్తి రాసిన "గాజంగి దొన"(ఈతకు వాడే బోలుగా ఉండే మొద్దు) కవితలో అందమైన పసితనం "రాత్కడి గుండె చెరువు బాయి బంధం, పిల్లలు షేర్తుల్గట్టె ఈదులాట పిట్టపిల్లలై, శబ్దం గుబిల్లుమన్న నీటి తడలు సందమామలు....ఉయ్యాల మునిగితేలే...బాయంత బలగం ఓనాడు...!" అని చిన్నప్పటి దోస్తులతో ఈతసయ్యాటలను గుర్తుచేస్తాడు. దళితులజీవితం జీవితం సామాజికంగా ఒంటరిదేమీ కాదు.

అగ్రవర్ణ, బహుజన జీవితాలతో మమేకమై ఉంది. అయినప్పటికీ చారిత్రకంగా దళితులు సామాజిక చిన్నచూపు, అవమానం, తక్కువ అవకాశాలతో కూడుకున్న జీవితాలను అనుభవించడం వలన వారిలో సాంద్రమైన దుఃఖం పేరుకుపోయి ఉంటుంది. కాబట్టి వారి కవిత్వంలో సహజంగానే కరిగి ఏరవుతుంది. కవుల సాహిత్యంలో ప్రకటితమయ్యే భాషలో పాతపదాలు మరింత గాఢ అనుభూతినిస్తే, కొత్త తరానికి వాడకంలో లేని పదాలు మొరటుగా, కొరగాని కొయ్యగా కనిపిస్తున్నాయి. భాష ద్వారా వారి బాధామయ అనుభూతులను నేరుగా పాఠకుల హృదయంలోకి ఇంజక్ట్ చేయడానికి పాతపదాలు అవసరమేనని వారు భావిస్తున్నారు కాబట్టి కవిత్వంలో

రాస్తున్నారు. దొడ్డి రామ్మూర్తి రాసిన "వొద్ది" కవితలో "కుదురు ఇచ్చుకున్న బొగ్గ సిప్పల, మన్ను మర్మం కుండకెరుక, మాయి మర్మం తల్లికెరుక, ...నందికొండ గుండె మీద నడక నేర్సి, కిష్టమ్మ కొబ్బరాకుల పాపిడి తీసిన, మాదూప బుడ్డిల అంటరాని బతుకమ్మెట్టాయే?!..దగాబడ్డ గూళ్ళు దందుకట్టిన గుండెలు, సబ్బండజాతి నర్లోకం పక్కున పగిల్న చీమల పుట్ట" అని ఆవేదనను వ్యక్తపరుస్తాడు.

గతంలో దొడ్డి రామ్మూర్తి రాసిన "బొండిగ" కథలు సాహిత్యంలో నిలిచిపోయినట్టుగానే, తాజాగా వచ్చిన ఆయన కవిత్వం "జెంత్రి" దళితతాత్వికతతో తెలంగాణ సాహిత్యానికి చక్కని జోడింపు. ఇందులోని కవితలు, శీర్షికలు, భాష, పదజాల ప్రయోగం, వ్యక్తీకరణ, నోస్టాల్జియాలో రాసిన కవి ఆవేదన, అనుభవాలన్నీ పాఠకులను ఆకట్టుకునేవే ఉన్నాయి. "విరుద్ధ ప్రకృతి, పాయమాలు, గుజ్మ, రక్కీసల, గవిని, వెన్నెల యుద్ధం, గాజంగి దొన, గై కత్తి, శిబ్బిరేకు, డిజిల్ నవ్వు, వర్దపాశం, జంత్రి, నిఘా...."వంటి కవితలు తెలంగాణ భాషను, దళిత సౌందర్యాన్ని సుసంపన్నం చేసే ప్రత్యేక కవితలు.

–మన తెలంగాణ, 4 నవంబర్ 2024

సామాజిక మూలాల చరిత్ర పరిణామం "నాగస్వరం"

చాలామంది జీవితాలలో కొద్దిగా కవిత్వం, చాలామంది కవిత్వంలో కొద్దిగా జీవితం ఉంటుంది. కోయి కోటేశ్వరరావు కవిత్వంలో జీవితం, జీవితంలో కవిత్వం నిండుగా ఉంటుంది. బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం ప్రకారం అత్యంత సాంద్రత, వేడితో విశ్వం ఆవిర్భవించినట్టుగానే ఈ కవిలో కూడా గూడు కట్టుకున్న బాధామయ జీవిత అనుభవాల సాంద్రత, సామాజిక అంతరాల పట్ల ఆక్రోశం అగ్నిపర్వత లావాలాపెలుబికింది. అదే "నాగస్వరం" కవిత్వం.

సమకాలీన మానవ జీవితమే ఆధునిక కవిత్వం. కాలంతో బాటు కవిత్వం కూడా పరిణామం చెందుతుంది. సమాజంలోని జాతి, లింగ, వర్గ, వర్ణ, ప్రాదేశిక నిర్మాణాత్మక అంతరాలతో బాటుగా చిన్నచూపు, వివక్ష, స్వార్థం, ధనిక పేద వంటి గుణాత్మక లోపాలు రూపం మార్చుకోగలవు. కానీ అంతమవవు. వాటి తీవ్రతను తగ్గించి, రూపుమాపగలిగే శక్తి కవిత్వానికే ఉంటుంది. సాంకేతికత, నాగరికత ఎంతగా అభివృద్ధి చెందినా మానవ అనుభూతులు, ఆత్మగౌరవం, భావోద్వేగాలు, స్వార్థ చింతన ఎన్నటికీ మారవు. కవిత్వం మనిషి గాయాలకు మందుపూయడమే కాకుండా సామాజిక చికిత్సకు ఔషధంగా ఉపయోగపడుతుంది. అంతరాలు విస్తరిస్తున్నా కొద్దీ మానవత్వం నశిస్తుంది. సమానత్వం ఆధునిక భావన. అన్ని ప్రాణులు ఏకకణ జీవి నుండి ఉద్భవించాయని జీవశాస్త్రవేత్తలు నిరూపించినా, విశ్వం చల్లబడుతున్నా కొద్దీ జీవం విస్తరించినంత సులభంగా మానవుని దృష్టి ఇంకా విశాలం కావాల్సి ఉంది. "నాగ" జాతిది సంపూర్ణ 'నాగ'రికత. అందులో వలసవాద సంస్కృతికి చోటులేదు. సర్వప్రాణుల సమానత్వం, శ్రామిక జీవనం నాగజాతి వైభవోపేత జీవనపాఠంగా ఉండేది. వీరిని అనేక తరాలుగా అవకాశవాద వలస సంస్కృతీకరణ తీవ్రంగా ప్రభావితం చేస్తూ వచ్చింది. యంత్రాలను కనిపెట్టి ఉపాధిని, సాంకేతికత పేరుతో ఇప్పుడు మేధస్సును వారి వద్దనుండి దోచుకుంటున్నారు.

తెలుగులో నన్నయ, తిక్కన, ఎర్రనలకు మార్గ కవిత్రయంగా గుర్తింపు లభించింది. తెలుగు కవిత్వంలో సంస్కృతి ఉంది. నాగరికత లేదు. సంప్రదాయం ఉంది. సమానత్వం తక్కువగా ఉంది. సౌందర్యం, అనుభూతి, టెక్నిక్, కథ, నిర్మాణం వంటివి కవిత్వంలో ప్రధానంగా కవిత్వ విమర్శ చర్చలో ఉన్నాయి. తెలుగు కవిత్వంపై

గుణాత్మక చర్చ జరగడం లేదు. కవిత్వం కవి అనుభూతికి మాత్రమే పరిమితం కానప్పుడు, అది తరతరాలుగా వర్తించేదిగా ఉన్నప్పుడు చర్చించాల్సింది కేవలం కవిత్వ నిర్మాణాన్ని మాత్రమే కాదు. ఆ సమాజాన్ని చర్చించాలి. నేటి తెలుగు కవిత్వంలో వస్తున్న సామాజికత అరుదైన నాగరిక భావన. దీనిని సొంతం చేసుకున్నదీ "నాగస్వరం".

"కాలసర్పం" కవితలో "...త్రివర్ణ పతాకం ఊర్ధ్వవర్ణంలో/ మనువు రాసిన వాక్యంలా/ మహా వంకర్లు పోతుందీ కాలసర్పం" అని వర్తమాన కాలతీరును కవి కవిత్వంలో రాశాడు. ఇది వలసవాద సంస్కృతీకరణకు వ్యతిరేకంగా విసిరిన నాగజాతి ఏకలవ్యుడి బాణం. మనుషులను మానవత్వం లేకుండా తయారుచేయడమూ వలసవాద సంస్కృతీకరణలో భాగమే. "ఒక మర్డర్ ప్లీజ్" కవితలో "...ఆకలిగా ఉన్న నా సెల్ ఫోన్ కెమెరా కడుపుకు/ కొంచెం చావు కూడు తినిపిస్తారా?/....ఎవరు చస్తే నాకేంటి?/ ముందు నా వీడియో బతకాలి" అని నేటి మనుషుల మనస్తత్వం, ఆధునికత పేరుతో మానవత్వం లేని మనుషులను కవిత్వీకరించాడు. ఫ్రాంకోకు వ్యతిరేకంగా "రండి వీధుల్లో రక్తాన్ని చూడండి" అంటాడు నెరుడా. ప్రజాకవి గోరేటి వెంకన్న "మనిషి క్రౌర్యాన్ని తొలగించేదిగా కవిత్వం ఉండాలంటాడు."

వైరుధ్యంలో సమగ్రత లేదు. వైవిధ్యం తప్ప సమానత్వం లేదు. గుండెల్లో బాకులా దిగబడే చిన్నచూపు ఉంది. "ట్రోలాయణం" కవితలో "ఇక చాలు ఆపండి/ ప్రణయామృత సాగరంలో/ కసిరిబుసగొట్టే కాలనాగుల విషనాట్యం/...సత్యాన్ని తొక్కిబెట్టి/తర్కాన్ని ఎక్కుబెట్టి/రగిలించే చర్చోపచర్చల చాట భారతం" అంటాడు. ప్రణయాన్ని అందంగా వర్ణించిన పురాణ, ఇతిహాసాలు కుల విషకాటు నుండి ప్రణయ్ ను కాపాడలేకపోయాయి. ఆధునిక సాంకేతికతతో మనుషుల బుర్రలను నియంత్రించే "కసిరి బుసగొట్టే కాలనాగుల" తర్కతెలివితేటలను పదునుగా ఈ కవితలో రాశాడు. సమాజంలో సంస్కృతీకరణ చెందినా కులవివక్ష పోవడం లేదు. ప్రపంచ నలుమూలల నుండి విషాన్ని వెళ్లగక్కే సాంకేతికత ఇక్కడ సమతాకాశాన్ని, సమానావకాశానికి సవాలు విసురుతుంది. కాలంతో బాటు వివక్ష వివిధ రూపాలను సంతరించుకుంటుంది. సోషల్ మీడియా ఇప్పుడు అందరి చేతుల్లోకి వచ్చింది. నిర్వహణ, నియంత్రణ అదుపు తప్పిపోతుంది. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన "కులం మరియు ప్రజాస్వామ్యం" కవిత్వంలో కులం మరియు ప్రజాస్వామ్యం ఎప్పటికీ కలిసి ఉండవని అభిప్రాయపడతారు. ఆ మధ్య దీపావళి సందర్భంగా మహారాష్ట్ర

మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ షిండే మనవడు శిఖర్ పహరియా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కుల అవమానాన్ని ఎదుర్కొన్నాడు. శిఖర్ పెట్టిన ఒక పోస్టుకు candybabe_176 అనే యూజర్ "లేకిన్ తు తో దళిత్ హై" (కానీ నువ్వు దళితుడివి) అని బహిరంగ కామెంట్ రూపంలో అతడిని ఎగతాళి చేయడం జరిగింది. ఆ కులతత్వ వ్యాఖ్యకు ప్రతిస్పందనగా "మీలాంటి చిన్న, వెనుకబడిన మనస్తత్వం కలిగినవారు ఉండటం నిజంగా విచారకరం. అంటరానితనం అనేది మీ ఆలోచనా స్థాయి మాత్రమే" అని శిఖర్ 18 మార్చి 2025న ప్రతిస్పందించాడు. ఇది నెత్తురులేని హింస. అవమానం, అంటరానితనం, చిన్నచూపుకు ఆధునిక వేదికగా సామాజిక మాధ్యమాలు పదకొండో అవతారంగా ఆవిర్భవించాయి.

సైబర్ వేటగాళ్ళు సామాన్యుడి అమాయకత్వానికి ఆశలనే ఉచ్చును భిగించి, వారి స్వేద ఫలాన్ని, జీవితాలను దోచేస్తున్నారు. దీనిని "ఋణార్ణవం" కవితలో "ఎవడో అపరిచితుడు/ కన్నుమూసి తెరిచేలోపు/ ఒక పచ్చని ఆశను ఎర వేసి/.... సకుటుంబ సపరివారంపై/ కణకణ మండే/ నిప్పు కనికలను కుమ్మరిస్తాడు/ అసత్యాలతో పరువు బట్టలూడదీసి/ డిజిటల్ మైదానంలో/ నగ్న సందేశాలను లిఖిస్తాడు" అని వర్తమాన సాంకేతికతతో జరిగే మోసాన్ని రికార్డుచేశాడు. పైఅంతస్తు సమాజానికి సమాజంలోని వనరులు అందుబాటులో ఉంటాయి. వాటిని ఉపయోగించుకుని కిందివాడిని సొంతం దోచుకుని బజారులో నగ్నంగా నిలబెట్టే అమానవీయతను ఈ కవితలో చెప్పాడు. ఇందులోనే "నెత్తురు తాగిన కత్తినోటికి/ వెన్నపూస రాసి/ కన్నీరు నిండిన గాయంపై/ కారం చల్లే కులీన నాటకం/ ఇక చాలు ఆపండి..?" అంటాడు. కోయి కోటేశ్వరరావు అధ్యాపక విద్యాధికుడు. చదువుతో తలరాతను మార్చుకోవాలనుకునే తనజాతికి ఆదర్శప్రాయుడు. దళారీ లీకువీరులు చదువులనే శీలాన్ని చెరబట్టే విధానాన్ని "నీటోపాఖ్యానం" కవితలో చెప్పాడు."...శ్రమకు శత్రువులైన పరాన్నభుక్కులే/ కపటమంత్రాలను వల్లిస్తారు/పదిమంది కష్టాన్ని కొల్లగొట్టి/ పండగ జేసుకోవడమే నేటి యుగధర్మం" అని రాశాడు. పౌరుల నైతికాభివృద్ధి దేశాభివృద్ధి అంటాడు అంబేద్కర్. ఆగ్రహంతో ప్రజాధనానికి నష్టం కలిగించే వారి గురించి "దగ్ధగీతం" కవితలో "ఎక్కడ అగ్ని జ్వలించినా/ ఇక్కడ దగ్ధగీతమై/ పొగలు చిమ్మేది మాత్రం నేనే/...అత్యాధునిక బుద్ధిమంతుల్లారా!/నన్ను కాదు/ తక్షణం దగ్ధం చేయాల్సినవి/ ఈ దేశంలో ఎన్నో ఉన్నాయిరా!" అని ఆవేశబుద్ధిమంతులకు నగ్నసందేశాన్నిచ్చాడు.

చరిత్ర మూలాలు సామాజిక పరిణామాలను పేర్కొనవు. సామాజిక మూలాలు చరిత్రకెక్కవు. "నాగస్వరం" సామాజిక మూలాలను చరిత్ర పరిణామంగా మార్చిన కవిత్వం. ఇది సమాజంలోని నిర్మాణాత్మక విభేదాలను చెరిపి గుణాత్మక ఏకతవైపుకు ఆలోచింపజేస్తుంది. "యథారాజా...తథా బాబా ..." కవితలో "ఆటంబాంబు కంటే/ గుడ్డినమ్మకం అత్యంత ప్రమాదకరం/ యుద్ధం కంటే మౌఢ్యమే మహానష్టదాయకం" అంటాడు. "బూత్ తంత్రం" కవితలో "నువ్వెప్పుడూ ఇంతే ప్రియా...!/ ఇవ్వడం కంటే తిరిగి పొందడంపైనే/ దృష్టి కేంద్రీకరిస్తావు.." అని వ్యూహాత్మక రాజకీయాలతో అణగారిన వర్గాలకు జరిగే అన్యాయాన్ని బయటపెట్టాడు. అమెరికాకు చెందిన పాల్ లారెన్స్ డన్బర్ అనే కవి "మేము ముసుగు ధరిస్తాము"అనే కవితలో వివక్షను ఎదుర్కున్న జాతి ఆవేదన, నైరాశ్యం, కుంగుబాటును దాచుకుని పైకి ఎలా నవ్వుతూ ఉంటారో చెబుతాడు. కోయి కోటేశ్వరరావు "నాగస్వరం" కవిత్వంలో ఈ ఆవేదన కనబడుతుంది. ఆయన విమర్శకుడుగా నిర్మాణ మెళకువలు తెలిసిన వ్యక్తి కావడంతో వస్తుపరంగా "నాగస్వరం" కవితా భవంతికి పునాది మొదలు నగిషీల వరకు అందంగా చెక్కి, ఆలోచనాత్మకంగా రాసిన కవిత్వమిది. ఇది భాషగర్భితంగా, భావగర్భితంగా సాగిన సాంద్రమైన కవిత్వం. ఇందులో భావోద్వేగాలపై కంటే సామాజిక పరిశీలన, అనుభవాల వ్యక్తీకరణపై, ప్రశ్నించడంపై ఎక్కువ దృష్టిపెట్టినట్టుగా కనిపిస్తుంది. చెప్పాలనుకున్న అంశంపై ఏమాత్రం పక్కకు జరగకుండా కవి జాగ్రత్తపడ్డాడు. విమర్శకులు, పరిశోధకులకు చాలా పని కల్పించాడు. కవిలో విమర్శ కోణం, జీవితం, సాహిత్యం బలంగా పాదుకుని ఉన్నాయి కాబట్టి కవిత్వంలో బలమైన పదబంధాలు తియ్యని నౌబోతులా తగులుతాయి. కొన్ని పదబంధాల నిర్మాణంలో మహాకవుల ప్రభావం ఉన్నా, వాటిని సొంత అభివ్యక్తికే ఉపయోగించాడని కవిత్వం చదివితే స్పష్టంగా తెలుస్తుంది. ఈ కవిత్వం కొంత క్లాసిక్ గా, ఎక్కువగా ఆధునిక అభివ్యక్తితో బలంగా ఉంటుంది. "శిలాక్షరం" కవితలో చెప్పినట్టుగా ఈ "నాగస్వరం" కవిత్వం "వర్ణరాజ్యం ముంగిట్లో/ నిలువెత్తు గాయంలా విస్తరించిన/ రక్తక్షేత్రంలో ఇన్నాళ్ళకు/ ఒక వెలుగు రేఖ తొంగిచూసింది".

–0–

–నమస్తే తెలంగాణ, 14 జూలై 2025

దళితవాడ వేదనకు వెలుగు కవాతు మద్దూరి నగేష్ బాబు

తెలుగు కవిత్వం వైయుక్తిక భావనల నుండి, వర్ణనల నుండి వర్గసామ్యంవైపుకు, సామ్యవాదంవైపుకు పయనించడంలో పాశ్చాత్య ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. మనస్తత్వశాస్త్రం ప్రకారం తెలిసిన విషయం నుండి తెలియని విషయం వైపుకు మానవ మెదడు నేర్చుకోవడానికి ప్రయత్నం చేస్తుంది. శ్రీశ్రీ సంప్రదాయ పౌరాణిక ప్రతీకలతో ప్రాపంచిక అభ్యుదయ కవిత్వాన్ని పరిచయం చేస్తూ కవిత్వం రాశాడు. ఈ కవిత్వంలో ఆశలు, ఆకాంక్షల పాళ్ళు అధికంగా ఉన్నాయి. పారిశ్రామిక విప్లవం, ప్రపంచ యుద్ధాలు, భారతదేశ స్వాతంత్ర్యం, సామ్యవాద ప్రభుత్వాల ఆలోచనలు ఆనాటి కవిత్వానికి ప్రేరణగా నిలిచాయి. తరువాత కాలంలో అదే మూసగా రాసిన కవులకు పెద్దగా ఆదరణ లభించలేదు.

స్థానికతను అర్థం చేసుకున్న సాహిత్యమే నిలబడుతుంది. ప్రజల భాష, బాధలు, అనుభూతులు, చరిత్ర, సంస్కృతి ప్రజలవైనపుడు ఆ సాహిత్యానికి ఆదరణ సహజంగానే దక్కుతుంది. వర్గ సమాజం గురించి మాట్లాడే కవిత్వం ఇక్కడి సమాజ అవసరాన్ని తీర్చలేకపోయింది. భారతదేశానికి సామ్యవాదం కంటే అంతరాలు లేని సమసమాజ స్థాపన కావాలని డా. బి. ఆర్. అంబేద్కర్ ఇచ్చిన పిలుపును అర్థం చేసుకుని రాసిన కవిత్వం వర్గసమాజం గురించి కాకుండా వర్ణసమాజం గురించి మాట్లాడడం మొదలు పెట్టింది. శ్రీశ్రీ పౌరాణిక ప్రతీకలను సామ్య, ప్రతిసామ్య పద్ధతిలో కవిత్వాన్ని రాస్తే, మద్దూరి నగేష్ బాబు పౌరాణిక ప్రతీకలను ధ్వంసం చేసి, కొత్త పునాదులకు బీజం వేశాడు. కులవివక్ష పునాదులను పెకిలిస్తేనే అభ్యుదయ సమానత్వానికి బాటలు పడతాయని మరమ్మత్తు దారులు తీశాడు. దళిత వివక్షను పౌరాణిక ప్రతీకలతో చెప్పడమే కాదు, దళిత ప్రతీకలతో పౌరాణిక వర్ణవ్యవస్థను బోనులో నిలబెట్టాడు. దళితవాడ వేదనకు వెలుగు కవాతు మద్దూరి నగేష్ బాబు. "వెలివాడ, రచ్చబండ (దీర్ఘ కవిత), లోయ, మీరేవుట్లు, నరలోక ప్రార్థన, పుట్ట, గోదావరి (దీర్ఘ కవిత), నిశాని (ధిక్కార కవిత), ఊరువాడ (సంకర కవిత)" కవిత్వంలో అతని కవిత్వం ప్రతీకాత్మకం. అతని ప్రతీకలు కవితాత్మకంగా సాగుతాయి.

మద్దూరి నగేష్ బాబు కవిత్వం అచ్చమైన దేశీ కవిత్వం. భాష, అనుభవాలు, అనుభూతులు, భావోద్వేగాలు తరతరాలుగా తమ సమాజం అనుభవిస్తున్న క్షోభనుండి

పుట్టింది ఈ కవిత్వం. ఆవేదనకు ఆలోచన తోడై ఆశయంగా మారిన కవిత్వం మద్దూరి నగేష్ బాబు కవిత్వం.

తెలంగాణ దళితకవిత్వం ఆంధ్రాప్రాంతపు దళిత కవిత్వంతో పోల్చినపుడు వస్తువు, భావప్రకటన తీవ్రత, ఆశయాల్లో పెద్దగా మార్పేమీ లేకున్నా, కవితాత్మకత, ప్రతీకాత్మకత, కవితా సౌందర్యం, భాష, వ్యక్తీకరణ, శైలీప్రత్యేకతలు భిన్నంగా ఉ ంటాయి.

మద్దూరి నగేష్ బాబు కవిత్వంలో తరతరాల గోస, వేదన, దళితులుగా వారి నిస్సాహాయత, అణచివేత, పోరాటం, ఆత్మగౌరవం, చైతన్యం, ప్రశ్న, సమాధానం, వ్యంగ్యం, అలక, అన్యాయంపై ఆగ్రహం, దళితులుగా నిర్దేశించిన పురాణ సాహిత్యం, భావజాలంపై ఆవేశం ఎక్కువగా కనిపిస్తాయి. చెప్పే పద్ధతి సులువుగా, భాష సరళంగా, గొంతు తీవ్రంగా, ప్రకటితమయ్యే భావం స్పష్టంగా, భావోద్వేగం నవ్యంగా ఉండడం ఆయన కవితా లక్షణాలు.

"వెత" కవితలో "...చేతి వేళ్ళకు బదులు శూన్యం కమ్ముకున్న/ గురుదక్షిణల చీకటి/ ముక్కూ చెవులకు బదులు వర్ణధర్మం కబళించిన/ ధర్మ సంస్థాపనల చీకటి/ దేవాలయపు తెరని/ నిట్టనిలువునా చీల్చిన చీకటి/..../ దేశం ఒళ్లంతా చీకటి గజ్జి/ మూగుతున్న ఖద్దరు ఈగలు/కాషాయ దోమలు/ కుల రాజకీయ చీమలు/..అంతటా ఒక యుద్ధమేదో జరుగుతున్నట్టు/ మోహరించిన ఆర్య చీకటి/....." ఈ కవిత చదువుతుంటే మనల్ని అల్లుకున్న వర్తమాన చీకట్లు గుర్తుకురాక మానవు. ఇదీ మద్దూరి నగేష్ బాబు కవిత్వంలో ఉన్న ప్రాసంగికత. ఇదే కవితలో "...ఏవీ వెలుగులేవీ?/ ఏవీ కిరనాలేవీ?/ ఏవీ...ఏవీ..వెన్నెల జలపాతాలేవీ?/ సూర్యుడా ఎక్కడ? ఎలా ఉంటాడు?/ చంద్రుడా ఎవడువాడు?/ నక్షత్రాల అంటే ఏమిటి?/ ....ఈ తాటాకు భేతాళ కతల పుస్తకంలో అక్షరాలేవీ/ అసలీ అయిదో బిడ్డకి తల్లేదీ తండ్రేడీ?". ఈ కవిత్వంలో మెరుపులాంటి ప్రశ్నలు చదివితే, మరుపులో నున్న అనేక ఆలోచనలను అల్లకల్లోలం చేస్తుంది. ఇది చదివితే ఆవేశంతో కూడిన ప్రశ్న అతనే, ఆలోచనతో కూడిన జవాబు అతనే అనిపిస్తుంది. మద్దూరి నగేష్ తన కవిత్వంతో పాత బాటను మాన్పించి, కొత్తదారులు వేస్తాడు. కొత్త నడకలు నేర్పుతాడు. "అన్నీ ప్రశ్నలే/ అన్నీ సందేహాలే!/ అంతా మిధ్య అయిన వ్యవస్థలో/ ఏదీ జవాబు

కాదు/ ఎక్కడా సమాధానం లేదు/ కళ్లుంటాయి/ చూడనిస్తేనా/ దేవుల్లొచ్చి పెరికేయరూ!/ నోళ్లుంటాయి/ తెరవనిస్తేనా.....” ఇలా ఉంటుంది.

“సెమించండి! దయుంచి సెమించండి!/మాకు సంతకాలులేవు నాయనా వేలిముద్రలు తప్ప/ మాకు మాటలన్నా లేవు తండ్రీ క్షణ క్షణం పోవటం తప్ప/ యుగయుగాలనుండీ/అన్నీ మూసుకుని తుడిసేసుకోని పోవటాలు తప్ప/సీది పిర్రలకి రాసుకోని పోవటాలు తప్ప/ మాకు బతుకు లేదు బాబూ సావు తప్ప/ మీ పొలాల్లో నత్తలం/ మీ సేలల్లో సెమట కాలవలం/ మీ సేలల్లో ఎరువులం/ మీ గాదెల్లో గింజలం– మీ బాంచలం/.....” అంటూ “పలకా బలపాలడిగినాం–సెమించండి/ ఏదేసపోడు/ కలల్లేనోడయ్యా– కలల్లేనోడు” ఉబలాటం కొద్దీ పుస్తకం పట్టుకున్నట్టు కలగన్నానని అంటాడు. ఇదీ ఈ కవితలో చెప్పేవిధానంలోని నవ్యత.

మద్దూరి కవితలో సామాజిక వివక్షను, అంతకు మించిన పీడనను బలంగా ప్రకటిస్తాడు. ఈ కవిత్వంలో మానవత్వాన్ని, మనిషితత్వాన్నిఅడుగుప్రజలలోనే వెతుక్కోవాలనే బోధ కనిపిస్తుంది. తరువాత బాధ, ఆ వెంటనే చైతన్యం కవితాప్రవాహంలో కొట్టుకు వస్తాయి.

“మీ కొట్టాలు సిమ్మటానికి/ మాపెళ్ళాల పక్కలమీంచి లేసొత్తాం గదయ్యా/ మీ సంటోడయినా వొచ్చి/ మా ఆడోళ్ళనీ మా తల్లుల్నీ లంజముండలని పిల్సినా/ సినబాబుగోరి సరసాలని మురుసుకుంటం గదయ్యా/ టౌనుల్లో మీరు తాగి తూలుతుంటే/ తిని – కొవ్వెక్కిన మీ ఇల్లాళ్ళు/ మమ్మల్ని ఆగం ఆగం జేసినా/ పళ్ళ బిగువున వోర్సుకునే వాళ్ళం కదయ్యా/ ఆసంగతి తెలిసి/ మీరు మమ్మల్ని వేట కొడవళ్ళతో నరుకుతున్నా/ తలొంచి/ మెడొంచి/ సివరాకరికి మీరొత్తంటే/మా సమాధి రాళ్ళు సైతం లేచి నిలబడతాయి గద్దోరా!/ ఒక సంగతడుగుతానూ....!/ మేమూ మడుసులమే గదయ్యా/.... అయినా/ బతుక్కి వొక్క పాలేగదయ్యా సత్తాం!/... ఇక ఇప్పటికయినా మేం నిలబడకపోతే/ ఇన్ని యుగాల తర్వాతయినా తలలెత్తకపోతే/ మేం మనుషులం ఎట్టా అవుతాం తండ్రీ/.. ఇప్పుడు/ నా జాతిమీద ప్రమాణం చేసి చెబుతున్నా/ మేం కొత్త మనుషులం / బోధివృక్షాల వేర్లలోంచి/ గయల గాయాల్లోంచి/ నీలిగబ్బిలాల దండై ఎగిరొస్తున్నాం/ భూమధ్య రేఖాప్రాంతపు మధ్యాహ్న సూర్యబింబాల్లా/మా కళ్ళూ తెరిచేశాం!” ఇలా కవిత్వంలో కవి యొక్క గొప్ప దిగులు, తీర్పుతో కవిత ముగుస్తుంది.

తెలుగు కవిత్వానికి తాత్వికతను అద్దిన "దాపు"

మునాసు వెంకట్ తెలంగాణ తొలితరం బహుజన కవి. అచ్చమైన కవిత్వ మూలవేరు. ప్రతీకాత్మక ప్రకృతి కవిత్వానికి చిరునామా. ఆయన కవిత్వంలో అచ్చమైన కవితా సౌందర్యం తెలంగాణతనం, భాష, ప్రాకృతిక తన్మయత్వం, బహుజన తాత్వికత, గంగ పుత్రుడుగా వృత్తి గోస, జెన్ తాత్వికత, కవిత్వ తన్మయత్వం, జీవితానుభావాలను విభిన్న భావొద్వేగాలలో అత్యంత సహజంగా పలికించడం ఉంటుంది.

జెన్ అంటే ధ్యానం. దాపు కవిత్వంలో అచ్చంగా కవి ధ్యానస్థితి కనిపిస్తుంది. వేటగాడి క్రౌర్యాన్ని కళ్ళతో చూశాక గానీ రామాయణంలో కవిత్వం పుట్టలేదు. దాపు కవిత్వంలో ప్రతీపాదంలో క్రౌర్యాన్ని నియంత్రించే ప్రాకృతిక కరుణ, ప్రేమభావనలే కవిత్వంగా ప్రదర్శితమవుతుంది. ఆంగ్లకవి వర్డ్స్ వర్త్ లో ప్రకృతి సౌందర్యం మాత్రమే ఉంటే, మునాసు వెంకట్ "దాపు" కవిత్వంలో జెన్ లక్షణాలైన ప్రకృతి, సరళత, సంక్షిప్తత, అంతరదృష్టి, తక్షణ అనుభూతి ప్రధానంగా కనిపిస్తుంది. అందుకే ఇది ప్రపంచస్థాయి కవిత్వం. మహాయాన బౌద్ధమతశాఖ "జెన్" స్థాపకుడు దక్షిణ భారతీయుడైన బోధిధర్ముడు. చైనాలో పుట్టిన జెన్ తత్వం జపాన్, కొరియాలాంటి అనేక దేశాలకు విస్తరించింది.

"శూన్యం తాలూకు శబ్ధం" కవితలో "...దిగాలు దిగి/ శిగాలు ఊగి/ గద్యమై వచ్చి పద్యమై పోయిన/.......శూన్యం తాలూకు శబ్ధం/ నా గుండెల మీద దిగే వరకు/ ఇక్కడే ఉంటా/...నువ్వు రాకముందు/ పొద్దు ఆకాశాన్ని దున్నిపోయాక/ నక్షత్రాలు మొలకెత్తినయి.." అంటాడు కవి మునాసు వెంకట్. ప్రపంచాన్ని కూడా జయించగలిగే శక్తి కలిగిన మానవునికి, మనస్సును జయించగలిగే సత్తువ ఉండదు. మనిషికి, మనసుకు అయ్యే గాయాలకు సరైన మందు ప్రకృతే. దీని గొప్పదనాన్ని ఈ కవితలో అనుభవైకవేద్యంగా చెప్పాడనిపిస్తుంది.

సమకాలీన తెలుగు కవిత్వంలో బహుజన సామాజికత విశ్వరూపం సంతరించుకుంది. పెద్ద పెద్ద అడుగులతో ఇది వర్తమాన సాహితీజగత్తును కొలుస్తుంది. యిప్పుడు బహుజన కవిత్వంలో రెండోదశ మొదలైంది. కవిత్వంలో భావుకత,

సామాజికత చక్కని శిల్పంతో పోటీపడుతున్నాయి. అర్ధవంతమైన నిండైన బహుజన జీవితం ఇప్పుడు సజీవ కవిత్వంగా తెలుగు సాహిత్యంలో విస్తృతంగా వస్తుంది. బహుజన ఉత్పత్తి కులాల మధ్య జీవన సంరంభం కవిత్వంగా మారుతోంది. "తాళ్ళమటం" కవితలో "..జగ్గల్లో గుడ్డి గువ్వకెరుక/లొట్టి లోపల పడే బొట్టు బొట్టు/ నా ఊపిరి/ గొల నా పాణ దండం../ ఈదులల్లా తాళ్ళల్లా/ బైరాగి బాటమీద/ ఇగురు తొడిగే మాటలకు/ తీగసాగిన బాట.." అంటాడు. కల్లుగీత కార్మికుల కష్టాన్ని తాగి కవిత్వంలో కృతజ్ఞతలు చెప్పుకునే బాటతీసిన కవి మునాసు వెంకట్.

సంక్షిప్తాక్షరాలలో ఆకాశంలోని చందమామను, చెరువులోని "చందమామలు"గా చెరువులోకి దింపిన జీవకవి మునాసు వెంకట్ ఈసారి మనిషికి, మానవత్వానికి "దాపు"గా నిలిచే కవిత్వం రాశాడు. ఈ జీవకవి కవిత్వంలో అక్షరాలు ఉండవు. గాఢమైన భావుకత, ఎదతడి ఉంటుంది. శూన్యం తాలూకు నిశ్శబ్దం ఏకాంతం కనిపిస్తుంది. ఏరు నీరు ప్రవహించినట్టుగా, వెన్నెల వర్షంలా తడిపినట్టుగా, మౌనకుంపటిలో దిగులు కమ్మిన మేఘం వర్షించినట్టుగా, మట్టి మీద పడిన తొలిచినుకు వాసనగా భావోద్వేగ పరిమళం మనసుకు తగులుతుంటుంది.

దాపు కవిత్వంలో అలుగెల్లిన అచ్చమైన తెలంగాణ ముగ్ధ గ్రామీణ జీవన భాషా సౌందర్యం ఉంటుంది. "నీలి" కవితలో "ప్రియా/ వాదులాడే వేళయేనా!?/ వాగుతో బాటు/ వెన్నెల ఉధృతిలో ఉంది/ గరకని మేస్తున్న కుందేలులా చంద్రుడు చరిస్తున్నాడు/ సన్నని తుంపర/ గుసగుసలా ఉంది/ మన ముచ్చట వినాలని/ కీచురాళ్ళ కిమ్మనకుండా ఉన్నాయి.../ ఎగిరే చేపలతో గీ రాత్రి/ నక్షత్రాలను లోతుగా చూద్దాం" ప్రతీపాదమూ ప్రకృతి తన్మయత్వమే. ప్రతీపాదమూ కవిత్వ భావుకత కమ్మిన ఆకాశమే. కీచురాళ్ళు కిమ్మనకుండా ఆయన కవిత్వానికి ముగ్ధలవుతాయి. అతడు కవిగా అనేకుడు. ఏటి వారగా తిరిగి ఏటిగత్తె గంగమ్మకు కవితా వాయినం పట్టే అపర భగీరథుడు. అచ్చమైన తెలంగాణ కవితకు అతని కవిత్వం పడమటిల్లు. ఎన, వర్జి, మెద, చందమామల తరువాత వచ్చిన "దాపు" కవిత్వం పరిణితి దృష్ట్యా రెండో ఆకాశం. దేశీయ జెన్ ఆధ్యాత్మిక ధ్యాన స్థితి "దాపు"కు కవిత్వపాదుగా నిలిచింది. "అచింత్యం"లో "గీతల తాడు గీతోపదేశం/ సల్లబడ్డదాక ఉండి/ నన్ను సల్లగ పొమ్మంది/ ఎన్నెల బురదలో ఎద ఇచ్చుకుంది/ ఏడ నుంచి ఏడకొచ్చి పడితి

దేవా?/ చెరువు మీన వల విసిరితే/ నాత్రి నా మీద కల విసిరింది/ చెరువు నాత్రి రెండూ చెరువులే..” అంటాడు. ఎనదృశ్యం మారినా అతని కవితా తాత్వికత, సామాజిక నిబద్ధత మారలేదు. రెండుపాయల రంగులు కనుపాపల తీర్థం వెరసి జీవకవిత్వం అతనికి కుదువబడ్డది. చెరువు, చేపలు, వల, కొంగలు, చెలగపిట్టలు, కల్లు, మడికట్లు, ఏరు, అలుగు, మేకలు, గరక, చందమామ... ఇలా అతని కవితా గల్మలోనివన్నీ కవితా పరికరాలే.

దళారీలు, వంచన రాజకీయాలకు బలైన అతిసాధారణ మత్సకారుడు ఉయ్యాల జానయ్యకు జరిగిన అన్యాయం “దాపు” శీర్షిక కవితలో కనిపిస్తుంది. “ఎంతకనీ అల్లుకపోను/ ఎండిపోతవుంటే/ కన్నీళ్లు వంచుకొని/ ఇగురేసుకుంటున్న..” అయినా “..చెర్ల చాపలు కూడా/ రంగు రంగుల జెండాలోలె తిరుగుతున్నాయి/ ..ఒడ్డు మీద కొంగలతో బాటు/ చాపల సేటు ఉన్నడు/.. ఏలు మీద ఎన్నికల మరక తప్పు/ కళ్ళతోనే కాంటా కొడుతున్రు...” అంటూ మోసగించే దళారులను, రాజకీయ నాయకులను గుర్తుచేస్తాడు. మత్సకారుడు “బతుకు పందెం పడని పచ్చీసు”తో పోలుస్తాడు.

“దాపు” కవిత్వం చదివితే యితడు మునాసు వెంకట్ కాదు మనసు వెంకట్ అనిపిస్తాడు. చెరువు, చేపలు, ప్రకృతిని తెలంగాణ భాషను, సజీవనుభవాలను కవిత్వంలో పోతపోస్తడు. ఈయన చెరువును ఎందుకు వదిలిపెట్టడు. అమాయకంగా అడిగే చాలా మంది ప్రశ్నకు కవి చిరునవ్వుతో సమాధానమిస్తాడు. కవి నేపథ్యం, జీవితం, అనుభవాలు, అనుభూతులు సహజంగా కవిత్వంగా పరిణామం చెందుతాయి. తల్లి ప్రేమను తెలుగు సాహిత్యంలో చాలా గొప్పగా వర్ణించారు. మునాసువెంకట్ తండ్రిప్రేమను “అనేకుడు” కవితలో వర్ణించిన విధానం ప్రతీఒక్కరినీ కదిలించేదే. తండ్రి దూరమయ్యాక ఈ కవి చెరువు, చేపలు, చెట్టు, ప్రకృతిలో తండ్రిని చూసుకున్నాడా అనిపించకమానదు. ఈ కవితలో గల ఆర్ద్రతను చదివాక సహృదయ పాఠకుడు తప్పకుండా కన్నీళ్లు పెట్టుకుంటాడు. కవి బాల్యాన్ని దర్శించే అవకాశం కలుగుతుంది. మత్సకారుడు, పల్లకీ బోయి, వంటల వాడిగా, ఇంటిపైకప్పును కప్పే శ్రామికుడుగా కళ్ళలో పెట్టి కాచుకున్న నాయిన గురించి “..నా కలలు మొలకెత్తుతుంటే/ నన్ను నాటిన నాయన/ నా వర్తమాన పూదోట..” అని తన కవిత్వానికి చిరునామా అతనేనని,

“..ఎప్పుడో ఎదురెక్కిపోయిన నాయిన/ చెట్టు చెరువు నీడలు తరుముతుంటే/ తెడల సప్పుడుకి/ ఒడ్డుమీద కరుచుకుని పడుకున్న/ చీకటిని అల్లిస్తూ తెల్లతెల్లారగట్ల/ మంచు కురుస్తుంటే/ నా తల ఒడ్డుకొచ్చి/ బొడ్డుపేగు నిమిరిపోతుండు” అని అంటాడు. చెరువు ఒడ్డున కాళ్ళు ముడుచుకుని తండ్రిని వెతుకుతున్న కవి మునాసు వెంకట్ భావనా చిత్రం కళ్ళముందు కదులుతుంది. “ ..తూర్పు బోరకు/ తూర్పార బట్టిన బతుకు/ బోరబోరకు బోయిలున్నారు.....” (రంగుల బోరలు) అని బతుకుబాధలను గుర్తుచేస్తూ, “బోయిల్లారా మీరు ఎవరూ/ ఇటువైపుకు రాకండి/ ఈ బోరకు అతనే ప్రేమదూత” అని బోయి తరపున బాధను పలికించాడు. తండ్రి బోయిగా పనిజేసిన గతం తాలూకు గాయాలు కవిని వెన్నంటినట్టుగా కనిపిస్తుంది.

“అచింత్యం” కవితలో “సెరువంతా అమ్మగల్లాడి/ ఒడ్డు ఒడిలో నిద్రబోతే/ పున్నమీ రేలగంధం రాసింది..” అంటాడు. “వెన్నెల వేగు” కవితలో “నా కళ్ళలో దృశ్యాల్ని/ హృదయం ఎక్కడికో తీసుకెళ్ళింది/ కొన్ని మైళ్ళు నడిచినంక/ ఓ రంగుల వాగులో మునిగితేలుతున్న” ఇదీ ఆయన కవిత్వంలో ఉన్న సజీవతత్వం.“గల్మ ముందు నిలబడి/ అంతా నిజమే చెబుతాను../బతుకు సారమంతా గల్మ లోపలే” నని తన కవిత్వాన్ని తెలుగు సాహిత్యానికి జీవత్వాన్ని అద్దాడు. తెలుగు కవిత్వానికి తాత్వికతను అద్దిన ఆధునికత “దాపు”.

–విశ్వంభర, 18 సెప్టెంబరు 2025

బంధాల ధ్యాసను గుర్తుచేసేది "సడిలేని గోస"

"బతుకు బాంధవ్య మధురిమను ఎడబాయనొల్లని ఒకానొక దుఃఖితుడు...." నిండైన జీవితానుభవం కలిగిన ఈ కవితాత్మక వాక్యాలు ప్రతీ ఒక్కరి జీవితానికీ వర్తించేవి. ఈ కవితాత్మక వాక్యాలకు చిరునామా బైరెడ్డి కృష్ణారెడ్డి. తెలుగు సాహిత్యంలో పరిచయం అక్కర్లేని ఆర్తికవి. బి. నర్సింగరావు అన్నట్టు "బైరెడ్డి కృష్ణారెడ్డి ఎంతో భావుకుడు. మరెంతో నిష్కపటి." ఆయనను దగ్గరగా చూసినపుడు, జీవితాన్ని మనసు తడితో తడిమిచూసుకునే అరుదైన సంపూర్ణ అంతరంగిక వ్యక్తిగా కనిపిస్తారు. భావోద్వేగాలు జీవలక్షణం. ఆయన కవిత్వంలో వైయుక్తిక భావోద్వేగాలు సార్వత్రికంగా ప్రదర్శితమవుతాయి. ఆర్తిని విశాలంగా, విస్తారంగా చూసిన కవి కన్నులు ఇప్పుడు "సడిలేని గోస" దీర్ఘకవిత రూపంలో ఒక నాయిన దైన్యాన్ని పరికించాయి. ఈ దీర్ఘ కవిత బైరెడ్డి సతీష్ రెడ్డి తండ్రి గారికి చెందిన ఎలీజి. దీనిలో కవి బాధ, ఒక తండ్రి బాధ ప్రత్యక్షంగా, పరోక్షంగా పరస్పరం మారుతూ పాఠకుని హృదయానికి నేరుగా తాకుతూ ఉంటుంది. ఈ దీర్గకవిత నిండా నాయిన బాధను విస్తరించినా, మానవ సంబంధాలను మరింత లోతుగా, సహజంగా చిత్రించాడు.

ఈ దీర్ఘ కవితలో కవి బైరెడ్డి కృష్ణారెడ్డి వ్యక్తపరిచిన కవిత్వ విధానము, కవితాత్మకత భిన్నమైనవి. మరణశయ్యపైనున్న తల్లి తారకమ్మ తుది ఘడియలు మరియు ఆమె మరణం సందర్భంగా తండ్రి బైరెడ్డి యేసిరెడ్డి పడిన దుర్లభమగు బాధ ఆచూకీని ఆర్తితో సహజంగా చిత్రించాడు.

రచన వైయుక్తికం. కవిత్వం సమాజానికి సొంతం. కవులు సంతోషం గురించి ఎందరు రాసినా, దుఃఖం గురించి రాయడం ప్రత్యేకమైంది. సుఖ, దుఃఖాలకు సమప్రాధాన్యత ఉండొచ్చు గాక. నిజానికి మానవ అనుబంధాలకు హేతువు దుఃఖమే. మానవత్వపు పరిమళాలు వికసించాలంటే దుఃఖం తప్పనిసరి. అటువంటి దుఃఖం గురించి రాసినా, చదివినా ఆ నిర్భేద్య దుఃఖం నుండి అవలీలగా బయటపడగలమని ఈ కావ్యం ద్వారా బైరెడ్డి కృష్ణారెడ్డి నిరూపించారు. యాదృశ్చికంగా నాకు నాయిన దూరమయ్యాక చదివిన పుస్తకం ఇది. మొదటి పుస్తకావిష్కరణ ఇది. నా దుఃఖం నాయినకు చెందినది. ఇది కవి మిత్రుడు సతీష్ దుఃఖం అమ్మది. నాయిన తరపునది. ఏ సాహిత్యానికైనా ఆర్తి స్పర్శ తగిలినపుడు అది శాశ్వతత్వం సంపాదించుకుంటుంది.

ఈ దీర్ఘకవితకు "సడిలేని గోస" అనే శీర్షిక సరిగ్గా కుదిరింది. "సడి"

అంటే "నింద, అపకీర్తి" అని డిక్షనరీ అర్థం. బ్రౌణ్య నిఘంటువు ప్రకారం "ఆచూకీ" (A Trace) అనే అర్థం కూడా ఉంది. సడీసప్పుడు అనే జంటపదంలో భాగంగా మనం "సడి" అనే పదాన్ని విరివిగా వినియోగిస్తాం. చరమకాలంలో ఉన్న జీవిత భాగస్వామి అనారోగ్యంతో మంచానపడినపుడు, ఆమె జీవితం ముగిసిపోతున్నపుడు, ఆమె చితిపై ఉన్నప్పుడు, చివరికి ఆమె జ్ఞాపకాలతో జీవితం అంతమవుతున్నపుడు భర్తగా సతీష్ తండ్రిపడే బాధను వకాల్తా పుచ్చుకుని కవి వ్యక్తపరిచిన విధానం ఇందులో కనిపిస్తుంది. ఈ బాధంతా ఆ తండ్రిపడే బాధమాత్రమే కాదు. ప్రతీ తండ్రిబాధ. ప్రతీ కొడుకు బాధ. అదీ ఈ కావ్య గొప్పదనం. అయితే ఈ బాధకు కారణమని ఆ నాయిన ఎవరినీ నిందించలేదు. ఆయనలో ఆయనే మౌనంగా రోధించడం నిశ్శబ్ద గోస కాదు. ఎవరినీ నిందించని గోస, ఈ "సడిలేని గోస".
"అరే సతీషూ!...." అని ఆ తండ్రి పడిన సడిలేని గోసను, బద్దలయ్యే బాధను కవి మౌనంగానే వినిపించాడు. చూపించాడు. తల్లి అవస్థపట్ల, తల్లి దూరం కావడం పట్ల తండ్రిపడే గోసకు ఆచూకీని కనిపెట్టిన కవి బైరెడ్డి కృష్ణారెడ్డి.
'కండ్లెదుట నిశ్చలంగ పడి ఉన్న/అమ్మ మృత కళేభరాన్ని దరిజేర కాళ్ళాడక/అక్కడక్కడనే చుట్టూరా/ కాలు కాలిన పిల్లివోలె తచ్చాడుతున్న .../ ఆ కడపటి చూపుల్ని దాపునకు రానీయకుండా.../అమ్మ పక్కన కూసోని ఆపాదమస్తకం అణువణువూ తడుముతున్న నాయిన............." ఒక దృశ్యాన్ని పాఠకుల కళ్ళముందు నిలబెట్టిన కవిహృదయ ఆర్తివాక్యాలకు కరిగిపోని మనిషి ఉండడు. పట్టపగ్గాల్లేని ముక్కుసూటి దూకుడు కాలానికి ముకుతాడు వేసి, గత స్మృతుల భారాన్ని అక్షరాల్లో వలికించాడు. ఈ కవిత్వంతో తన మిత్రుడు నాయిన దుఖాన్ని సమిష్టి పాఠక దుఃఖంగా మార్చి వేశాడు. ఒకచోట "ఓదార్పు దుఃఖానికి హేతువు" అంటాడు. నిజమే ఆత్మీయులను పోగొట్టుకున్న ప్రతీ గుండె చెలిమ కడలిలో ఓదార్పు పెద్ద తరంగంలాంటిది. "పిండాలకు ఎగబడిన కాకుల వలె జీవితాలను అలుముకున్న చీకట్లను కూడా నిందించని" నైరాశ్యాన్ని ఈ కవితలో చూడవచ్చు. కవి ఓచోట "నాయిన, అమ్మ ఒకరికొకరు ఎండా, వాన, రేయి, పగలులా జీవిత పర్యంతం ఒకటిగా ఉన్నారు. మంచాన పడిన తల్లిని వదిలేయని తండ్రి యొక్క గొప్పదనాన్ని, అతని అంతర్మధనాన్ని రెంటినీ ఓ కవిలా కాకుండా కన్నకొడుకులా పట్టి, ఎంతో సహజంగా, చాలా ఉదాత్తంగా రాశాడు. ఈ దీర్ఘకవిత చదివితే, రాయడం అంటే రాయకుండా ఉండలేకపోవడమే కనిపిస్తుంది.

తల్లి తారకమ్మ మాతృత్వపు గొప్పదనపు విశ్వరూపాన్ని, తండ్రికి ఆ తల్లి

పట్ల ఉన్న అవ్యాజమైన ప్రేమానురాగాలను ఈ దీర్ఘకవితలో పొందుపరిచాడు. ఆమె మరణ సమయంలో ఎంతో విలపించిన కుటుంబ సభ్యులు, బంధువులు నాయినకిక విముక్తి అనుకున్నరు. కానీ అది వట్టి అమాయకత్వమే అంటాడు కవి. నిజమే అనుబంధాలకు కొలమానిక ఎక్కడిది. ఎవరి జ్ఞాపకాల ఉద్వేగాలకు వారే బాధితులు, బానిస మాత్రమే కాదు. బలమైన ఆచూకీ. ఆ ఉనికిని కోల్పోతే తట్టుకొని నిలబడడం ఎంత కష్టమో కవి అక్షరాలలో దర్శించాల్సిందే. కవి తల్లిదండ్రుల లౌకిక, అలౌకిక ఆనందాలు, అలకలు, అలసటలు, అసహనాలు, విసుగూ, వికారాలు ఇవన్నీ వారి మధ్య గుణకారనుబంధాన్ని లెక్కిస్తే... నిజమే, చుట్టూ సమాజానిది ఆ రకంగా ఆలోచించడం వట్టి అమాయకత్వమే అవుతుంది. తల్లి మరణం తరువాత నాయిన ఏర్పాటు చేసుకున్న శూన్యానుబంధాన్ని, తండ్రి అవస్థను కవి ఒంటరిగా కలిసి అనుభవించాడు. ఆ నిశ్శబ్ద శూన్యంలో తల్లిని తలుచుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆ తండ్రిని ఒంటరిగానే దర్శించాడు. అక్షరాలను సైతం ఒంటరిగానే పేర్చుకున్నాడు.

"బతుకు రంగస్థలంమీద వెతల పోరుకు శిరస్సులొగ్గి..../అమ్మకు చేయాల్సినంత చేయలేకపోతిమని....." అని నాయిన పడే బాధను సామూహిక దర్శనానికి నిలిపాడు. *"నాయినా సతీషూ! అమ్మ మృత్యుఘంటికల్లో/ ఎవరెవరివో చావు సంకేత రణగొణలో కాదు/ నాకు నా మృత్యు ఘంటికలూ వినబడుతున్నై/ నా గుండె చప్పుళ్ళు ఆగిపోయిన నాడు...రెండు కన్నీటి బొట్లను నీ గుండె లోతుల్లో/ పదిలంగా దాచిపెట్టుకుంటావు కదూ..."* అని కుమారుడు బైరెడ్డి సతీష్‌రెడ్డి దగ్గరి నుండి తండ్రి అక్షర హామీని తీసుకున్నాడు. ఒక తండ్రి దుఃఖానికి, తన తండ్రిని గుర్తు చేసుకొని అక్షర నీరాజనం పట్టిన బైరెడ్డి కృష్ణారెడ్డి అక్షరశిల్పిగా చిరకాల మౌనవస్థను, చీల్చి చిరకాల కవిత్వ జ్ఞాపిక "సడిలేని గోస"ను పాఠక లోకానికి అందించాడు. "ఎవరెవరి బాధలో రాస్తాను. నా బాధలు దాస్తాను" అని ఓ ప్రసిద్ధకవి అన్నట్టు బైరెడ్డి కృష్ణారెడ్డి తన ఆత్మీయ విద్యార్థి మిత్రుడు బైరెడ్డి సతీష్‌రెడ్డి మాతృమూర్తి కేన్సర్ తో చనిపోయిన తరువాత జరిగిన అంత్యక్రియలలో పాల్గొన్నాడు. సతీష్ నాయిన దుఃఖానికి చలించి, ఈ దీర్ఘకవితను రాశాడు. బైరెడ్డి సతీష్ రెడ్డి ఆంగ్ల భాషను బోధించే డిగ్రీ కళాశాల లెక్చరర్. బైరెడ్డి అనే ఇంటి పేరు తప్ప ఈ బైరెడ్డి ద్వయానికి ఎటువంటి చుట్టరికం లేదు. వీరి గురు శిష్య బంధం ఈ దీర్ఘ కవితకు మూలం. దీని ద్వారా నాయిన దుఃఖానికి ఒక్కటై (వన్ "బై" టూ) సాహిత్య చిరునామాగా నిలిచారు.

–మన తెలంగాణ, 6 ఫిబ్రవరి 2025

కవి జననమే... లోకజ్ఞానానికి జ్ఞానం

జననానికి ఉనికి ఉంటుంది. మరణానికి లేదు. అందుకే జననానికి అంత ప్రాధాన్యత ఉంటుంది. మరణానంతర జీవితాన్ని ప్రోత్సహించే ఆధ్యాత్మికసాహిత్యం జన్మను చక్రంతో పోలుస్తుంది. అంటే జననం తరువాత, మరణం అదేవిధంగా మరణం తరువాత జననం ఉంటుంది. జననం తరువాత చేసే కర్మపనుల ఫలితంగా మరణం, మరణానంతర జీవితం ఉంటాయని దీని అర్థం. చూడడానికి జనన మరణాల గురించి మాట్లాడడం ఆధ్యాత్మికంగా కనిపించినా నిజానికిది భౌతికవాస్తవం. జనన మరణాలు లేని స్థితిని "ముక్తి (కైవల్యం)" అంటారని పౌరాణిక శాస్త్రాలు చెబుతున్నాయి. సాధారణ మనుషులకు మరణం ఉంటుంది కానీ కవిత్వానికి, కవికి మరణం లేదు. కవి రచనా శాశ్వత్వమే కవి యొక్క అంతిమ గమ్యం. కైవల్య పథం. భగవద్గీతలో "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ ...." శ్లోకం(అనుష్టుప్)లో, పోతన భాగవతంలోని "ఎప్పుడు ధర్మక్షయమగు/ ఎప్పుడు పాపంబు పొడము ఈ లోకములో/ అప్పుడు విశ్వేశుడు హరి/ తప్పక విభుడయ్యున్ తన్ను తా సృజియించున్" అంటాడు. అంటే లోకం పాపభూతమైనపుడు భగవంతుడు తనకు తానుగా జన్మిస్తాడని దీని అర్థం. ఇక్కడ పేర్కొన్న సాహిత్య విషయంలో భౌతికంగా రెండు విషయాలను గమనించవచ్చు. ప్రతీ ఒక్కరి జన్మకు కారణం, అర్థం ఉండాలి.

సమాజంలో అన్యాయం పెరిగినపుడు, దానిని ఎదిరించి, శాంతిని నెలకొల్పే కథానాయకుడు ఉద్భవిస్తాడనే కవి దార్శనికత, కవిత్వంలోని సామాజికత కనిపిస్తుంది. కవికి కలిగే ఈ జ్ఞానమే కవిత్వ జననం. కవి జననమే లోకానికి జ్ఞానం. సహజంగా కవి జీవితంలోని అనుభవమే కవిత్వవాక్యంగా పురుడు పోసుకుంటుంది. కవితాశిశు వు ఎదుగుదలకు జ్ఞానం కంటే ధ్యానమే(ఏకాగ్రత) ఎక్కువగా ఉపయోగపడుతుంది. కవి అనుభవంలో భావం ఉంటుంది. తన్నుకొచ్చే భావానికి భాష ఇమిడిపోతుంది. జానపద సాహిత్యమంతా పామరుల నోట సులువుగా పలకడానికి, ధారణ చేయడానికి, సృజియించడానికి కారణం ఇదే.

శైలజా మిత్ర రాసిన "జన్మించడమే కవిత్వం" కవితాసంపుటిలో 61 కవితలున్నాయి. శీర్షికా కవితలో "కవిత్వమంటేనే కవికి మరోజన్మ..." అంటూ, "కవిత్వం ఏదయితేనేమి/ నా హృదయమే సృజనాత్మక రంగస్థలం...... స్వేచ్ఛలేని

చోట సర్వం కోల్పోయినట్టుగా..../నిరాశా నిస్పృహలు కావలి కాస్తున్నాయిప్పుడు/ నేనే కవిత్వంగా మారిపోతున్నాను/ఎవరిని మాత్రం ఏమనగలం?/ ఓర్చుకోలేనంత ఓటమి వేర్లనుండే/ సరికొత్త కవిత్వం ఉదయిస్తుందేమో.../ప్రారంభమైనా ముగింపైనా/ కవిత్వమే కదా కవిని ఆదరించేది..."

ఈ కవితా వాక్యాలలో కవిపుట్టుక ఆవశ్యకత, సామాజిక బాధ్యత స్పష్టంగా కనిపిస్తాయి. కవి, కవిత్వానికి జనన మరణాలు ఉండవు. కవిత్వం కథానాయకుడు సమాజంలో స్వేచ్ఛలేనపుడు, నిరాశానిస్పృహలు అలుముకున్నప్పుడు కవి హృదయరంగస్థలంపై సరికొత్త కవిత్వంతో పుడతాడు. శాంతిని, స్వేచ్ఛను కోరుకునే కథానాయకుడు కవిని ఆశ్రయిస్తాడు. ఈ కవితా సంపుటి శీర్షిక "జన్మించడమే కవిత్వం" అని ఆధ్యాత్మికంగా కనిపించినా, సామాజిక కోణంలోనే కవిత్వం ఉంది. కవిత్వానికి ముక్తి శాశ్వతత్వమే. ఈ సంపుటిలోని కవయిత్రి హృదయంలో జనించిన ప్రతీ కవిత, పాఠకుల హృదయం, మెదడులో పునర్జన్మను పొందగలుగుతాయి.

"నల్లరంగు శిశువు" కవితలో "గర్భస్రావం అయిన భూమి దేహంలా/ అనేక తొక్కిళ్ళ మధ్య తల్లిపడి ఉంది....../ నిజంగా రెండు హృదయాలుంటే/ పిండదశలోనే నిర్జీవులైపోతున్న/ స్త్రీ శిశువుల కోసం ఒక హృదయం దాచేది....../ ఒకటి జననానికి, ఒకటి మరణానికి అంకితం చేసేది/ఒంటరితనం సమూహంలో కనీసం/ కాళ్ళకింద వొదగలేని మరో రూపాన్ని ఎలా దాస్తుంది?..../ తల్లి పేగు తెంచుకుని నీటిబొట్టులా నయినా/ రాలిపడలేని స్థితిలో నల్లని శిశువు ఎంతసేపు మౌనం ధరిస్తుంది?.../ ఆమె ఒక దేశాన్ని కాపాడుతుంది/ అతడు ఒకదేహాన్ని పరిపాలిస్తుంటాడు/ ఆమె ఒక చేతిలో ప్రేమ ఒక చేతిలో స్వప్నం.../ కడుపుకు అనుకున్న మంచిని అందరికీ పంచుతుంది/ బరువెక్కిన హృదయాన్ని మాత్రం/ ఆకాశంలో చిత్రపటంలా వేలాడదీస్తుంది.."

స్త్రీల దుఖం, ఒంటరితనం, భావోద్వేగాలు, సామాజిక అన్యాయం, అసమానత కోణంలో రాసిన స్త్రీవాద కవిత్వంలో ఈ కవితను ఒకటిగా పేర్కొనవచ్చు. కవయిత్రి స్త్రీవాద అంతర్దృష్టితో రాసిన ఈ కవితలో తల్లిగా, కవయిత్రిగా పునర్జన్మ పొందింది. మరల మరల చదివించేలా ఈ కవిత ముక్తిని సాధించింది. కవయిత్రిలోనున్న ఆధ్యాత్మికతను సామాజికత జయించింది. కవితలో భూమి అంటే

ఆమె. ఆమె అంటే భూమి. గర్భస్రావం అయిన భూమి ఎలా ఉంటుంది? అస్తిత్వం, సహజసౌందర్యం, పరివర్తనాశక్తి, జీవాన్ని, కళను కోల్పోతుంది. జీవంలేని చోట నిస్సారవంతమైన కళావిహీన జీవితమే మిగిలిపోతుంది. ఎన్నో పుట్టుకలకు కారణమై దేశాన్ని కాపాడే ఆమెదేహంపై ఆమెకు స్వేచ్ఛ లేదు. అయినా ఆమె రెండు చేతులా ప్రేమను, స్వప్న సౌధను అతడికోసం నిర్మిస్తుంది. మంచిని పంచి, అతడు తల ఎత్తితే కానీ కనలేని(చూడలేని/ప్రసవించలేని) బాధను, ఆకాశానికి వేలాడదీస్తుంది. తల్లి బాధను భరించలేని "నల్లరంగు శిశువు" ఆమె చేతిలోని స్వప్నం. కళావిహీనంగా బాధలను, ఆకాశపతాకంగా మార్చుకున్న హరించబడిన స్వేచ్ఛను కలిగిన స్త్రీల తరపున కవయిత్రి తెలిపిన నిరసననే ఈ "నల్లరంగు శిశువు" కవిత.

"కంచిపట్టు కన్నీళ్లు" కవితలో "స్త్రీ జననమే శత్రుత్వంతో మొదలు...." అంటుంది. "మరణం మాఫియా" కవితలో "మరణం ఏ ఒక్కరి ఆస్తి కాదని...జననం మాట్లాడకున్నా, మరణం మాట్లాడాలని" ఆశాభావం వ్యక్తం చేస్తుంది. మనిషి నిత్యాన్వేషకుడు. ఈనాడు ఆకలి చావులకంటే, అహంకారపు చావులే అధికంగా ఉన్నాయి. జ్ఞానసముపార్జనతో విర్రవీగే మనిషి గురించి, "ఏముందిక్కడ?/ ఏమీలేని తనం...ఏదీ తెలియనితనం తప్ప!" అని "ఏముందిక్కడ" కవితలో మనిషి జ్ఞాపకాలను జ్ఞానం, అజ్ఞానమనే రెండు పాయలను విడదీసి చూపిస్తుంది. వృద్ధాప్యంలోని ఒంటరితనం గురించి "క్షణాలు, నిమిషాలు, గంటలు/ దొర్లిపోయి రోజులుగా మారి/ నెలలు సంవత్సరాలుగా మారాక/ వంటింటి పాత్రకున్న విలువ కూడా లేకుండా/ చప్పుడు చెయ్యొద్దంటూ శాసిస్తారు" అని "ఎవరూ లేనితనం" కవితలో రాశారు. దేశమైనా, మనిషైనా "పోరాటమంటే ఆక్రమించుకోవడం కానే కాదు, నిత్యం తలుచుకునేలా" వ్యవహరించడమని "అమరణీయం" కవితలో రాశారు. కవిత్వం గొప్పదనం గురించి రాస్తూ" మనుషులకు ప్రేమ దొరకనినాడు/ ప్రపంచం ఒక కట్టెల వనం.../ సమాజం ఒక సమాధిగా మిగిలిపోతుంది..." అంటుంది. "బతుకు రణరంగ వైరాగ్యంలో.../ ఓడిన గుండెను నిలదీస్తేనే అర్థమవుతుంది..."అని బతుకు విలువను "కవిత్వ కాంతుల్లో.." కవితలో చెబుతుంది. "జీవితానికి ఆవల" కవితలో నిజం, అబద్ధాలు ఉన్నా, వాస్తవంలో బతకాలని హితవు ఉంటుంది.

-10 జూన్ 2024, మన తెలంగాణ

బహుజన స్పృహతో రాసిన కథలు "బర్కతి"

మానవ వికాసం వృద్ధిచెందినా కొద్దీ సమాజం అసమానతలు పెరిగి సంక్లిష్టంగా మారుతుంది. సమత, ఏకత, మానవత ఆధునిక సృజన లక్ష్యం. 'ఇంచుక సత్యమైన కల్పితప్రబంధము కథ. రూపసారాన్ని బట్టి కథ రెండురకాలు. వాస్తవికత, జీవితనుభావాలు కథాసంబంధమైనవిగా, కల్పితాంశం ప్రధానంగా ఉండేది కథన సంబంధిగా ఉంటుంది. ప్రపంచ కథకు పుట్టినిల్లు తెలంగాణ. తెలుగు కథకు పురిటిగడ్డ కథల కొండ నల్లగొండ. డాక్టర్ సాగర్ల సత్తయ్య రాసిన "బర్కతి"కథలు పరిమితమైన కల్పితాంశంతో రాయబడిన కథా సంబంధ కథలు.

'బర్కతి" లో పదిహేను కథలున్నాయి. ఇవి సమకాలీన గ్రామీణ బహుజన జీవితాలు. సమాజ సంక్షేమమంటే బహుజన సంక్షేమం. బహుజన జీవితాలు ఉత్పత్తి కులాలుగా ఉన్నప్పటికీ వెలితితో, లేమితో ఉంటాయి. అయినా వారి జీవితం నిండైన సంస్కృతీకరణతో, అనుబంధాలు, ఆప్యాయత గల పలకరింపుల కలబోతగా కలిమితో ఉంటాయి. "బర్కతి" కథలలో ఈ రెండు పార్శ్వాలు కనిపిస్తాయి. బహుజన రాజకీయోద్యమం బలపడుతున్న వర్తమానకాలంలో "బర్కతి"కథలు బహుజన సాహిత్యానికి చక్కని జోడింపు. ప్రపంచవేదికతోబాటు పలు కథాపోటీలలో ఉత్తమ కథాపురస్కారాలను సొంతం చేసుకున్నాయి. నమాజు సమయంలో ముస్లింలు ధరించే టోపీని "బార్కాతి" అంటారు. ఇది పవిత్రత, భక్తికి చిహ్నం. "వల్ బరకతి" అంటే "ఆశీర్వాదం" అని అర్థం. తెలంగాణ ప్రాంతంలో "బర్కతి" అంటే "పంటల రాబడి, భాగ్యవంతమైన" అనే అర్థాలలో ఉపయోగిస్తారు. తెలంగాణ పద(బంధ) కోశం ప్రకారం "అర్కతి బర్కతి లేకపోవడం" అంటే "ఎప్పుడు వెలితితో లేమితో ఉండడమనే అర్థం ఉంది. ప్రకృతి "బర్కతి"అయి ఉండవచ్చు.

"బర్కతి" కథలలో అచ్చమైన తెలంగాణ మధుర సంభాషణలు, సరళశైలి, సామాజికత, అభ్యుదయం, ఆలోచన, హేతువాదం, ఆత్మ చైతన్య భూమిక సారంగా కన్పిస్తుంది. కథావస్తువు పేదల అవిద్య, మూఢనమ్మకాలు, మత్తు, దళారీ దోపిడీ, కుల, లింగ వివక్ష, వృత్తుల విధ్వంసం ఉంటుంది. ఇవి సమాజంలో విడివిడిగా లేవు. గొలుసుకట్టుగా ఉన్నాయి. వీటి బారినపడిన బహుజన జీవితాలు అర్కతి బర్కతి లేకుండా సంక్షోభంలో ఉన్నాయి. రచయిత అభ్యుదయ సామాజిక బాధ్యత,

బహుజన స్పృహతో అవగాహన కల్పించడానికి క్రమపద్ధతిలో కథలను ఒడుపుగా రాశాడు. సాహిత్య పరమావధి సమానత్వం, సంక్షేమం, మానవత్వం. సామాజిక రుగ్మతలే బహుజన సంక్షేమానికి ప్రధాన ఆటంకం. ఈ అవగాహనకు చదువే ముఖ్యం. సాగర్ల సత్తయ్య రాసిన మొదటి కథ **"పరిష్కారం"** చదువు ప్రాధాన్యతను నొక్కిచెబుతుంది. బాలికలను ప్రభుత్వ ఉచిత విద్యకు పంపి, అబ్బాయిలను లక్షలుపోసి ప్రైవేటు చదివించినా ఫలితాలలో ఎప్పుడూ బాలికలదే పైచేయి ఉంటుంది. అయినా సగటు తల్లిదండ్రులు అమ్మాయిల చదువును భారంగానూ, పెళ్లి విషయంలో బాకీగానూ చూస్తున్నారు. ఈ సమస్యను, విద్యప్రాధాన్యతను "పరిష్కారం, "కోటిదీపాల వెలుగు, "ఓ మొగ్గ నవ్వింది" కథలు చెప్పాయి. వృత్తుల విధ్వంసం గురించి "సారె", శాస్త్రీయదృక్పథం ఆవశ్యకతను గురించి "మరుగుమందు, దళారీ వ్యవస్థను "ఎన్నుగర్ర, "తోడేళ్ళు" కథ కుల వివక్ష గురించి "ఊరబోనాలు" కథ, డ్రగ్స్ కల్చర్ గురించి "చాపకింది నీరు" కథలో ఉంటుంది.

తెలంగాణ భాష, చారిత్రక, వారసత్వ ఆధారాలతో తెలుగు భాషకు ప్రాచీనహెూదా దక్కింది. ఇప్పటి కథకులు పత్రికాభాషకు అలవాటుపడ్డారు. "బర్కతి" కథల్లో అచ్చమైన తెలంగాణ వ్యావహారిక భాష మాధుర్యం ఉంటుంది. సంభాషణలు, పలుకుబడులు కథకు ప్రాణం పోశాయి. ఇవి ఆసక్తికరమైన కథాగమనానికి తోడ్పడ్డాయి. నిజజీవిత అనుభవాలను కథగా మలిచినపుడు ప్రత్యేకమైన రచనాశైలి సహజంగానే కన్పించదు. కృత్రిమ పదబంధాల సృష్టి, సన్నివేశాలు, అభూతకల్పనలు, ఊహించని మలుపులేవీ ఉండవు. పాత్రీకరణలో సామాన్యులనుభావాలు, అత్యున్నత విలువలు, అనుబంధాలు, అమాయకత్వం, స్వచ్ఛమైన సంస్కృతి "బర్కతి"లో ఉంటుంది.

డా. సాగర్ల సత్తయ్య వృత్తిరిత్యా ఉపాధ్యాయుడు కావడంతో కథల్లో అక్కడక్కడా మహాప్రాణాక్షరాలతో కూడిన పదాలు, నాగరిక భాష ఉంటుంది. ఇది పాత్రోచిత, సన్నివేశ ఉచితమైన భాషగా ఉండి పాఠకుని అవగాహనను సులభతరం చేసేదిగా, వేగవంతమైన పఠనానికి ఉపయోగపడేవిధంగానే ఉంటుంది.

–ముందుమాట, "బర్కతి" కథలు, మే 2025

"చీమ-ఉడుత కథలు"- విద్యార్థుల వాస్తవిక జీవన పుటలు

తాటికల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనుండి కుమారి ఆకిటి ఆశ్రిత కథారచనలో రాష్ట్రస్థాయి ప్రథమవిజేతగా నిలిచింది. విజయాన్ని జరుపుకోవడం అంటే ఆనందాన్ని పంచుకోవడమేనని ఈ పాఠశాల ఆరవతరగతి విద్యార్థులు "చీమ-ఉడుత కథలు" రాసి నిరూపించారు. మార్గదర్శకుడుగా శ్రమించిన ప్రముఖ కథా రచయిత, తెలుగు ఉపాధ్యాయుడు డా. సాగర్ల సత్తయ్యగారు, వారికి ఉడుతా భక్తిగా సహకరించిన పాఠశాల యాజమాన్యం చరితార్థులు.

"చీమ- ఉడుత కథలు" పుస్తకంలో 19 కథలున్నాయి. ఆరవతరగతి పాఠం "ఉడత సాయం" పాఠం విని, దాని ఆధారంగా ఈ కథలను రాశారు. వీటిని చదివితే, తరగతి గదిలో మాతృభాషలో విద్యార్థి కేంద్రీకృత చైతన్యవంత బోధనాభ్యసన జరిగినట్టుగా అర్థమవుతుంది. విద్యార్థులు కథలు రాయడం వలన వారిలో స్వేచ్ఛాభ్యసన, క్లిష్టమైన ఆలోచన, సమస్య పరిష్కారం, సహకారం అలవడుతాయి. విభిన్న కథన దృక్కోణాలను అన్వేషిస్తారు. కథలో వారిదైన స్వీయ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తారు. ఆరవతరగతి విద్యార్థుల స్థాయిలో ఒక కథను రాయడం అంత సులభం కాదు. కథా ప్రారంభం, ఆసక్తికర కొనసాగింపు, ముగింపును సృష్టించడంతో పాటు, పాత్రల అభివృద్ధి, సంభాషణలు, చెప్పాలనుకునే నీతి, ఊహ, ప్రేరణవంటి అంశాలు ఎన్నో ఉంటాయి. వారు ఎక్కువగా స్వంత కథలపైననే ఆధారపడుతారు.

బాలల కథాసాహిత్యంలో పూర్వపు రచయితలు ఉడుతను సాయపడేదిగాను, చీమను శ్రమైక జీవిగాను గుర్తించారు. కానీ తాటికల్ విద్యార్థినీ, విద్యార్థులు తమ సృజనకు పదును పెట్టి రాసిన "చీమ- ఉడుత కథలు" లో ఉడుత, చీమల స్వభావాలను తమ కథల్లో మరింతగా విస్తరించారు. ఈ "చీమ- ఉడుత కథలు" వట్టి కథలు కావు. తాటికల్ విద్యార్థుల వాస్తవిక జీవన పుటలు.

ఈ కథల్లో నీతి ప్రధానంగా ఉండి, చాలా వరకు పిల్లల అనుభవాలు, సామాజిక పరిశీలన అంతర్లీనంగా ఉన్నాయి. మేడ శశివర్ధన్ కుమార్ రాసిన "చీమ చేసిన మేలు" కథలో ఆకలిగొన్న ఉడుతకు చీమ సాయం చేస్తుంది. ఇందులో సాయం చేయడానికి సైజుతో పనిలేదనే నీతి దాగి ఉంది. పరసగోని సరయు

"చీమల దాడి" కథలో బలహీనులకు ఐక్యమత్య అవసరాన్ని తెలిపింది. మరొక కథలో "ఈగకు బుద్ధి చెప్పిన ఉడత" గురించి నేర్పుగా రాసింది. ఏరుకొండ లిఖిత రాసిన కథ "ఉడుత మోసం". ఇందులో చీమనోటి నుండి జారిపడే పండుకోసం ఉడుత ఎత్తులను ఆలోచనాత్మకంగా రాసింది. ఆకిటి గణేష్ "ఉడత ఆకలి" తీర్చడానికి చీమ చేసిన త్యాగం గురించి ఉంటుంది. మరొక కథా రచయిత మాదగాని ఠాగూర్ "అప్పు ఇచ్చిన ఉడత" కథలో చీమ పొదుపరితనాన్ని, భవిష్యత్తుకోసం అప్పు తీసుకునే సగటు జీవిని కథలో ఆవిష్కరించాడు. "ఎలుక అసూయ" కథలో చీమపై ఉడుతకు చాడీలు చెప్పే ఎలుక యొక్క చెడుబుద్ధిని పొల్లెగొని లావణ్య తెలివిగా బయటపెట్టింది. మొగిలి భరత్ చంద్ర ఆజాద్ రాసిన "చీమ రాణి సహాయం" కథలో పరోపకారం గొప్పదనాన్ని ఆవిష్కరించాడు. నారగోని సిద్దు పర్యావరణ పరిరక్షణ గురించి "వేటగాడికి బుద్ధి చెప్పిన చీమలు" కథను రాశాడు. మొగిలి సిద్ధార్థ "చీమ పిల్లల ఆకలి" కథలో పరోపకారం గురించి, ఆకలి గురించి రాశాడు. "ఉడత పుట్టినరోజు" కథలో మేడ శశివర్ధన్ కుమార్ స్నేహం గొప్పదనాన్ని రాశాడు.

మొగిలి భరత్ చంద్ర ఆజాద్ "జింకను కాపాడిన చీమ ఉడత" కథలో వేటగాడి గురి నుండి స్నేహితుడైన జింకను తప్పించిన విధమును రాశాడు. "సాయం" కథలో సుంకర బోయిన సంజన ఉడుత ఆకలి తీర్చిన చీమ గొప్పదనం గురించి చెప్పింది. "ఉడత గొడుగు" కథలో పర్సగోని సరయు చీమ పరోపకారం గురించి రాసింది. "ఉడుత దుర్బుద్ధి" కథలో వనం సాయి చరణ్య ఉడుత అత్యాశను బయటపెట్టింది. తేళ్ల చరిష్మా "ఆకలి గొన్న చీమ" కథలో చీమ యొక్క ఆకలి తీర్చిన ఉడుతను గురించి రాసింది. చెవుగోని యశస్విని "చీమను కాపాడిన ఉడుత, పావురం" కథలో పావురం పరోపకారం వలన చీమ ఎలా బతికి బయటపడిందో తెలుస్తుంది. పొల్లెగోని వరుణ్ తేజ రాసిన "చీమ తెచ్చిన పండు" కథలో స్నేహితుల మధ్య అరమరికలు లేని స్వచ్ఛమైన స్నేహం గురించి ఉంటుంది. వనం మేఘమాల రాసిన "గొడవ పడిన చీమ ఉడత" కథలో అహం వీడితే స్నేహం ఎలా వికసిస్తుందో వివరించింది. కథలు పిల్లల యొక్క ప్రపంచాన్ని అందంగా, ఆలోచనాత్మకంగా మరింత సృజనతో మనకు వివరించేవే.

–విశ్వంభర, 5 డిశంబర్ 2024

కొత్త కథకుల కరదీపిక

తెలంగాణ కథకు కొంగ్రొత్త వ్యాస విమర్శిని మైలురాయి డా. వెల్దండి శ్రీధర్ "కథా కచ్చీరు". సాహిత్యప్రక్రియలలో అత్యంత ప్రాచీనమైనది కథ. మానవ పరిణామక్రమాన్ని వర్ణించే ఊహాత్మక పరికల్పన కూడా కథేనని భావించాలి. కథ పుట్టుకకు మూలం ఊహ అయితే, ప్రయోజనం జ్ఞానంతో కూడిన వినోదం. కథా సంవిధానంలో సమాజం భూమికగా ఉంటుంది. కథకు మూడు కోణాలు ఉంటాయి. ప్రతీ కోణంలో రచయిత, పాఠకుడు, విమర్శకుడు కూర్చొని ఉంటారు. వీరు ముగ్గురూ వారి వారి పాత్రలకే పరిమితం కాకుండా, ఒకరి పాత్రనుండి మరొక పాత్రలోకి పరకాయ ప్రవేశం చేస్తూ కథను పరీక్షకు నిలబెడుతూ ఉంటారు. మంచికథకు కాలంతో సంబంధం లేకుండా కథ చుట్టూ సమకాలీనంగా, పాఠకుడు, విమర్శకుడు అధునాతన సాహిత్య సామాజికులుగా నిలబడతారు. కథలు కాలపరీక్షకు నిలబడాలంటే రచయిత కానీ విమర్శకుడు కానీ మిగతా ఇద్దరినీ మెప్పించగలగాలి.

డా. వెల్దండి శ్రీధర్ తెలుగు సాహిత్య అధ్యాపకుడు, కవి, కథా రచయిత, సాహిత్య విమర్శకుడు, సాహిత్య పరిశోధకుడు, ప్రయోగ అభిరుచి కలిగిన నిత్యరచనాభిలాషి. కాబట్టి అతనిలో రచయిత, పాఠకుడు, విమర్శకుడు ముగ్గురూ ఉండడానికి అవకాశం లభించింది. శ్రీధర్ రాసిన తెలంగాణ కథాసాహిత్య విమర్శ "కథా కచ్చీరు" పుస్తకం తెలంగాణ కథావిమర్శలో కొత్త ప్రారంభాన్ని పరిచయం చేస్తున్నట్టుగా భావించవచ్చు. బండారు అచ్చమాంబ మొదలు శీలం భద్రయ్య వరకు 72మంది తెలంగాణ కథకుల కథారచనలోని బలాబలాలను కచ్చీరులో నిలబెట్టి, గర్వంగా కూర్చోబెట్టిన "కథా కచ్చీరు" తెలంగాణ కథకు కొంగ్రొత్త వ్యాస విమర్శిని మైలురాయి. మానవ స్వభావాన్ని రచయితలు అన్వేషించడం, మానవీయ ధర్మాలను గుర్తు చేస్తూ ఎరుకను కలుగజేయడం, వీలైతే పరిష్కారం చూపడమే సాహిత్యప్రయోజనం. దీనిని తెలుసుకోవడానికి పాఠకుడు సిద్ధమైతే, విమర్శకుడు

దీనిని నిర్ధారించి, శోధించగలుగుతాడు. శోధన అంటే సాహిత్యపరంగా "పరిశోధక విమర్శ", "శోధక విమర్శ" అని రెండురకాలు. మొదటిది అకాడమిక్ స్థాయిలో జరిగితే, రెండవది పరిణిత, పరిపక్వ విమర్శగా చెప్పవచ్చును. పరిణిత పరిపక్వ శోధక విమర్శలో రెండు రకాలున్నాయి. ఒకటి "సంప్రదాయ విమర్శ, రెండవది ఆధునిక విమర్శ". సంప్రదాయ విమర్శలో పూర్వీకుల ప్రమాణాలను గౌరవిస్తూ, కావ్యగుణాలను బహిర్గతపరచడం. నేటికాలంలోని సాహిత్య విమర్శను "అధీకృత విమర్శ, ఆధిపత్య విమర్శ" అని రెండు రకాలుగా పరిశీలించవచ్చు.

ఒక రచయిత దృక్పథాన్ని, అంతర్దృష్టులను సామాన్యీకరణ చేస్తూ రాసే విమర్శను "అధీకృత విమర్శ"గా భావిస్తే, సంప్రదాయ భావనలకు విరుద్ధంగా, రచయితకు అందని కోణాలను, కథలోని నూతన ప్రయోగాలను పసిగట్టడం "ఆధిపత్య విమర్శ" లక్షణాలు. సమగ్రతకు స్వరూపం నిర్ణయించడం సాధ్యంకాకున్నా, అవగాహన కొరకు చెప్పుకోవాలంటే, "ఆధిపత్య విమర్శ" 360 డిగ్రీకోణంలో వృత్తాకారంగా చేయగలిగేదిగా చెప్పవచ్చు. ఒక్కోసారి ఈ విమర్శ ద్వారా రచయిత మరియు పాఠకుడి ఆలోచనలను తారుమారు చేయవచ్చు. డా. వెల్దండి శ్రీధర్ 72మంది తెలంగాణ కథకుల కథలలో ప్రతీ కథను పాఠకుడిగా చదివి, రచయితగా తాను రాసిన కథగా భావించి, కథపట్ల అత్యంత ప్రేమతో దానిని అక్కున చేర్చుకుని సమగ్ర అవలోకనం చేస్తూ, విమర్శకుడిగా ప్రతీకథను"ఆధిపత్య విమర్శ" చేశాడు.

కథా విమర్శ అనగానే వస్తువు, శిల్పం, భాష, పాత్రీకరణ, మానవ స్వభావ, అనుభవాల అన్వేషణ, రచయితల ఘనీభవించిన దుఃఖం, జ్ఞాపకాలు, పాఠకుడిని ఆకట్టుకోవడానికి రచయిత చేసే ప్రయత్నాలు, సామాజిక అంశాలు వంటివి మాత్రమే కనబడతాయి. "కథా కచ్చీరు" విమర్శలో శ్రీధర్ యొక్క బాధ్యత ప్రత్యేకంగా కనబడుతుంది. రచయిత యొక్క కథను సూక్ష్మ కథనం చేస్తూ, సంక్షిప్తతతో వివరించడం వలన పాఠకులను, పత్రికా నిర్వాహకులను అతిత్వరగా మెప్పించగలిగాడు. క్లుప్తతకు తోడు, సాహిత్యపర విశ్లేషణ చేశాడు. రచయితల దృక్కోణాలను, కథా ఇతివృత్తాలు ఎంపిక చేసుకోవడంలో విమర్శకుని తెలివైన బాధ్యతను భుజానికెత్తుకున్నాడు. తెలంగాణ కథను "తెలుగు సాహిత్య కచ్చీరు"పై సగర్వంగా కూర్చోబెట్టాడు. ఎంపిక చేసుకున్న కథల్లో మానవత్వపు పరిమళాలను వేదజల్లేవి, సాంస్కృతిక పరమైనవి,

చారిత్రకపరమైనవి, సామాజిక, రాజకీయ, జాతి, భాష, ప్రాంతీయ, లైంగిక తారతమ్యాలను తెలియజేప్పేవి ఉన్నాయి. కాబట్టి ఈ కథా విమర్శ సమగ్రమైనది. ఈ పుస్తకంలో నూరేళ్ళ ముందు చూపు "స్త్రీ విద్య" మొదటి వ్యాసం. "లోకమర్మాన్ని తెలిపే "లొట్టపీసు పూలు" చివరి వ్యాసం. "సంఘాల పంతులు, పందెం, చీకటి రాజ్యం, నోటీసు, ఊరేగింపులు, గొల్లరామవ్వ, బఱ్రెంక చెట్టు', నిప్పుపూలు, నిత్యగాయాల నది" వంటి కథలు చారిత్రక ప్రాధాన్యత కలిగిన కథలు. ఈ కథల్లో శిల్ప నైపుణ్యాన్ని ప్రత్యేకంగా టార్చ్ వేసి చూపించారు. "సంఘాల పంతులు" కథను సూత్రీకరిస్తూ, "ఈ కథ మైదానంలో ప్రవేశించిన నదిలాగ మెల్లగా మొదలై, అటుపై వేగం పుంజుకుని, ఒక్కసారిగా భళ్ళున బద్దలవుతుందని" కథా శిల్పం గురించి చెప్పాడు. "అధ్యయనం ద్వారా మానసిక వికాసం కలుగుతుందని చెప్పే కథ "పందెం" అని తొలితరం కథకురాలు నందగిరి ఇందిరాదేవి గురించి చెబుతారు.

దాశరథి రంగాచార్య 'తామరపూలు' కథను వ్యాఖ్యానిస్తూ "శిల్పం పాత్ర చిత్రణలోనో, వస్తువులోనో, రాసే టెక్నిక్ లోనో ఉండదు. కథంతా పరచుకొని ఉంటుంది." అంటారు. ఈ వాక్యం శిల్పం గురించి అన్వేషించే వారికి ఒక సమాధానంలా కనిపిస్తుంది. డా. నలిమెల భాస్కర్ రాసిన మంద కథ మీద తీర్పిస్తూ "కథలు ఊహల్లో కాదు, నిజ జీవితం నుండి పుడుతాయనేదానికి ఈ కథ ఒక నిదర్శనం. అందుకే ఈ కథ ఇంత సహజంగా వచ్చి ఇప్పటికీ తాజాగానే నిల్చున్నది. కథ ముగింపు ద్వారా కూడా రచయిత కొన్ని వందల పుటల్లో చెప్పలేని విషయాన్ని బోధపరుస్తాడు" అని కథను సాధికారికంగా కామెంట్ చేశారు. ఒక విమర్శకుడు లేదా ఒక మెచ్యూర్డ్ పాఠకుడు ఒక కథను ఏ కోణంలో పరిశీలిస్తాడో ఇందులోని ప్రతి వ్యాసం చెప్తుంది.

తెలంగాణ కథాసముద్రంలో అన్ని పొరలను, అన్ని వాదాలను, అన్ని కాలాలను పట్టి చూపే కథలున్నాయి. ఈ కథా కచ్చీరులో శ్రీధర్ వాటికి ప్రతినిదుల్లాంటి కథల్ని ఎన్నుకొని, వాటిని తనదైన దృక్పథంతో పరామర్శించి తెలంగాణ కథా వైవిధ్యాన్ని చాటిచెప్పారు. ముందుమాటలో డా. అఫ్సర్ చెప్పినట్లు "గత పాతికేళ్ళుగా తెలంగాణ కథ అనూహ్యమైన దూరాలకు ప్రయాణించింది. వస్తు వైవిధ్యంతో పాటు రూప శ్రద్ధని పెంచుకుంది. శ్రీధర్ ఈ సంపుటిలో ఉదాహరణగా చూపించిన

ప్రతి కథా ఇదే విషయాన్ని ఒకటికి పది సార్లు రుజువు చేస్తుంది. ఆయా జిల్లాల యాసని పట్టుకోవాలన్న రచయితల తపనలోంచి జిల్లాల వారీగా కథా చరిత్రల మీద కూడా పరిశోధకులు పని చేస్తున్నారు. అయితే వీటన్నిటినీ ఏకతాటి మీదికి తీసుకురావడం తెలంగాణ కథా శిల్పం మీద కొన్ని మౌలికమైన ప్రతిపాదనలు చేస్తేనే సాధ్యం. శ్రీధర్ ఈ కచ్చీరులో సాధించింది అదే". తెలంగాణ కథ విమర్శకు ఈ 'కథా కచ్చీరు' ఒక గొప్ప చేర్పుగా భావించాలి. ఈ గ్రంథం కేవలం పరిశోధకులకు, కథాభిమానులకు మాత్రమే కాదు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి కూడా ఉపయుక్తంగా ఉంది. ఎందుకంటే ఇందులోని రచయితల గురించిన అప్‌డేట్ సమాచారాన్ని పొందుపర్చారు రచయిత. కొత్తగా కథ రాయాలని కలం పట్టుకున్న వాళ్ళు తప్పనిసరిగా ఈ 'కథా కచ్చీరు'లో ఒక సాధారణ వ్యక్తిగా కూర్చోవాల్సిందే. మన ముందుతరం కథకులతో పాటు ఇవాల్టి కథకులు ఎలా రాస్తున్నారో, వాళ్ళ కథల్ని ఎలా చూడాలో ఈ కచ్చీరు వెల్లడిస్తుంది.

–నమస్తే తెలంగాణ, 21 అక్టోబర్ 2024

నెరుసు పూసుకున్న మెరుపులాంటి విమర్శ

మౌర్యుల తరువాత రాజకీయకారణాలతో ఉత్తరాదికే పరిమితమైన సంస్కృతం, వైదికం దక్షిణాదికి విస్తరించింది. బలి ఆచారం, ఉదారత కారణంగా స్థానికంగా వైదికమతం, సంస్కృతభాషకు ఆధిపత్యం లభించింది. వైదికధర్మం రాకతో దక్షిణాదిలో వృత్తి ఆధారిత కులవ్యవస్థ పురుడుపోసుకుంది. ఉత్పత్తి వర్గాలైన పల్లెల్లోని బహుజన వృత్తి జీవనసౌందర్యాన్ని ప్రధానఇతివృత్తంగా చేసుకుని కవివత్సలుడు హాలుడు ఏడువందల పద్యాల కథాసమాహారం "గాథా సప్తశతి"ని ప్రాకృతభాషలో రాశాడు. రాతి అవశేషమే మృత్తిక. రాయిలాంటి మనిషిలోని కరుకుదనాన్ని కరిగించి మెత్తని మన్నుగా మార్చేది కవిత్వం. కవి దీనిలో మానవత్వపు విత్తును శ్రద్ధగా నాటితే సమాజం పచ్చగా మారుతుంది. భూభౌతికంగా, సాహిత్యపరంగా తెలంగాణ నేలది ఎరుపు స్వభావం. బెదిరిపోయిన సమాజానికి ఎదురరొడ్డి పోరాడేశక్తిని, కఠిన హృదయాలను కరిగించే కవిత్వాన్ని కవులు అక్షరాలలో పొదిగారు.

ప్రజాసాహిత్యం ప్రజలపక్కన నిలబడుతుంది. మరి ప్రజావిమర్శ? సిద్ధాంతంతో కూడి ఉంటుంది. విమర్శ విభిన్న ప్రయోజనాలను వివిధ కోణాలలో చాలామంది చర్చించారు. సూత్రీకరించబడిన సైద్ధాంతికత నిర్ణయమే విమర్శ. ఇది సైద్ధాంతికతకు పదును పెడుతుంది. పాఠకులు తెలివైనవారు. విప్పిచెప్పడమనేది అనుషంగము. మనుగడలోనున్న సిద్ధాంతంలో ప్రజాస్వామ్యం లేనప్పుడు పరిణామక్రమంలో కొత్తసిద్ధాంతం ఉదయిస్తుంది. ఇప్పటి నవీన సామాజిక సిద్ధాంతం బహుజనవాదం. బహుజన కవిత్వాన్ని, భాష, కవితాశైలిని వ్యాపార, అనువాద కవులు తేలికైన కవిత్వంగా ప్రచారం చేశారు. దానితో బహుజనుల జీవితాలు, సాహిత్యం చాలాకాలంగా వెలుగులోకి రాకుండా పోయింది. ఇది అభ్యుదయానంతర

సాహిత్యమార్గంతో కొత్తదారిని వెతుక్కుంది.

"నెరుసు" అనగా "పలుగురాళ్ళ పొడి" అని నిఘంటువు అర్థం. రైతులు మొలక చల్లడానికి ముందు అలుకుడు బోనం చేసి, పలుగురాళ్ళను ఏరుకొచ్చి, శుభ్రంగా కడిగి, పసుపుతో పుదిచ్చి, కుంకుమబొట్లు పెట్టి, కొబ్బరికాయను కొట్టి సేద్యాన్ని పండుగగా మొదలుపెడతారు. ఇది అచ్చమైన ప్రాకృతిక స్థానిక ఆధ్యాత్మికత.

డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య రాసిన "నెరుసు" విమర్శవ్యాసాల సంపుటిలో బహుజన దృక్పథం, తెలంగాణ పోరాట అస్తిత్వం, మానవత్వం, అచ్చమైన ప్రాకృతిక స్థానిక ఆధ్యాత్మికత ప్రధానంగా కనిపిస్తాయి. బహుజన సాహిత్యానికి నెరుసు పూసి పదునుపెట్టిన మెరుపు వ్యాసాలు ఇందులో ఉన్నాయి. నెరుసు శీర్షికలో గొప్ప బహుజన తాత్వికత, స్ఫూర్తి ఉన్నాయి. తెల్లటి స్ఫటికంలాంటి పలుగు రాళ్ళు ఆధ్యాత్మిక దేవతలుగానే కాదు, గీత కార్మికులు, వడ్రంగిలాంటి బహుజన వృత్తిపరికరాలను పదును తేల్చేది. గీతకత్తిని పదును పెట్టడానికి గౌడు బొడ్లో నెరుసు బద్ద లేదా చిడతబద్ద ఉంటుంది. దీనిని కుంకుడుచెట్టు కలపతో చేస్తారు. తెల్లటి పలుగురాళ్ళను ముక్కలుగాచేసి, మరొక రాయిపై (నెరుసు బండ) మెత్తగా దంచుతారు.

ఈ రాతిపొడిని నెరుసు అంటారు. దీనిని చిడతబద్దపై వేసి కత్తిని పదును తేలేవిధంగా కిందికి మీదకు నూరుతారు. కత్తి పదునుపై కల్లురుచి ఆధారపడి ఉంటుంది. గీత కార్మికుడు తాటిచెట్టును సగం చేరుకున్నాక అలిపిరి తీసుకొనే క్రమంలో ఈ నెరుసు బద్ధనుపయోగిస్తారు. తరువాత మొగిని చేరుకొని గెలను మెర పెడతాడు.

డా. తండు కృష్ణ కౌండిన్య బహుజన సాహిత్యాన్ని ఇరుసుగా, శాస్త్రీయ అలంకారిక విమర్శాపద్ధతులనే నెరుసును వాడి సునిశితమైన విమర్శామొగిని చేరాడు. కర్మ సిద్ధాంతం కాదు, బతుకు సిద్ధాంతం కావాలని...తలరాతలు కాదు, బతుకు రాతలు మారాలని చెప్పిన మహాత్మా జ్యోతిభా పూలేపై వనపట్ల సుబ్బయ్య రాసిన దీర్ఘకవిత "బహుజన బావుటా"పై దీర్ఘకవితాలక్షణాలైన ఏక వస్తురూపం, సుదీర్ఘత, ప్రవాహగుణం, భాషాసారళ్యం గురించి అవసరానికి తగినట్టుగా కౌండిన్య చక్కగా విశ్లేషించాడు. మునాసు వెంకట్ కవితలో వస్తువు, భాష, తాత్వికత, సిద్ధాంతం, అనుభూతి, దేశీయత, స్పష్టత, సరళత కలగలిపి ఉంటాయి. కవిత్వం ద్వారా ప్రకృతిని

చిత్రించడంలో దిట్ట మునాసు వెంకట్ అని "సరికొత్త కవిత్వానికి చిరునామా మెద" వ్యాసంలో పేర్కొన్నాడు. అచ్చమైన తెలంగాణ నుడికారంతో శిల్ప వైవిధ్యాన్ని కలిగిన సారవంతమైన కవితాసంపుటి యిదని, కవిత్వంలోని ఇమేజరీలను, కవి అవగాహన, నిశిత పరిశీలనా దృక్పథం, అలంకారిక ప్రయోగాన్ని పట్టి చూపాడు. దళితసాహిత్య చైతన్యంతో వచ్చిన బహుజన గొంతుక "బహువచనం" కవితా సంకలనం. సాహిత్యపర అస్తిత్వానికే బిసి అస్తిత్వం పరిమితం కాకుండా రాజకీయ శక్తిగా ఎదగాలనే కవితల స్ఫూర్తిని వ్యాసంలో తెలియజెప్పారు.

కథలాగే విమర్శకూడా వచన ప్రక్రియ. కవిత్వవిమర్శకున్న కాన్వాసు కథ, నవలకుండదు. వీటిని పరామర్శించడంలో విమర్శకుల సాధన ఎక్కువగా కనిపించదు. బి.ఎస్ రాములు, వల్లంపాటి వెంకట సుబ్బయ్యలాంటి వాళ్ళస్థాయి కృషి ఈ పుస్తకంలో కనిపిస్తుంది. ఇందులోనివి కొన్ని పరిశోధక, మరికొన్ని పత్రికావ్యాసాలు. సంప్రదాయ విమర్శకోణంలో వచనాన్ని విశ్లేషణ చేసే కొత్తపద్ధతి డా. తండు కృష్ణకౌండిన్యలో ప్రత్యేకంగా కనిపిస్తుంది. మేరెడ్డి యాదగిరిరెడ్డి మట్టికథకులు. ఈయన మట్టికథలు, కొలిమి, బొడ్రాయి కథల్లో పేదరికం, కరువు, మూఢనమ్మకాలు, ఫ్లోరిన్ సమస్యలతోబాటు, రచయిత అలంకారిక ప్రయోగాన్ని విశ్లేషించాడు.

శీలం భద్రయ్య రాసిన "లొట్టపీసు పూలు" కథల్లోని బహుజన అస్తిత్వాన్ని, కథల్లోని సమున్నత లక్షణాలతోబాటు కథాకథన పద్ధతి, భాష, అలంకారిక ప్రయోగాలు, సామెతలు, జాతీయాలు, నానుడులు, రచయిత విలక్షణ పదప్రయోగాలనూ పట్టి చూపించాడు. దేవులపల్లి కృష్ణమూర్తి రాసిన "బయటి గుడిసెలు" నవలలో మొండిజాతి జీవితాల్లో నమ్మకాలు, ఆచారాలు, వేడుకలు, రచయిత పాత్రోచిత భాష, వ్యవహారిక సంభాషణలు, ఆప్యాయతనిండిన తిట్లు, రచనారీతిని "అట్టడుగు వర్గాల జీవన ప్రతిబింబం" పేరుతో వ్యాసం రాశాడు. "తెలంగాణ ప్రజల జీవితాన్ని, సంస్కృతి సంప్రదాయాలను, తిరుగుబాటు తత్వాన్ని, పోరాట నేపధ్యాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకున్న రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి. విజయం శాశ్వతం కాదని, పోరాటమే శాశ్వతమనే వట్టికోట జీవితం, సాహిత్యం గురించి రాసిన వ్యాసంలో సూత్రీకరించాడు. బహుజన కవితోద్యమంలో నీలగిరిసాహితీ వృక్షమందించిన సాహిత్యఫలం పగడాల నాగేందర్ అని "మొగురం" పై అధివిమర్శవ్యాసంలో రాశాడు.

నిజాం నిరంకుశత్వానికి నిలువెత్తు దర్పణం గుఱ్ఱం బుచ్చిరాములు రాసిన యక్షగానం "వీర తెలంగాణ". ఇందులో నవీన రచనా ప్రయోగాలైన గణపతిస్తుతి మినహాయింపు, ఇష్టదైవప్రార్ధన నిరసన, తెలంగాణ మాండలికం, అంత్యప్రాసల వాడకం, దరువులు, సంభాషణలు, చంధస్సు, పాత్రల ప్రవేశం, పాటలున్నాయని పరిశోధించి చెప్పాడు.

మానవత మనిషికి పతాక. సామాజికత కవికి భూమధ్యరేఖ. ఆత్రేయ పాటల తాత్వికుడు. మాటల మాంత్రికుడు. ఆయన సాహిత్యాన్ని వ్యక్తినిష్టం చేయకుండా, సమాజనిష్టమైన సాహిత్యాన్ని రాశారని తెలిపాడు. కూరెళ్ళ కవిత్వంలోని మానవతా దృక్పథం, సాగర్ల సత్తయ్య కందపద్యాలతో మానవీయ విలువలు, నందిని సిధారెడ్డి కవితా హృదయం, ఏనుగు నరసింహరెడ్డి తెలంగాణ రుబాయీల కవిత్వ విశిష్టత, సవివరంగా విశ్లేషించాడు. పిల్లలకోసం వ్యవహారభాషలో కథలు రాసిన అరుదైన కథకుడు పెండెం జగదీశ్వర్ అని, గమ్మతి గమ్మతి కథల్లో అచ్చులు, మహాప్రాణులు, జ, శ, వల ప్రయోగం, సరళములు, సంయుక్తాక్షర ప్రయోగాన్ని పట్టి చూపించాడు. పెరుమాళ్ళ ఆనంద్ రెక్కవిప్పిన బాల్యం పిల్లల కవితల్లో అనుభూతి, సందేశం, మానవత, ఆలోచనాత్మక కవితలను వివరించాడు.

తెలంగాణ ప్రత్యేకరాష్ట్ర ఆకాంక్ష నిండిన కవులు జూలూరి గౌరీ శంకర్ దీర్ఘకవిత జూలూరి పథం, సుంకిరెడ్డి నారాయణరెడ్డి తెలంగాణ అస్తిత్వ సాహిత్యం, కరీంనగర్ కవుల సంకలనం వల్లుబండ, అల్లం నారాయణ ప్రాణహిత వ్యాసాలు, సుంకర రమేష్ తెలంగాణ కవిత, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి కవితాసంకలనం ఢమరుకం. ఇందులో కొన్ని సొంతరాష్ట్ర కల నెరవేరిన తరువాత వచ్చాయి. మరికొన్ని ముందే వచ్చాయి. తెలంగాణ నేలలో ఆధ్యాత్మికత తాత్వికత ఉంది. కౌండిన్య తంద్రి అచలగురువు. ఆ ప్రభావం పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం ఆధ్యాత్మికత వ్యాసంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇందులో కాలజ్ఞాన మార్మికతను అర్ధం చేసుకోవాల్సిన తీరు, సంఘసంస్కరణ, ఆధ్యాత్మికతను చక్కగా విశ్లేషించారు.

–14 ఏప్రిల్ 2025, నమస్తే తెలంగాణ

సామాజిక సమానత్వం కోసం
సాహిత్య మరమ్మత్తు

తెలంగాణ సాహిత్యం జీవితం నుండి పక్కకుపోని నిఖార్సయిన సాహిత్యమని "దురస్తు" కథా సంకలనం మరోసారి రుజువు చేసింది. ఇది 'సింగిడి తెలంగాణ రచయితల సంఘం' నుండి దశాబ్ద వార్షికసంచికగా వచ్చింది. 'దురస్తు' అనగా "మరమ్మత్తు" అని నిఘంటువు అర్థం. అందరికీ సమానవకాశాలు లభించాలంటే చదువొక్కటే పరిష్కారమని జ్యోతిభా పూలే, అంబేద్కర్ లు బోధించారు. చదువనేది జ్ఞానాన్ని, అవగాహనను, చైతన్యాన్ని కలిగించేది. స్వాతంత్ర్యం తరువాత అడుగుజనాల వరకు అందరికీ చదువు అందుబాటులోకి వచ్చింది. కానీ చదువుకుని స్వతంత్ర్య ఆలోచనలు చేయగలిగేవారెందరనేది ప్రశ్నించుకోవాల్సి ఉంది. పారిశ్రామికీకరణ, సేవారంగాలు అభివృద్ధి చెందాక, ప్రపంచీకరణ ప్రభావంతో కులవృత్తులు అంతరించాయి.

ప్రపంచంలోనే అత్యధిక శ్రామిక శక్తి ఇక్కడ ఉంది. చదువు విజ్ఞానంతో బాటు ఉపాధికి బాటలు వేయాలి. చదువు సామాజిక సురక్షిత జీవనానికి దారి చూపించగలగాలి. కానీ వాస్తవంలో జరుగుతున్నదేమిటి? రేపటి పౌరులను మనం ఏవిధంగా పెంచుతున్నాం. ఏ పనినైనా గౌరవించగలిగేలా, ప్రేమించగలిగేలా మన విద్యావ్యవస్థ ఉందా? వృత్తిని బట్టి కులం ఏర్పాటయిన మన సామాజిక వ్యవస్థలో పనికి గౌరవం ఎలా దొరుకుతుంది. విదేశాలలో పనిని బట్టి కాకుండా, వ్యక్తికి అస్తిత్వం, గుర్తింపు ఉంటుంది. అక్కడ ప్రతి పని కూడా గౌరవప్రదమైనదే. వృత్తి పట్ల గౌరవం పెంచే చదువులు కావాలి. పనిగొప్పదనాన్ని గుర్తించే సమాజం కావాలి. సమాజాన్ని మార్చగలిగే నిర్ణయాలు తీసుకునే చట్టసభ సభ్యులను ఎన్నుకునే విధానంలోనే సమాజ పద్ధతి ఆక్షేపనీయంగా ఉంది.

వోటును అంగడి సరుకుగా మార్చడంలో తలాపాపం తిలాపిడికెడు. పాలనాధికారం సంగతి దేవుడెరుగు. పాలనా ఫలాలు సైతం అడుగు ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. దేశంలో అధిక జనాభా వ్యవసాయాధారిత ఉపాధిపైననే ఆధారపడుతుంది. ప్రత్యామ్నాయ ఉపాధికి చాలినంత అర్హత కలిగిన

యువత కొరతగానే ఉంది. ఎన్ని చట్టాలొచ్చినా భూమి, సంపద కొందరి చేతుల్లోనే బంధీ కావడం వలన దళిత, బహుజనులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. సమాజంలో ఈ అన్యాయాన్ని గమనించిన రచయితలు తమ కథల ద్వారా పట్టిచూపారు. ఇవి కేవలం ఊహాజనిత కథలు కాదు. వర్తమాన సామాజిక అసంతృప్తులు. పాఠకులు ఈ కథలను చదువుతున్నప్పుడు రచయితల సైద్ధాంతిక దృక్పథానికి, సామాజిక బాధ్యతకు ముచ్చటపడాల్సిందే. అచ్చమైన తెలంగాణ గ్రామీణ పలుకుబడులు కథలకు అదనపు ఆకర్షణ అని చెప్పవచ్చు. మన చుట్టూ ఉండే బలహీనుల వెతలు కథల్లోని పాత్రలు కావడంతో సజీవ దృశ్యాలు, అనుభవాలు కళ్ళముందు కదులాడుతాయి. గుండెను బరువెక్కిస్తాయి.

తెలంగాణ కథాసాహిత్యంలో వర్తమాన కాలానికే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. దేశవిభజన కాలాన్ని గుర్తుచేసే రామాచంద్రమౌళి "ఆత్మ, అగ్ని నిన్ను దహిస్తుంది" కథ మినహా, పదిహేను కథలు వర్తమాన సామాజిక సమస్యలే ప్రధానంగా ఉన్నాయి."చదువు, నిరుద్యోగం, కులవృత్తుల పట్ల ఇష్టంలేని యువత , భూ సమస్యలు, తాగుడు వంటి సామాజిక సమస్యలను ప్రతిబింబించే కథలున్నాయి. "జాయి జాదులు" కథలో కొట్టం రామకృష్ణారెడ్డి అన్నట్టు ఈ కథలు "చిన్నగ పేర్సినా, పెద్దగ పేర్సినా బతుకమ్మ బతుకమ్మనే."

యువత చదువుకొని 'స్వతంత్ర్య ఆలోచనలు' చేయాలని చెప్పే కథ జూపాక సుభద్ర రాసిన "మా సెల్లె మల్లక్క". దీనిలో పోశమ్మ, మల్లమ్మనే అక్కాచెల్లెళ్ళ పాత్రలుంటాయి. 'స్వతంత్ర్య ఆలోచన' కలిగిన పోశమ్మ బాగా చదువుకుని ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎదుగుతుంది. ఎవరేం చెప్పినా సులువుగా నమ్మే మల్లమ్మ, మతాన్ని నమ్మి మరియగా, మార్క్సిజాన్ని నమ్మి అజ్ఞాతంగా బతుకును ఎల్లదీసి, చక్రపాణి అనే బ్రాహ్మిణ్ కామ్రేడ్‌ను పెళ్లిచేసుకొని మంజులగా, చివరికి రూపవాదిగా, భావదాసిగా మారి అస్తిత్వాన్ని కోల్పోతుంది.

కమ్యూనిజానికి బదులు భారతీయ సమాజానికి, సమసమాజానికి అంబేద్కరిజమే ప్రత్యామ్నాయమనే సత్యం ఈ కథ ద్వారా బోధపడుతుంది. ఉచిత విద్యాహక్కుతో విద్య అట్టడుగువర్గాలకు చేరింది. దానితో వారిలో చైతన్యం వచ్చింది. స్వీయ చైతన్యాన్ని పొందడమే చదువుకు సార్థకతని తెలియజేసే కథ, డా. ప్రభాకర్

జైని రాసిన "బోన్గిరి టూ లష్కర్". శ్రామికలోకానికి ఈ కథ స్ఫూర్తిమంతం. కథలో చదువుకున్న నిరుద్యోగ యువతి సునీత. నగరంలో ఓ షాపులో సేల్స్ గర్ల్‌గా పనిజేస్తుంది. వ్యాపారసముదాయ యాజమానులు సేల్స్ గర్ల్స్ ను కూర్చోకుండా ఆంక్షలు పెట్టి మానసిక, శారీరక హింసకు గురిచేస్తున్నారు. సునీత ఈ అన్యాయానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడి అంతిమంగా విజయం సాధిస్తుంది.

నేడు అన్నివర్గాలు చదువుకు అధిక ప్రాధాన్యతిస్తున్నాయి. కానీ వారికి చదివిన చదువుకు తగిన ఉపాధి లభించడం లేదు. ఇంకోవైపు ధనికస్వామ్యం, అగ్రవర్ణాలు విద్య, ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్నారు. ప్రపంచస్థాయి అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. చదువుకున్న పేదలు విద్య, ఉపాధి కొరకు ప్రభుత్వసాయానికై ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ ఉపాధి పరిమితం. ప్రయివేటు ఉపాధికి అవసరమయ్యే చదువు, నైపుణ్యం ఈ వర్గాలలో లేదు. దానితో చదువుకున్న యువత అయోమయంలో ఉన్నారు. గ్రామీణ పేదరికానికి ఇదీ ఒక కారణమే.

నిజానికి ప్రభుత్వ ఉపాధిరంగానికంటే మెరుగైన అవకాశాలు ప్రయివేటు రంగంలోనే ఉన్నాయి. వాటివైపు యువతను మళ్ళించే దిశగా వృత్తి విద్య అమలు, కార్మిక చట్టాలు, రాజ్యాంగపరంగా ప్రయివేటులో రిజర్వేషన్లవసరమవుతాయి. ఓటు రాజకీయాలను చేసే నాయకుల నిర్లక్ష్యం వలన చదువుకున్న యువత నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు. తప్పని పరిస్థితులలో వారు బలవంతంగా ఆదరణలేని కులవృత్తులకు మళ్ళించబడుతున్నారు. ఈ నిజాలన్నీ డా. పసునూరి రవీందర్ రాసిన "జెజ్జెనక" కథలో కనిపిస్తాయి. గ్రామంలో డప్పుకొట్టి, చెప్పులు కుట్టిన ఎల్లయ్య కొడుకు కిరణ్ పి.హెచ్.డి. చదివినా, ఉద్యోగం దొరకక చివరికి జీవిక కోసం తన తండ్రి తరువాత డప్పు నందుకుంటాడు. బి.ఈ.డి చదివిన అతని చెల్లెలు కూడా ఉపాధిహామీ కూలీగానే మిగిలిపోతుంది. ఇది నేటి గ్రామీణ నిరుద్యోగ యువత దుస్థితి. సాగర్ల సత్తయ్య రాసిన "సారె" కథలో కులవృత్తినుండి బయటపడాలనే లక్ష్మయ్య కొడుకు శ్రీకాంత్ పాత్ర అభ్యుదయంతో కనిపిస్తుంది.

చివరికి కథలో లక్ష్మయ్య పాత్ర చావుతో రచయిత ఏం చెప్పదలుచుకున్నాడు? కథలో ఆగిపోయిన శ్వాస లక్ష్మయ్యది కాదు. కులవృత్తుల చావేనని అర్థమవుతుంది. కథ అంటే సమస్య, దానికి పరిష్కారం చూపడం మాత్రమే కాదు. నిజజీవితంలో

పాత్రల చుట్టూ సంస్కృతి, సంప్రదాయాలు ఉంటాయి. గ్రామీణ జీవితాన్ని ఆవిష్కరించేటపుడు సామెతలు, గ్రామీణ పలుకుబడులు రచయితకు అవసరమవుతాయి. అవన్నీ ఈ కథలో ఉంటాయి.

సాహిత్య సృష్టి వ్యక్తిగతమైనా, ప్రయోజనం సామాజికం. పెద్దింటి అశోక్ కుమార్ రాసిన "ఉల్లిపూసలు", స్కైబాబా రాసిన "ఖుష్ మిజాజ్"కథలు శిల్పనైపుణ్యంతో ప్రత్యేకంగా ఉన్నాయి. వందేళ్ళక్రితం సమాజానికి అభ్యంతరంలేని ఆచారం సతీసహగమనం. అలాంటిదే పెద్దింటి అశోక్ కుమార్ "ఉల్లిపూసలు" కథ. విధివశాత్తు భర్త చనిపోతే, భార్య బొట్టు, గాజులు తీయడమనేది ఈ కాలపు దురాచారం. కథలో ముందుతరం సమాజ దుర్నీతికి బలయిన అబలకు పోశవ్వ ప్రతీకయితే, కాలంతో బాటు మనమూ మారితే, సమాజం మారుతుందని చెప్పే ఆధునిక ధీరవనితకు ప్రతీక పూలమ్మ. ఒంటరి మహిళలకు సమాజం ఇవ్వాల్సిన ధైర్యాన్ని చెప్పే గొప్ప కథ ఇది. జీవితం అబద్దం కంటే గొప్పగా లేనపుడు, ఏ మనిషైనా అబద్దాన్నే ఇష్టపడతాడు. అబద్దంలోని సౌందర్యాన్ని జీవితాంతం ప్రేమించిన కథ స్కైబాబా "ఖుష్ మిజాజ్". ఆసక్తికరమైన కథాకథనంతో పాఠకుడిని ఆలోచింపజేస్తూ, ఆసాంతం ఏకబిగిన కథను చదివిస్తాడు రచయిత. "హనీఫ్" తన జీవితంలో ఉండే అందమైన అబద్దాన్ని, మిత్రుడు యూసుఫ్ కు చివరిదాక తెలియకుండా జాగ్రత్తపడుతాడు. సమాజం అవసరం కొద్దీ పట్టించుకునే అబద్దం, నిజాలనే సామాజిక విలువల నిరసన ఈ కథలో చక్కగా కుదిరింది.

ఉద్యమాలకు, కళాకారుడికి మంచి అనుబంధం ఉంటుంది. భుక్తికి కళను నమ్ముకున్న వృత్తికళాకారులు తమ అవసరానికెప్పుడూ కళను ఉపయోగించుకుని సమాజాన్ని అస్థిరపరచలేదు. అదే విధంగా వారి కళ కుటుంబ పోషణకు మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతతో ఉండేదని రావుల కిరణ్మయి రాసిన "అలుకు పూత" కథ ద్వారా తెలుస్తుంది. వాసుదేవ్ అశాంతి, ఆందోళన నిండిన నేటి నిరుద్యోగ యువతకు ప్రతినిధి. ఎంత చదివినా ఉద్యోగం రాదు. ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే పెట్టుబడి ఉండదు. ఆ కుటుంబానికి సరైన ఇల్లు కూడా ఉండదు. తాత, తండ్రిలిరువురూ "సంప్రదాయ రుంజ కళాకార వృత్తి"ని నమ్ముకొని ఉంటారు. నిజాంకాలంలో తాత తనకిచ్చిన ఇనాం భూమిని, దవాఖాన నిర్మాణానికి

విరాళంగా ఇస్తాడు. చివరికి తాత చేసిన మంచే వారిని వెతుక్కుంటూ వచ్చి, సాయపడాలనుకోవడం కథలో మంచి ముగింపు.

ప్రజలందరికీ చదువు దక్కినా, న్యాయం అందుబాటులోకి రాలేదు. రైతాంగ సాయుధ పోరాటకాలానికి, నేటికీ రైతుల అవస్థలలో మార్పురాని దయనీయస్థితిని చర్చకు పెట్టిన కథ పి. చంద్ రాసిన "స్థూపం". భూస్వామ్యవర్గానికి వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమాల సాయంతో భూస్వాముల భూములు పేదలకు పంపిణీ చేయడం జరిగింది. కానీ అది అధికారికంగా చట్టప్రకారంగా జరగలేదు. ఇటీవల అభివృద్ధి పేరుతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇన్నాళ్ళు విప్లవకారుల భయానికి గ్రామాలకు రాని పెత్తందార్లు పల్లెలకు చేరుకున్నారు. చట్టంలోని లొసుగులను, వ్యవస్థలను అడ్డంపెట్టుకొని గ్రామాల్లో రైతులను వేధించడం, భూములను తిరిగి లాక్కోవడం మొదలుపెట్టారు. ఈ సమస్యలను ఎత్తి చూపే కథ బద్ది గణేష్ రాసిన "భూమి పట్టా" కథలో కన్పిస్తుంది. ఎన్ని కష్టాలెదురైనా భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్న రత్తయ్యకు ప్రభుత్వ నిర్ణయం వలన భూ యాజమాన్య హక్కు సమస్య ఎదురవుతుంది. కాళ్ళరిగేలా తిరిగినా, న్యాయం లభించదు.

అధికారుల అలసత్వం, వ్యవస్థీకృత నిర్లక్ష్యం కారణంగా చివరికి రత్తయ్య ప్రాణాన్ని వదిలేస్తాడు. చందు తులసి రాసిన మరో భూ సమస్య కథ "పెద్ద బతుకమ్మ". పూలమ్మ, గోపాల్‌లు అన్నాచెల్లెలు. అనురాగానికి మారుపేరుగా ఉంటారు. పాలనాపర సౌలభ్యం కొరకు కొత్త జిల్లాలు ఏర్పాటు కావడం, అభివృద్ధికి దగ్గరగా ఉండడంతో వాళ్ళ భూముల ధరలకు రెక్కలొస్తాయి. వారి అనుబంధానికి భూపంపకం, డబ్బు పరీక్ష బెడితే, చివరికి అనుబంధమే గెలుస్తుంది. ఈ గెలుపుకు "బతుకమ్మ పండుగ" బాధ్యత తీసుకుంటుంది. రచయిత సాహిత్యం కంటే జీవితానికే ఎక్కువ విలువ ఇచ్చాడు. కథలో భావోద్వేగాలు, జీవనవిధానం మెండుగా కనిపిస్తాయి. చట్టం చేతిలో ధర్మం ఓడిపోవడమే నేపథ్యంగా రాసిన కథ గాజోజు నాగభూషణం "ఋణం" కథ. సాధారణ రైతు హన్మంతుకు వారసత్వంగా వచ్చిన భూమి, రియల్ దందాతో మంచి ధర పలుకుతుంది. దానిని అమ్మి కూతురుకు కట్నం, తల్లి, భార్య, కొడుకు కోరిన చిన్న చిన్న కోరికలు తీరుద్దామనుకుంటాడు. ఆ ప్రాంత ఎమ్మెల్యే రాఘవయ్య ఆ భూమిని ఆక్రమించడంతో తట్టుకోలేక చివరికి ప్రాణాలు వదులుతాడు.

పెళ్ళిళ్ళు వ్యక్తిగత ఇష్టాలు. జీవితంలో పెళ్ళిళ్ళు తప్పనిసరి అవసరమేమీ కాదనే ధోరణి నేటి యువతలో బలంగా ఉంది. విశీ "సుభాషిణి పెళ్లి" కథలో చక్కని నాటకీయత ఉంది. సుభాషిణి తనకు కాబోయే జీవితభాగస్వామి చేత తాగుడును మాన్పించడానికి ప్రేమను ఆయుధంగా చేసుకుంటుంది. నేటి యువతులకిది ఆదర్శం. కె.వి. మన్ ప్రీతం రాసిన "సూర్యుడి నీడలు" ఆధునిక నగర జీవన సవాళ్ళకు దర్పణం. ప్యాకేజీలలో జీవితాలు, కేజీలలో జీతాలందుకునే సాఫ్ట్వేర్ ఉద్యోగిని మేఘన కథ ఇది. ఉద్యోగాల్లో అంతరాలు, స్వేచ్ఛాప్రియత్వం- ఆధారపడేతత్వం, ఆత్మగౌరవం- చిన్నచూపు, పల్లె- పట్నాలు, ప్రేమ- అవమానమనేవి సూర్యుడి వెలుగుకు, నీడల్లా ఉంటాయని వివరిస్తుంది.

కరగని దుఃఖమేఘం బరువు వెనుక రెక్కలు విప్పుకున్న స్వేచ్ఛను తెలిపే స్వర్ణకిలారి కథ "వెలుగురేక!". ఇది ఉత్తమ పురుషలో సాగుతుంది. ప్రతీ ఒక్కరి జీవితంలో చీకటి తరువాత కాలం వెలుగు రేకల్ని పూయిస్తుందని కథ చదివితే అర్థమవుతుంది. చదువుకునే రోజుల్లో తోటి విద్యార్థినులతో కలిసి సరదాకు 'విహారి'ని ఆటపట్టిద్దామనుకొన్న కీర్తి, తనకు తెలియకుండానే అతనిపట్ల జీవితకాలపు ప్రేమను కలిగి ఉంటుంది. జీవితంలో స్థిరపడినాక విహారిపట్ల నున్న ప్రేమ, ఆటిజంతో పుట్టిన అతని పిల్లవాడి పట్ల జాలిగా మారుతుంది. పాత గాయానికి మందు పూసుకునే బదులు కొత్తగాయం చేసుకున్నట్టు కీర్తి మనస్థితి ఈ కథలో కన్పిస్తుంది.

"దురస్తు" కథా సంకలనంలో వస్తువైవిధ్యం, తెలంగాణ భాష వినియోగం, రచయితల వర్తమాన సామాజిక బాధ్యతను పాఠకులు చదివి మెచ్చుకోవాల్సిందే. సామాజిక సమానత్వం కోసం సాహిత్య మరమ్మత్తు చేసిన "దురస్తు" సంపాదకుల నిజాయితీ అంతే గొప్పగా ప్రశంసించాల్సిన విషయం. ఏడాదికాలంగా వచ్చిన కథల్లో ఎంపికజేసి ఒక సంకలనంగా తీసుకురావడం అంత సులభమైన పనికాదు. దీని వెనుక ఎంతో వ్యయప్రయాస ఉంది. ఇష్టం ఉంది. తెలంగాణ సాహిత్యాన్ని రికార్డు చేయాలనే తపన, నిస్వార్థ కోరిక ఉంది. ఇలాంటి కథా సంకలనాలను క్రమం తప్పకుండా పదేళ్లుగా తీసుకొస్తున్న సాహితీ పరిశోధకులు డా. సంగిశెట్టి శ్రీనివాస్, డా. వెల్దండి శ్రీధర్‌ల శ్రమ అభినందనీయం.

-3 జూన్ 2024, మన తెలంగాణ

సంచార జాతుల కడగండ్లు

'బయటి గుడిసెలు'

"చూడు చూడు నీడలు ! పేదవాళ్ళ జాడలు! నరనరాల వేదనలో తరతరాల రోదనలో బక్క చిక్కి, బిక్కి చచ్చిపడిన బతుకు గోడలు ! పాడుపడ్డ వాడలు !"– అన్న శ్రీశ్రీ కవితలోని ఆత్మను ఆవిష్కరించిన సంచార జాతుల ఒడవని కడగండ్లు "బయటి గుడిసెలు" నవల. రచయిత దేవులపల్లి కృష్ణమూర్తి అభ్యుదయవాది. వారికి విరసం, జయమిత్ర వంటి సాహిత్యసంస్థలు, సృజన వంటి సాహిత్య పత్రికల ప్రేరణ, అరసం కవుల సాహచర్యం, తెలంగాణ జీవితాల మీద విస్తృత అవగాహన, సాహిత్య మమకారం, సంచార బతుకులపై ఉన్న సహానుభూతి వంటివి ఈ నవల రాయడానికి ప్రధాన ప్రేరణని చెప్పుకున్నారు.

తెలంగాణ కథా, నవలా సాహిత్యంలో కల్పిత జీవితాలు ఆదినుండి తక్కువే. అలాగే ఈ నవలలో కూడా కల్పితం ఎక్కడా కన్పించదు. ఇతివృత్తం వాస్తవికత ప్రధానంగా ఉంటుంది. సంచార జాతులకు చెందిన మొండోల్ల జీవితాలను యథార్థంగా ఉన్నదున్నట్లు రాశానని రచయిత స్వయంగా నాతో చెప్పారు. రచయిత నల్గొండ జిల్లా నకిరేకల్ వాస్తవ్యులు. ఇంటికి దగ్గరగా మొండోల్ల గుడిసెలు ఉండేవని, వారితో నిత్యం మమేకమై, వారి సమస్యలను సావధానంగా వినడం వలన ఈ నవల రాయడానికి ప్రేరణ లభించిందని చెబుతారు. ఆ రకంగా ఇది 'సంచార జాతి మొండోల్ల జ్ఞాపకాలను నవలారూపంలో భద్రపరిచిన చారిత్రక నవల' అని చెప్పొచ్చు.

నవలా నేపథ్యాన్ని పరిశీలించినపుడు "ఇల్లు ఇల్లనియేవు.. ఇల్లు నాదనియేవు, నీ ఇల్లు ఎక్కడే చిలుకా ......" అని ఈ జగమొండి సమాజానికి తత్వాన్ని బోధించిన సామాజిక గురువులైన మొండి గొంతుకలను ఊరికి బయటనే పెట్టింది సమాజం. "పార్వతీదేవి శాపం వలన స్థిరనివాసం లేకుండా ఊరురా తిరుగుతూ హీనంగా బతుకమని శపించిందని" పాత్రద్వారా చెప్పారు. అది నిజమో కాదో తెలియదు

కానీ ఈనాటికి మొండోల్ల బతుకులు మాత్రం సామాజిక భద్రతకు దూరంగానే గడుస్తున్నాయి. "పదుగురు కూడితే ఒక ఊరవుతుందని" సినారె అన్నట్టు, "నల్గురున్నకాడ నారాయణుడుంటడు" అని నవలలో పాత్రలచే రచయిత అన్పించాడు. అటువంటి భద్రమైన ఊరి స్థిరనివాసానికి యోగ్యతలేని వాళ్ళ ఈతిబాధలను ఈ నవలలో మన కళ్ళకు కడుతాడు. ఊరనే సామాజిక వ్యవస్థలో అన్ని కులాలు ఊరిహద్దులోనే ఉన్నాయి. కానీ సంచార గుడిసెలు మాత్రం ఊరిహద్దుకు వెలుపల, అభివృద్ధికి దూరంగా "బయటిగుడిసెలు"గా ఉన్నాయి.

"బయటి గుడిసెలు" అనే పేరు విన్నప్పుడు మరి లోపలి గుడిసెలు ఉంటాయా? అనే సందేహం సహజంగానే వస్తుంది. నిచ్చెనమెట్ల సామాజిక వ్యవస్థలో సామాజిక కట్టుబాట్ల పేరుతో కొన్ని కులాలు వెలికి గురయ్యాయి. అవి కూడా గుడిసెలే. తరతరాలుగా వాళ్ళు అనుభవించిన వివక్ష గురించి సాహిత్య పరంగా రాజకీయపరంగా తాజా చర్చ ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉంది. వారు సామాజిక అంతస్తుల్లో అట్టడుగున ఉన్నా, సామాజిక హోదాకు నోచుకోకున్నా, వారికి కనీసం ఊర్లో సాంఘీక జీవనానికి అర్హత లభించింది. కానీ "బయటి గుడిసెలు" లో బతికిన సంచార బతుకులకు ఆ అర్హత కూడా లేకపోవడం గమనార్హం. అదే విషయాన్ని దేవులపల్లి కృష్ణమూర్తిగారు "బయటి గుడిసెలు"లో అచ్చమైన తెలంగాణ భాషా సౌందర్యంతో అక్షరీకరించారు. సంచార జాతి ఈతి బాధల్ని రాసి, తనకున్న గుండె భారాన్ని దింపుకునే ప్రయత్నం చేశారు. పాఠకులకు కంటతడి పెట్టించారు.

ఈ నవలలో మొండోల్ల గుడిసెల జీవితాల్లో, పాత్రల్లో రచయిత పరకాయ ప్రవేశం చేశారు. వారి జీవితాల్లో ఉన్న జీవన విధానాన్ని, సంస్కృతిని, సామాజిక జీవన లోటును, సాంఘీక ఏకాంతాన్ని, అనాగరికత, అమాయకత్వాన్ని ఇలా పలు కోణాల్లో పాఠకులకు పట్టి చూపారు. వారి జీవితాల్లో అనేక పార్శ్వాలను ప్రత్యక్ష్యంగా కండ్లకు చూపెట్టాడు. వారిని ఊరు దూరం నెట్టినా, వారు ఊరికి దూరం జరుగలేదు. ఊరికి దగ్గర కావాలనే వారి నిత్యప్రయత్నం, నాగరిక సమాజం అర్థం చేసుకోకుండా వారిని దూరం నెట్టడం వంటి నేపథ్యంలోని కథ చదివినపుడు మన హృదయాన్ని మెలిపెడుతుంది.

ఈ నవలలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది భాష. నకిరేకల్ కేంద్రంగా

చుట్టుపక్కల గ్రామాల్లో కథ జరుగుతుంది. ఈ ప్రాంతపు భాషా మాధుర్యం, సౌందర్యం నవలంతా పరుచుకొని ఉంది. పాత్రలు మొత్తం అచ్చమైన తెలంగాణ భాషలో మాట్లాడడం వలన పాత్రల నేటివిటి బాగా పండింది. తెలంగాణ భాషను పండితులు స్పృహతో విస్మరించినా, కొన్నితరాలుగా పామరజనం కాపాడుతూ వస్తున్నారు. వాళ్ళ భాషలో అన్యభాష సంకరం, ప్రభావం తక్కువగా ఉంటుంది. ముఖ్యంగా నల్గొండ జిల్లాలో నకిరేకల్ ప్రాంతంలో కమ్యునిస్టుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సాయుధపోరాట ప్రభావం కూడా ఈ ప్రాంతపు భాషపై, అస్తిత్వంపై ఎక్కువగా ఉంటుంది. సామాన్య ప్రజల నాలుకలపై పోతన కాలంనాటి తెలంగాణ భాష ఈనాటికి ఆడుతూ ఉంటుంది. ఈ భాషను రచయిత తమ కలంలో నింపుకున్నారు.

2013లో వచ్చిన ఈ పుస్తకంలో రచయిత పాత్రోచిత భాషనువాడి విజయవంతమయ్యారని చెప్పవచ్చు. మొండోల్లు సంచారజాతి. వారి భాషలో ఇతర ప్రాంతాల వ్యవహారాలూ, పలుకుబడులు, సామెతలు, జానపద గేయాలు, సాంప్రదాయాలు వంటివి ఆధానప్రధానాలుగా చక్కగా లభ్యమవుతాయి. వారు మాట్లాడుకునే అచ్చమైన తెలంగాణ భాష, వారి జానపద గేయాలను రచయిత చక్కగా ఒడిసిపట్టాడు. వారి ద్వారా ఇతర ప్రాంతాల జానపదగేయాలు ఈ ప్రాంతానికి పరిచయమయ్యాయి. ఉదాహరణకు కళింగాంధ్రలో బాగా ప్రసిద్ది పొందిన జానపద గేయం "మా బావగారు వచ్చేటి వేళ....బంతి పువ్వుల్లు పూసేటి వేళా....." వంటివి నకిరేకల్ ప్రాంతంలో వీళ్ళు పాడి అలరించారని నవల చదివితే అర్ధమవుతుంది.

"కథ, నవలా రచనకు మొదలు, ముగింపు ఎలా ఉండాలో దేవులపల్లి కృష్ణమూర్తిగారికి తెలుసు" అన్న గుడిపాటి మాట అక్షరసత్యం. దేవులపల్లి రచనా శైలి ఆసక్తికరంగా ముచ్చటబెట్టినట్టు ఉంటుంది. ప్రారంభం ఇంటిగుమ్మంలా హుందాగా, ఆకర్షణీయంగా ఉండి పాఠకులను కథాలోగిలికి ఆహ్వానిస్తూ ఉంటుంది. ఇల్లంతా స్వేచ్ఛగా తిరిగి వెనుకగుమ్మం గుండా సాఫీగా వెళ్లినట్టు కథలో వారి ముగింపు హాయిగా ఉంటుంది. అదే శైలిలో ఈ నవలా రచన సాగిందని చెప్పవచ్చు.

ఈ నవల ఇతివృత్తానికి వస్తే నవలా ప్రారంభంలో శ్రీశైలం అడవుల నుండి బయల్దేరిన బైరి ఎల్లడు భార్య ముత్తమ్మతో ప్రయాణం మొదలుబెట్టి నల్లగొండ నుండి నకిరేకల్లుకు చేరుతడు. దారిలో గౌండ్ల కనకవ్వను రెండో పెళ్లి చేసుకుంటడు.

మధ్యలోనే ముత్తవ్వ చనిపోతుంది. బలమైన వానకు వాగుపొంగి దానిలో పడి వృద్ధుడైన ఎల్లయ్య జీవితం తెల్లారిపోతుంది. దాంతో రెండో భార్య కనకవ్వ అనాధవుతుంది. ఒక్క కొడుకుతో చిన్న ఉద్యోగంలో స్థిరపడుతుంది. మొదటి భార్యకు పుట్టిన ఎల్లని బిడ్డ దుర్గి పుల్లిగానితో మరియు కొడుకు సాంబశివుడు సుగుణతో కల్సి పట్నం లేచిపోతారు. విచిత్రంగా అందరూ వైవాహికంగా అసంతృప్తి చెంది, రెండో సంబంధాలను ఆశించినవారే. దాంతో చివరికి కథ హైదరాబాదుకు చేరుతుంది. దుర్గిని పుల్లిగాడు మెహందీలకు అమ్మేస్తాడు. సాంబశివుడి యొక్క కృషి, చాకచక్యంతో రాజకీయంగా పేరు ప్రఖ్యాతులు వచ్చాక సుగుణ ఆలోచన మారడం, యాక్సిడెంట్ లో సాంబశివుడు చనిపోవడంతో కథ ముగుస్తుంది. ఈ విధంగా కథ అడవి నుండి ప్రారంభమయి పట్నం చేరడంతో కథ ముగుస్తుంది. బయటి గుడిసెల నుండి నాగరిక ప్రపంచంలోకి రావాలనుకున్న వారి బతుకులు నాగరికుల మోసానికి తెల్లారినై. ఇది చదివినపుడు పొట్లపల్లి రామారావు ఊరు-అడవి కథ గుర్తుకు రాక మానదు. నాగరిక సమాజం మరిసిన సంచార జీవితాలలో విషాదాన్ని ఒడిసిపట్టి జాడతెలిపిన దేవులపల్లి కృష్ణమూర్తి రచన “బయటి గుడిసెలు”.

“బయటి గుడిసెలు” ఇతివృత్తం విలక్షణతను కలిగి ఉంటుంది. నవలలోని పాత్రలు సజీవంగా కళ్ళముందు కదలాడుతాయి. పాఠకులు పాత్రలతో సంలీనం చెందుతారు. కథనం యుక్తితో నడుస్తుంది. కథలో తెలంగాణ పలుకుబడులు, జాతీయాలు పుష్కలంగా ఉన్నాయి. వీటితోనే పాత్రల సజీవ చిత్రణ, నిండుతనం, వాస్తవికత, సహజత్వం (నేటివిటి) సాధ్యమయ్యింది. ఉదాహరణకు “నా కడుపు కాలి తాగుతున్న గని, సంబరానికి తాగుతున్నానురా” (పుట సంఖ్య 27), “పొలాలు పొట్టకొచ్చినై”, “మొండోళ్ళ పోరగాల్లకే పంది పిల్లల పట్టుకునే వొడుపుంటది” (పుట సంఖ్య 74) వంటి పలుకుబడులు చాలా ఉన్నాయి. “వల్లె పిల్లను బెట్టుకొని వూరంతా దెవులాడినట్లయింది”, “న్యాయం చెప్పు మారాజా అంటే ఆవుదూడ మాదే అన్నట్టుంది”, శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు”, లంకంత కొంప, “ వాళ్ళ మీద మన్ను బడ, బంగారమసుంటి కొడుకుని పొట్టన బెట్టుకుంద్రు” ఎప్పుడూ నా రాళ్ళే కొట్టుకుంటరు”, సుద్రుమంటే నాకో బూర అన్నట్టుంది, దొంగలు దొంగలు కల్సి ఊరు పంచుకున్నట్టు, “నల్గురున్నకాడ నారాయణుడుంటడు,” తాసుపామోలిగ

బస్సుమనడం, “గుడ్డిదైనా దానాకేం తక్కువుండదు” వంటి సామెతల ద్వారా రచయిత వారి యొక్క లోకానుభవాన్ని రంగరించి అందించారు.

ఈ నవలలో సంచారకులాల్లో ఉన్న బాల్యవివాహాలు, దొంగతనాలు, నిరక్షరాస్యత, వ్యభిచారం, తాగుడు, ఆ మత్తులో బూతులు తిట్టుకోవడం, కొట్టుకోవడం, ఆత్మహత్య , హత్యలు, పోలీసుస్టేషన్లు, పెద్దమనుషులు. వారికి జరిగిన న్యాయం, అన్యాయం, దొమ్మరి ఎల్లడు విధిలేని పరిస్థితులలో దయ్యాలు వదిలించే మంత్రాలు చదవడం, భూత వైద్యం, తంత్ర విద్య ఇలాంటి సాంఘిక దురాచారాలు ఎన్నో ఎన్నో ఉన్నాయి. ఈ నవల చదువుతున్నప్పుడు అడుగడుగునా కన్పించే 'అక్రమ సంబంధాలు, తాగుడు, సాంఘీక దురాచారాలు' వారి వెనుకబాటుకు చిహ్నంగా కన్పిస్తాయి.

అంతేగాక రచయిత ఈవర్గంలో ఉన్న అభ్యుదయ కోణాల్నిసైతం పాత్రలద్వారా స్పృశించారు. బైరి ఎల్లయ్య-కనకవ్వ కులాంతర వివాహాలు, రెండో పెళ్లిల్లు , ఇద్దరు భార్యలు వంటి సాంప్రదాయాలు కన్పిస్తాయి. దీనిలో విచ్చలవిడితనంగా కన్పించినా అందులో సామాజిక కట్టుబాట్లపై వారి నిరసన కనబడుతుంది. అమాయక బాలికలు సినిమాల్లోకి పోవాలనే ఆశలను చదువుతున్నప్పుడు వారు వృద్ధిలోకి రావాలనే వారి కలలు కన్పిస్తాయి. మొత్తంగా వారి జీవితాలను ఆసాంతం ఒడుపుగా మనకు పట్టిచ్చిన జీవనచిత్రాలు ఈ నవలలో ఉన్నాయి. సహజ మానవ ప్రవృత్తి కోపం. ఈ కోపంలో వచ్చే వారి తిట్లు కూడా చాలా సహజంగా రాశారు. రచయిత ఈ విషయంలో పాఠకునికి ఎటువంటి నాగరిక తెరను అడ్డుబెట్టలేదు.

దాంతో మనకు పాత్రల సహజత్వం బోధపడుతుంది. ఉదాహరణకు “ఇంట్లె పీనుగెల్ల, నోరు పడిపోను, బాంచోత్, మొదనాష్టపోడా, మందలించడం, ఏ పాటి పత్తిత్తువు, సేతులు బడ, చేతికి జెట్టపుట్ట, శరం గల్ల పుటక, కన్నుబడ్డది” వంటివి తెలంగాణ సమాజానికి సుపరిచిత తిట్లదండకమే.

సమాజంలో ఆధిపత్య శక్తులు వారిపై చేబట్టిన దమనకాండ, వారి కోణంలో సమాజంపై అభిప్రాయం రచయిత చెప్పడం ద్వారా సమాజం యొక్క బాధ్యత అర్థం మనకు సుస్పష్టమవుతుంది. సంచార జీవనంలో యాచక వృత్తి ప్రధానమైనది. దానికి అనుగుణంగా వారు పాటలు పాడుతూ యాచక వృత్తిని కొనసాగించారు. ఈ పాటల్లో సరసమైన పాటలున్నాయి. “మందులోడా ఓరి మాయ లోడా ……,

"అంత ఇంత కోడి కాదు...గంపెడంత నల్లకోడి ... అనే పాటలు సుప్రసిద్ధం. "ఎన్నాళ్ళు బతికినా కళ్ళ సంసారమిది....కనిపెట్టి తిరగవే చిలకా..." ఇలాంటి జీవిత తత్వాలున్నాయి. "నాది నాల్గుపేట్ల గొలుసూ, నీ పక్కల పడ్డాదేమో చూడరో....." వంటి సరసగానాలున్నాయి.

నవలా రచయితగా దేవులపల్లి అందెవేసిన చేయి. సంచారజాతుల పండుగలు,పబ్బాలు, ఆహారఅలవాట్లు ఇలా అన్నీ సృశించారు. చెర్వుగట్టు, వల్లాల, నెల్లిబండ లింగమంతుల జాతర్ల గురించి, గంగమ్మ పండగ గురించి వారి ఇతర శుభకార్యాల సందర్భంగా వారు అనుసరించే పద్ధతుల గురించి ఆసక్తిగా ప్రస్తావించారు. ఈ విషయాల గురించి చదువుతున్నప్పుడు సంచార జీవితాలు కూడా వెలుపల ఉండి, గ్రామీణ జీవితాల సంప్రదాయాలను అనుసరిస్తూ వారికి సమాంతరంగా జీవించారని అర్ధమవుతుంది. ఈ నవలలో మనల్ని ఆకర్షించే తెలంగాణ గ్రామీణ భాషా పదాలు కోకొల్లలు. "పిల్లలు కాటు గలుస్తరు, వాటమైన గున్న, శరానికి రావడం, శిగాలు పోవడం, పంగకు నేనే పెద్దోన్ని, పబ్బతి పట్టడం, మరిగిండు, సుద్దికి రావడం, గోస తీసుడు, గాచారం, తశ్ప, సుట్టాల మార్గం, రెండు వారాల సంది, దెంకపోవడం, సందియ్యటం, శరనార్ది, దెవులాట, దాపు, జాగారం, పడావుబడడం, ఒడుపు, పాడిబర్లు, కాళ్ళతీపులు, స్టేషన్ల తోమడం, కడుపొచ్చింది, ఆగం జేసిండు, కడుపు మసులుడు వంటి పదాలుంటాయి. అక్కడక్కడా పాత్రోచిత, ప్రాంతీయ భాష వాడకంలో భాగంగా మోకా, జిమ్మేదారు, నజరానడం, కదర్, ఆమ్దాని, వతన్, అబ్కారి రఖం, ఖాళీ జాగ, వంటి ఉర్దూ పదాలను కూడా ఉపయోగించారు.

పాతరోగాలకు గాడిదపాలు, చెట్లక్రియలు ఔషధంగా అమ్మడం, పందుల పెంపకం, దువ్వెన్లు, ఈర్పెన్లు తయారుచేసి అమ్మడం, ఈతసాపలు అల్లడం వంటి సాంప్రదాయ వృత్తినొదిలి క్రమంగా దొంగతనాలకు అలవాటుపడడం తరువాత పట్టణాలకు వలసపోవడమనేవి వారి జీవన విధానంలో వచ్చిన క్రమానుగత మార్పులను సూచిస్తుంది.

కింది కులాలనగానే షెడ్యుల్డ్ కులాలు, బిసి కులాలు మాత్రమే అనుకునే మనకు తక్కువ సంఖ్యలో ఉన్న ఈ సంచార జీవితాలగురించి కథలు, నవల రూపంలో

రచయిత చెప్పక పోయి ఉంటే, ఒక సమాజం యొక్క ఈతిబాధలు, సంస్కృతి, జీవనవిధానం మరుగునపడేది. సంచార జాతుల సాంప్రదాయాలు, జీవన అలవాట్లు, భాష, గోస, ఉపాధిలేక అనుసరించిన సంఘ వ్యతిరేక పనులు, నాగరిక సమాజంతో వారు పడ్డ బాధలు మనకు తెలిసే అవకాశం లేదు.

ఈనాటికి మొండోల్ల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదన్నది రచయిత నిశ్చితాభిప్రాయం. అది రాజకీయపరమైనది కావొచ్చు. సాంఘికపరమైనది కూడా కావొచ్చు. అయినప్పటికీ రచయితగా వారు తమ కర్తవ్యాన్ని నిండుగా, మెండుగా నెరవేర్చారు. బయటి గుడిసెల జీవితాల పట్ల సమాజాన్ని సెన్సిటైజ్ చేయడంలో విజయవంతమయ్యారు. దేవులపల్లి కృష్ణమూర్తి కథలు, నవలలు చదువుతున్నప్పుడు వారి శైలిని గమనిస్తే, జీవితాలను చూసినట్టు రాస్తారు. అవి అనుభవించినట్టు ఉండవు. రచయిత ఎప్పుడూ వ్యక్తిగత జీవితానుభవాలకు ప్రాధాన్యత ఇవ్వరాదు. అయితే సమాజానికి అనువర్తింపజేసే రచయిత అనుభవాలకు మినహాయింపు ఉంటుంది. ఈ రచనల్లో ఆ మినహాయింపు లక్షణం ఉంది. నల్లగొండ భాషను జీవితాలను కథలుగా మలిచిన ఈ రచయిత ఆలస్యంగా 62 ఏళ్ల ప్రాయంలో తమ రచనావ్యాసంగం మొదలుపెట్టారు. అదీ తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకతనే. ఒక రచయితకు అవార్డులు రివార్డులు ఒక రచన గొప్పదనాన్ని సూచించే సూచికలు కాకపోయినప్పటికీ రచయితకు చెప్పుకోదగ్గ అవార్డులు సైతం వరించాయి. వారి సాహిత్యకృషిని గుర్తించిన "తెలుగు విశ్వ విద్యాలయం" వారు ఉత్తమ రచయిత పురస్కారాన్ని అందించారు. ఇప్పటికీ వారి సాహిత్యతృష్ణ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇది ఇప్పటి యువరచయితలకు అనుసరణీయ మార్గం. 82వ సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో "బతుకు పుస్తకం" అభినందన సంచిక విడుదలైంది.

– తంగేడు, 1–15 మే, 2022

నల్లగొండ జిల్లా సాంఘిక నాటకాలు

ప్రపంచంలో మొట్టమొదటి ఆధునిక రూపకం క్రీస్తు పూర్వం 525-456 మధ్య గ్రీసులో పుట్టింది. "ఈస్కిలస్" గ్రీకు నాటకానికి సాహిత్య రూపాన్ని కలుగజేశాడు. పాత్ర రూపం, వేషం, భాష, భావం వంటి అంశాలను నటుడు ఆరోపించుకునే పరిణత స్థితిని "రూపకం" అంటారు. దీని పర్యాయపదమే "నాటకం". సాహిత్యం, అభినయ కళ ఇమిడి ఉన్న సంపూర్ణ సమాహారకళ. కళ మానవ జీవితానికి వాస్తవిక కల్పిత ప్రతిబింబం. చిత్రలేఖనము, శిల్పము, సంగీతము, నృత్యము, కవిత్వము కలిపి "లలిత కళలు" (Fine Arts) అంటారు. లలిత కళలలో కావ్యం గొప్పదయితే, కావ్యాలలో నాటకం గొప్పది. అందుకే కాళిదాసు "కావ్యేషు నాటకం రమ్యం" అన్నాడు.

భారతీయ సాంప్రదాయ సంస్కృత నాటకం క్రీస్తు పూర్వం వెయ్యేళ్ళ నాటిది. "బుద్ధ చరిత"ను రాసిన అశ్వఘోషుడు మొట్టమొదటి సంస్కృత నాటక రచయిత. భారతీయ మొట్టమొదటి ఆంగ్ల స్వతంత్ర్య నాటకం కృష్ణ మోహన్ బెనర్జీ పీడనపై రాసిన "ద పెర్ సెకుటేడ్ (The Persecuted-1837). హిందీలో నాటక పితామహుడుగా గుర్తించే భారతేందు హరిశ్చంద్ర మాంసాహారం వలన కలిగే హింసను గురించి "వైదిక హింసా న భవతి"(1873) అనే నాటకాన్ని రాశాడు. క్రీ.శ. 14వ శతాబ్దంలో చక్కని పలుకుబడులు, నుడికారాలతో వేశ్యాజీవితంపై వినుకొండ వల్లభరాయడు రాసిన తొలి తెలుగు వీధినాటకం "క్రీడాభిరామం". కోరాడ రామచంద్ర శాస్త్రి తొలితెలుగు స్వతంత్ర్యనాటకం ''మంజరీ మధుకరీయం(1860)"ను రచించాడు. కొక్కొండ వెంకటరత్నం మొదటి సంస్కృత అనువాద తెలుగు నాటకం''నరకాసుర విజయ వ్యాయోగం'' (1871)ను

అనువదించాడు. వావిలాల వాసుదేవ శాస్త్రి ఆంగ్లంనుండి తెలుగులోకి "సీజరు చరిత్ర" (1872)ను అనువదించాడు. తెలుగు నాటకం సంస్కృత, ఆంగ్లానువాదంగా ప్రారంభమై, స్వతంత్ర్య రచనగా ఎదిగి, ఔత్సాహిక నాటకరంగంగా, ప్రయోగనైపుణ్యంతో విస్తృతంగా పరిణామం చెందింది. నాటకసమాజాలు, ఉపాధి సహిత నాటక కళాకారులు ఏర్పడ్డారు.

నాటకప్రదర్శన వ్యయభరితమైంది. రెండవప్రపంచయుద్ధం, మాంద్య ప్రభావంతో జమిందారులు, సంపన్నుల ఆదరణ నాటకానికి తగ్గింది. దాంతో కాంట్రాక్టుపద్ధతిన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. 19శ. చివరలో ఐరోపా నాటకంలో చప్పట్లు కొట్టడానికి కిరాయి మనుషులను ప్రేక్షకులలో కూర్చోబెట్టడమనే "క్లాకర్ పద్ధతి" వచ్చింది. ఆంధ్రప్రాంతంలో 1960 లో దీనిని పరిచయం చేశారు. అదే సమయంలో మూకీ సినిమా టాకీగా మారింది. కాంట్రాక్టు నాటకాలపై ప్రజల ఆసక్తి తగ్గింది. కాంట్రాక్టర్ల దోపిడీ నచ్చని ప్రతిభ కలిగిన కళాకారులు సినిమావైపు వెళ్ళడంతో నాటకానికి క్షీణదశ ఆరంభమైంది.

దీంతో కళ కళ కోసమే కాదు ప్రజల కోసమనే అభిప్రాయంతో సాంఘిక నాటకం మొదలైంది. ఆధునిక నాటకంగా సాంఘిక నాటకం రూపాంతరం చెందింది. వీటికి ఆదరణ పెరగడంతో సమకాలీన సామాజిక సమస్యల ప్రధానంగా నాటక రచన, ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. సాంఘిక నాటకాలు సమాజంలోని సమస్యలను ఎత్తిచూపుతూ సామాజికుడికి వినోదంతోబాటు, సమస్యా చైతన్యాన్ని కలుగజేసింది. తెలుగులో తొలి సాంఘిక నాటకాలు "నందకరాజ్యం" (వావిలాల వాసుదేవ శాస్త్రి), "వ్యవహార ధర్మ బోధిని/ప్లీడరు నాటకం (కందుకూరి) అవినీతి, ధనాశవంటి అంశాలను చర్చకు బెట్టింది. తరువాత వచ్చిన గురజాడ "కన్యాశుల్కం(1897)"ను వాడుక భాషలో రాయడంతో తెలుగు సాంఘిక నాటకం కూడా బహుముఖంగా విస్తరించింది.

19వ శతాబ్ది ద్వితీయార్థంలో మన సంఘంలో అతిబాల్య వివాహాలు, వేశ్యాలోలత్వం, భోగం, మేళాల మీద మోజు, కన్యాశుల్కం, కుల కక్షలూ, మత కలహాలు, అంటరానితనం, శకునాలు, శాతబడులు, జాతర్లు, జంతుబలులు, మద్యపానం మొదలైన దురాచారాల వంటి సాంఘిక సమస్యలు సమాజంలో

ఉన్నాయి. 20వ శతాబ్దంలో విదేశీపాలన, పాశ్చాత్య నాగరికత, పెట్టుబడిదారి దోపిడి, దళారుల అన్యాయాలు, బెంగాల్ లో బయలుదేరిన సాంఘిక, మత, సామాజిక సంస్కరణల ప్రభావం, మార్క్సిస్టు సిద్ధాంతాలు, భౌతికవాదం, అతివాద భావాలు యువకులను ఆకర్షించాయి. పతనావస్థలోనున్న భూస్వామ్య, జమిందారీ వ్యవస్థ ఆత్మరక్షణ కొరకు ఆకృత్యాలకు తెగబడడం, దానికి వ్యతిరేకంగా పేదరైతులు, రైతుకూలీల జరిపిన పోరాటాలు అభ్యుదయ సాంఘిక నాటకాలకు ఊపిరిలూదింది. సామాజిక పరిస్థితులతో బాటు సమస్యలూ మారుతూ వచ్చాయి. సాంఘిక నాటకరచన కూడా మార్పుకులోనయింది. తెలుగు రచయితలకు అంతర్జాతీయ సాహిత్యం అందుబాటులోకి వచ్చింది. "ఇబ్సన్, బెర్నార్డ్ షా, చెకోవ్, టాల్ స్టాయ్" వంటి రచయితలచే ప్రభావితులయ్యారు.

తెలంగాణలో నాటకం దేశీ రూపకం. ఆంధ్రాప్రాంతంలో నాటక కళాభివృద్ధి జరిగినంతగా తెలంగాణలో జరుగలేదు. ఇక్కడ ప్రదర్శనలు జరిగినంతగా, నాటక రచన జరగలేదు. తెలంగాణలో భద్రాచలం, దుమ్ముగూడేనికి చెందిన భూస్వామి సోమరాజు రామానుజరావు మొట్టమొదటి నాటక రచయిత. జాతీయోద్యమ ప్రభావంతో 'స్వరాజ్య రథం (1921)' అనే నాటకాన్ని రాశాడు. దీనిని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది.

1933లో తెలుగు ప్రాంతంలో కమ్యునిస్టు పార్టీ ఆవిర్భవించింది. యువత ప్రగతిశీల దృక్పథంవైపు ఆకర్షించబడ్డారు. కళ కళ కోసమే కాదు, ప్రజల కోసమనే అభిప్రాయంతో 1943లో 'ప్రజా నాట్యమండలి' స్థాపించబడింది. తెలంగాణ విమోచనోద్యమం, కమ్యూనిస్టుల సాయుధ పోరాటంతో ప్రభావితమై ప్రజల్లో చైతన్యాన్ని నింపుతూ ఎన్నో నాటకాలు రచింపబడి, ప్రదర్శింపబడ్డాయి. ఈ ప్రజాపోరాటం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించిన నల్లగొండ జిల్లాలో జరిగిన పోరాటం ఇతివృత్తంగా సుంకర వాసిరెడ్డి రచించిన "మా భూమి"(1947) నాటకాన్ని రచించగా, దీనిని 125 నాటక దళాలు పాల్గొని ఏడాదిలో వెయ్యి ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన రాసిన "ముందడుగు" నాటకంలో భూస్వాముల దోపిడీ, రైతుల తిరుగుబాటును, వర్గసంఘర్షణను చూపారు. తెలంగాణ పోరాట పరిణామాలను చిత్రిస్తూ, మా భూమి నాటకానికి కొనసాగింపుగా సుంకర

సత్యనారాయణ 'గెరిల్లా" నాటకం, పొట్లపల్లి రామారావు 'పగ, సురభరాహి, న్యాయం' లాంటి నాటికలు, భారత యూనియన్లో ఈ ప్రాంతం కలవాలని, డా. రాజారావు "వీరనారి"(1948) అనే నాటకం, సుంకర సత్యనారాయణ 'వీర కుంకుమ', కాంగ్రెసా-ఆంగ్రేజా', మహీధర రామ్మోహనరావు 'శాంతి రక్షణ కోసం, 'రిపబ్లిక్ వెలిసింది' అనే నాటకాలను రచించారు. తెలంగాణ పోరాటంతో పట్టణాలకు పారిపోయి తిరిగి గ్రామాలకు వచ్చిన దేశ్ ముఖ్‌లు ప్రజలను హింసించిన తీరును వాసిరెడ్డి భాస్కరరావు "పోతుగడ్డ" నాటకంలో రాశారు. రచించాడు. రచించారు. ఈ నాటకాలలో చిత్రింపబడ్డాయి. భూదానోద్యమం ప్రభావంతో సుంకర "భూమికోసం", రమణారెడ్డి "అన్నపూర్ణ" నాటకాలను రాశారు. సుంకర వాసిరెడ్డి "అపనింద" అనేది మధ్యతరగతి యువతి తనను తిరిగి ప్రేమించలేదని నీలాపనిందలు వేసే యువకుడి నీచప్రవృత్తిని బహిర్గతం చేసిన సాంఘిక నాటకం.

ఒక ప్రాంతం చరిత్ర పాలకులచే, సంస్కృతి భౌగోళిక పరిస్థితులచే ప్రభావితమవుతుంది. పూర్వ నల్లగొండ జిల్లాలో కృష్ణానది, మూసీ నదులున్నాయి. నదీతీరాల వెంట సంస్కృతి వృద్ధి చెందుతుంది. నాటకం సంస్కృతిలో ఒకభాగం. నల్లగొండ ప్రాంతాన్ని ప్రాచీనకాలంలో శాతవాహన, ఇక్ష్వాకులు, మధ్యయుగంలో రాచకొండ, కాకతీయ, కుతుబ్షాహీలు, ఆధునిక యుగంలో అసఫ్జాహీలు (నిజాం రాజులు) పరిపాలించారు. పోలీస్ చర్య అనంతరం 1948లో స్వతంత్ర భారత యూనియన్లో విలీనమయ్యింది. నల్లగొండ ప్రాంతం ఎక్కువకాలం రాచరికపు నీడలో ఉంది. కాబట్టి ఈ ప్రాంతం ఆర్థిక, సామాజిక, సాంఘిక, రాజకీయ, భాష, విద్యాపరంగా తీవ్ర వెనుకబాటుకు గురైంది. ఫ్యూడల్ సమాజం ఇక్కడి ప్రజలను తీవ్రపీడనకు గురిచేసింది. దీనికి వ్యతిరేకంగా జాతీయోద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు, కమ్యూనిస్టు పోరాటాలతో ప్రజలు చ్కైతన్యవంతమై, నిజాం వ్యతిరేక రైతాంగ సాయుధపోరాటం చేశారు. ఈ పోరాటాలకు గొల్ల సుద్దులు, బుర్ర కథలు, వీధి భాగోతాలవంటి జానపద కళారూపాలతో బాటు సాంఘిక నాటకం ఉపయోగపడింది.

నల్లగొండ జిల్లా నాటకసంస్థలపై డా. లింగనబోయిన లేఖానందస్వామి పరిశోధించాడు. వారి పరిశోధన ప్రకారం ఇక్కడ దాదాపుగా 50కి పైగా వివిధ

నాటక సంస్థలు ఉన్నాయి. కానీ ప్రదర్శించిన నాటకాలతో పోలిస్తే, నాటక రచయితలు చాలా తక్కువగా ఉన్నారు. ప్రదర్శించిన నాటకాలు రాసినవారు ప్రాంతేతరులవే ఎక్కువగా ఉన్నాయి. వాటికే ప్రాచుర్యం దక్కింది. తెలుగు నాటక రంగానికి కేంద్రబిందువుగా నాటకప్రియులు పేర్కొనే గుంటూరు జిల్లా "తెనాలి" నల్లగొండకు సమీపంలో ఉంది. ఆంధ్రాప్రాంతం బ్రిటీషుపాలిత తెలుగు ప్రాంతం. అక్కడ ఆంగ్లమాధ్యమ మిషనరీ పాఠశాలు నెలకొల్పడంతో, వారు ఆంగ్లనాటక సాహిత్యాన్ని అధ్యయనం చేసి, ప్రభావితమయి ఆకర్షణీయమైన నాటక రచన చేశారు. అదేవిధంగా నాటక పరిషత్తు నిర్వహణ, పోటీలు ఎక్కువగా ఆ ప్రాంతాల్లోనే జరిగేవి. ఈ పోటీలకు తయారయ్యే ఔత్సాహిక నల్లగొండ నాటక సంస్థలు సహజంగా అక్కడి రచనలనే ఎంచుకోవడం ప్రారంభించారు. అయినా నల్లగొండ జిల్లాలో నాటక కె.యల్. వంటి రచయితలు సాంఘిక నాటకాలు, నాటికలు రాసి తెలుగు నేలంతా మెచ్చేవిధంగా ప్రదర్శించారు. ఆంధ్రా ప్రాంతంలో నాటకరంగంలోని నటులు వృత్తిగా మలుచుకోగా, నల్లగొండ ప్రాంతంలోని ప్రవృత్తికళగా, పవిత్రమైన కళగా భావించినట్టు అర్థమవుతుంది.

తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కోదాటి లక్ష్మీ నరసింహారావు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మునగాల పరగణా, రేపాల గ్రామంలో జన్మించాడు. ఈయన నల్లగొండ నాటకానికి వెన్నుపూస వంటివాడు. తెలుగు నాటకరంగానికి తన జీవితాన్ని, యావదాస్తిని నిస్వార్థంగా అర్పించిన మహనీయుడు. తండ్రి కోదాటి వెంకట నరసింహారావు గ్రామ కరణంగా పనిజేస్తూ, రైతుల పక్షం వహించి, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమం చేశాడు. కె.యల్. టీచర్ల ప్రేరణతో అభ్యుదయ సాహిత్యంవైపు ఆకర్షితుడైనా, ఆ ప్రభావం నుండి త్వరగా బయటపడ్డాడు. 1945 కాలంలో ఆ ప్రాంతంలో భూస్వాములు తమ దగ్గర పనిజేసే జీతగాళ్ళను చులకనగా చూసేవారు. వారిలో చైతన్యం తేవాలని "విప్లవ శంఖం" నాటకం రచించాడు. దీనిని ప్రదర్శించడానికి ఎవరూ సాహసించకపోతే మిత్రులు వేముల నరసింహం, కందిబండ మంగయ్య, వారణాసి, చివలూరి, ఆచార్యలాంటి మిత్రులతో కలిసి నటించి, ప్రదర్శించాడు. ఈ నాటక ప్రభావంతో జీతగాళ్ళు తమ హక్కులను కోరుతూ, భూస్వాములకు ఎదురుతిరిగారు. దాంతో కె.యల్. "గ్రామవెలుగు నాట్యమండలి"ని

1 జనవరి1946లో "రేపాల" గ్రామంలో స్థాపించారు. దీనిద్వారా గ్రామ ప్రజలలో మార్పు తేవడానికి, వారి బాధలను, వారి భాషలోనే నాటకాలను రచించి, ప్రదర్శింపజేయాలని సంకల్పించాడు. ఈ కార్యక్రమాలను ప్రజారంజకంగా మార్చుడానికి "వైజ్ఞానిక మహాసభలు ప్రదర్శనల" పేరుతో లక్ష్మీ నరసింహ స్వామి జాతరలో భాగంగా ప్రతీయేడు నాటకాలను అట్టహాసంగా ప్రదర్శించేవాడు. ఈ ప్రదర్శనలకు మాజీ ప్రధాని పివి నరసింహారావు మొదలు ఎందరో సినీ, రాజకీయ, సాహిత్య దిగ్గజాలను ఆహ్వానించేవాడు. ఈయన రచించిన సాంఘిక నాటకాలపై త్రిపురనేని గోపీచంద్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సామాజిక సమస్యలు, సంభాషణల్లో హాస్యం, సంస్కరణ వాదం ఈయన నాటకాల్లో ముఖ్యమైన అంశాలు. ఈయన నాటక సంభాషణలు పూరిగుడిసెల్లో నివశించే పేదల స్థాయికి చేరి, వారిని ఆలోచింపజేసే స్థాయిలో ఉండేవి. కెయల్ దాదాపు 150 కిపైగా నాటకాలు రాశాడు. ఇవన్నీ సాంఘీక నాటకాలే కావడం విశేషం. ఈయన రాసిన నాటకాలు జిల్లా నాటకాల సంఖ్యకు మించి ఉంటుందంటే అతిశయోక్తి కాదు. "విప్లవ శంఖం, ఆదర్శ లోకాలు (కులమత రహితమైన సమసమాజాన్ని స్థాపించాలని), అభాగ్యులు, స్వార్థం, సుడిగుండం, ఒడిదొడుకులు, దూరపు కొండలు, తేజోమార్గం, పాముల పుట్ట, ప్రజారథం, తోడునీడ, కల్పతరువు, గెలుపు నీదే, అడుగుజాడలు, తొలకరి, ప్రజాదేవత, మతిలేని మహారాజు, అపరాధ పరిశోధకులు, రేపటికి వాయిదా, అక్బర్, క్రీనీడలు" మొదలైన సాంఘిక నాటకాలు అశేషజనాన్ని ఆకట్టుకున్నాయి. గ్రామాల నుండి నక్సలిజం సమస్యను తొలగించడానికి, ప్రజలను చైతన్యపరచడానికి కెయల్ సాయంను ప్రభుత్వం కోరింది. ఆయన నక్సలిజం వలన ధన, ప్రాణ నష్టాలను పేర్కొంటూ, కరుణరసాత్మకంగా "భారతి" అనే నాటకాన్ని రాశారు. ఆయన నాటకరచన, దర్శకత్వం, నాటక నిర్వహణతో బాటు బాలల, చారిత్రక, మనస్తత్వ నిరూపక, రేడియో నాటకాలను రాశాడు. వయోజన విద్యా కార్యక్రమం, నక్సలిజం, అంతరానితన నిర్మూలన ఇలా సాంఘీక సంస్కరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. అనేక చోట్ల దీనిని రాష్ట్ర సాంస్కృతిక శాఖ ప్రదర్శించింది. ప్రదర్శనలో పాల్గొన్న నటులకు ప్రభుత్వం ఉద్యోగం కల్పించింది.

నల్లగొండ జిల్లాలో జాతీయోద్యమంతో బాటు హైదరాబాద్ సంస్థాన విముక్తి

పోరాటం ఉవ్వెత్తున సాగింది. దీని ప్రభావం వలన అభ్యుదయ నాటకాలు వెలువడ్డాయి. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల ఆగడాలు, వెట్టిచాకిరి, దొరలు, దేశ్ ముఖ్ నిరంకుశ వైఖరి వలన ప్రభావితమైన రచయితలు నిజాంకు వ్యతిరేకంగా గవ్వా మురహర రెడ్డి "గుంటక పురాణం, కళ్యాణి" నాటకాలు, వట్టికోట ఆళ్వారుస్వామి "కనువిప్పు" నాటకాన్ని, గవ్వా జానకీ రామిరెడ్డి "దేశబంధు, సత్పథం", పులిజాల గోపాలరావు "విజయ భాస్కరం, ధర్మ జీవనం, తెలుగు పొలం", ఏలే ఎల్లయ్య "బీద రైతు, మార్కేండేయ, సీతా కళ్యాణం" వంటి సాంఘిక నాటకాలను రాశారు.

ముడుంబయి వెంకటనరసింహచార్యులు "తిండికి మెందు, సింహ స్వప్నం, ద్రోహం, మహిళాభ్యుదయం" వంటి నాటకాలు, బద్దం భాస్కర్ రెడ్డి(చెరబండరాజు) "గంజినీళ్ళు, బీదల బతుకులు" వంటి విప్లవాత్మక నాటకాలు రచించారు.

పెరిక రాజారత్నం (1957-58) "ఎవరు బాధ్యులు?, నూతన కాంతలు(పంచవర్ష ప్రణాళికను ప్రజలకు వివరించిన నాటిక), డాలియా(రవీంద్రనాథ్ ఠాగూర్ రచనకు అనువాదం), తపస్విని-1978 (తరువాత దీనిని టెలిఫిలింగా కూడా తీశాడు), పుణ్యభూమి, ఎడారి బతుకు" నాటకాలను, ఇష్టంలేని పెళ్లి, నూతన కాంతులు" నాటికలను రచించి, ప్రదర్శించాడు. వీరు 1973లో రామన్నపేట శాసనసభ్యులుగా పనిజేశారు. సుద్దాల హనుమంతు తెలంగాణ పోరాటకాలంలో (1945-46) రచించిన "పల్లెటూరి పిల్లగాడ... గేయం ప్రతి సాంఘిక నాటకంలో వేదికలపై ప్రదర్శించి మన్ననలు పొందింది. హైదరాబాద్ విమోచనోద్యమంలో పాల్గొన్న ప్రముఖ శాసన చరిత్రకారుడు బి.ఎన్. శాస్త్రి ఆ ప్రభావంతో "నీరాజనం(1951-52), కిరాయిదారు, గ్రామ జీవనం, సహకారం" నాటికలను రాశాడు. సమాజంలోని మంచి చెడులపై అవగాహన కల్పిస్తూ, ఎలిశెట్టి బాలకృష్ణ "న్యాయం తప్పుకుంది, గ్రామ సింహాలు" వంటి నాటికలను, దేవులపల్లి వెంకటప్రభాకర రావు "ఓటరు లీలలు" నాటిక, మరిగంటి వెంకటసింహచార్యులు "లలిత", ప్రసిద్ధ కథా రచయిత బోయ జంగయ్య తన కష్టాలు, అనుభవాలను పొందుపరిచి పాఠశాల స్థాయిలో రాసిన "కష్టసుఖాలు (1963)నాటికతోనే అతని రచనారంభం ప్రారంభమైంది. ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలు తొలగించడానికి పెంటపాడు సర్వేశ్వరరావు "అష్టాగ్రహ కూటమి" నాటకం, సామాజిక సమస్యలను ఇతివృత్తంగా ఆలేర్ శంకర్

"జంగబిల్లి, చావుకేకలు, రేపటి రేపు, భూత గణం, చట్టం క్షమిస్తుందా?, కాళీ, ఓ తల్లి తీర్పు, అర్చన, ఎన్నికలు, భద్రం కొడుకో" లాంటి నాటికలను రాశాడు. ఇదే అంశంలో బి. మల్లారెడ్డి "తుది తీర్పు మీరే చెప్పండి, కనువిప్పు, లంకె బిందెలు, శంఖారావం, ఆదర్శం, గ్రామ దేవతలు" అనే నాటికలను రాశాడు.

మూర్తిగారి జనార్ధన్ "రచ్చబండ" నాటికను, సూర్యాపేటకు చెందిన కవిరాజు "సంగం పెళ్లి, రిహార్సల్స్" హాస్య వంగ్య నాటికలను రాశాడు. సరస్వతీభట్ల కృష్ణమూర్తి "వీరపత్ని" నాటకాన్ని, పగిడిమర్రి దుర్గారావు "ఉత్తర గోగ్రహణం, నాట్యశాల, భూమితల్లి బిడ్డలు, శోణపద్మం" నాటికలను రాశారు. కుటుంబ, వైయుక్తిక బాధలు, కష్ట సుఖాల, బాంధవ్యాలు, వివిధ సాంఘిక సమస్యలు నేపథ్యంగా వచ్చిన పగిడిమర్రి దుర్గారావు "అందరికీ నచ్చిన కోడలు" నాటకం, గంజి గోవర్ధన్ "భూమితల్లి" నాటకాలను రచించారు. మునగాల మండలం జగన్నాధ పురానికి చెందిన కొల్లు మధుసుధన్ రావు "మన విశ్వంలో మానవుడు" పిల్లల ప్రభోదాత్మక రూపకం రచించాడు. ఇతను "స్వప్న జీవులు(1967), పైరవీకార్ (బాలల నాటిక), గ్రామ సింహాలు, మామకు తగ్గ అల్లుడు" వంటి సాంఘిక నాటికలను రాశాడు.

బోయపల్లి నర్సయ్య "సగటు బతుకులు, ఇది మనకథ, మామూలు మనిషి, సమాధులపై పునాదులు" నాటకాలను రాశాడు. ఆకెళ్ళ నరసింహమూర్తి "గెలుపు నీదే, అడుగు జాడలు" నాటికలు రాశాడు. కె.యల్. తర్వాత జిల్లానాటక రంగంలో పేరెన్నికగన్నవారు తడకమళ్ళ రాంచందర్ రావు. ఈయన పద్య, చారిత్రక నాటకాలతో బాటు సాంఘిక నాటకాలైన "దండకారణ్యం, మమజీవన హేతునా, కళాజీవి, రిగ్ వేదం, పంజరం, ఎందుకు పారేస్తాను?, ఇంట గెలిచి, సారారక్కసి, స్వాతంత్ర్య సమరజ్వాల (చారిత్రాత్మక నాటిక) వంటివి రాశాడు.

గజ్వెల్లి సత్యం రచయితగా "పరివర్తన, మార్పు, మధుపర్కం" లాంటి నాటికల ద్వార సమకాలీన సమాజంలోని అంతరాలను దృశ్యీకరించాడు. డాక్టర్ పురుషోత్తమాచార్యులు బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత, సాహిత్యరంగాలలో జిల్లాలోనే కాకుండా సినీసంగీతంపై "జాతీయ ఉత్తమ విమర్శ అవార్డు"ను రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నాడు. ఈయన పౌరాణిక, సాంఘిక నాటకాలను రాశాడు.

“ప్రాణత్యాగం, కనువిప్పు, ఎత్తుకు పై ఎత్తు, నకిలీ మెజిషియన్, ఇదేబాట, కర్ణ సందేశం, యెంకన్న ఎరుక, పెళ్ళికుదిరిది, చీకటి తెరలు, ఇనిస్పెక్షన్, ఉత్తరాయణం, రెండు వరాలు, కొత్త వెలుగు, శుకనాదం, ప్రభాత భేరి, శివాలు, ప్రదక్షిణం, ఇదీ వరస, కళ్ళు తెరచిన బాల్యం, మళ్ళీ బడికిరా, తిరగబడిన పద్యం, పదివేలు, ఇలాగైతే!?” లాంటి నాటిక, నాటకాలను రంగస్థలంపై ప్రదర్శించుటకు అనుకూలంగా రాశాడు. డాక్టర్ లింగనబోయిన లేఖానందస్వామి నల్లగొండ నాటక సమాజాల మీద సమగ్ర పరిశోధన చేసి, సిద్ధాంత గ్రంథం సమర్పించాడు. ఈయన “కాలం మారింది, పట్వారి(1975), జీతగాడు, తొలగిన తెరలు, బస్టాండు లో బాధితుడు, రక్తపాశం, క్షమిత” లాంటి సాంఘిక నాటికలను రాశాడు. బి. మల్లారెడ్డి “తుది తీర్పు మీరే చెప్పండి, కనువిప్పు, లంకెబిందెలు, శంఖారావం, ఆదర్శం, గ్రామ దేవతలు” అనే నాటికలను రచించారు. “రచ్చబండ” అనే నాటికను మూర్తిగారి జనార్ధన్ రాశాడు. సూర్యాపేటనుండి కవిరాజు వ్యంగహాస్యరసస్ఫోరకంగా “సగం పెళ్ళి, రిహార్సల్స్” లాంటి నాటికలు రాసి ప్రదర్శించాడు. సరస్వతీభట్ల కృష్ణమూర్తి “వీరపత్ని” అనే నాటకాన్ని కవిరాజ్ రాశాడు. బిస్నూరు నరసింహశాస్త్రి “నీరాజనం, కిరాయిదారు, గ్రామ జీవనం, సహకారం” లాంటి నాటికలను రాశాడు.

యెలిశెట్టి బాలకృష్ణ “న్యాయం తప్పుకుంది, గ్రామ సింహాలు” నాటికలను రాశాడు. లెక్కల మల్లారెడ్డి “తుది తీర్పు మీరే చెప్పండి, కనువిప్పు, శంఖారావం, ఆదర్శం, గ్రామదేవత, లంకె బిందెలు” లాంటి నాటికలను రాశాడు. అంబడి పూడి వెంకటరత్నం “దక్షిణం, ఇందిరా విజయమ్(సంస్కృతం), కౌముదిక ఏకాంకికలు, చూడాల, ఆకృతజ్ఞోనరస'' నాటికలు రాశాడు. పరిమిశ్రీరామమూర్తి “అభ్యుదయం”(నాటకం) దీక్ష, ముందడుగు నాటికలను రాశాడు.

వారణాసి వీరనారాయణ శర్మ “మనమంతా ఒక్కటే”, పరిమి శ్రీరామ మూర్తి “అభ్యుదయం” లాంటి నాటకాలను రచించారు. సూర్యాపేటకు చెందిన ఖాజా పాషా “శాపగ్రస్తులు” అనే నాటకం రచించాడు. ఈ నాటకం 2006 నంది నాటకోత్సవాల్లో ఏకంగా 6 నందులను కైవసం చేసుకుంది. దళిత భాషాసాహిత్యానికి చుక్కాని అనదగిన వేముల ఎల్లయ్య ఉద్యమం పేరుతో అమాయకులను సమాజం మీదకు ఉసిగొల్పే రాజకీయ దుర్నీతిని ఎండగడుతూ “బహువిధ”(2016) నాటకాన్ని

అచ్చుమైన తెలంగాణ భాషలో రాశాడు. నకిరేకల్ కు చెందిన ప్రభుత్వ విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు ఎర్రా యాదగిరి చదువు వెలుగు, ఎయిడ్స్ మహమ్మారి వంటి పలు సామాజిక సమస్యలపై ప్రజలకు అవగాహన కలిగించుటకు, పౌరాణిక కథలను, "మార్పు" వంటి నాటకాలుగా మలిచి ప్రదర్శించాడు. చెడు వ్యసనాలకు బానిసై వృద్ధులైన తల్లిదండ్రులను అనాదరించే కొడుకుకు బుద్ధి చెప్పే నాటిక శీలం భద్రయ్య "ఖూనీ(2023)" వంటివి ఈ జిల్లానుండి వచ్చాయి.

నల్లగొండ జిల్లా నాటకరంగాన్ని పరిశీలిస్తే ఎక్కువగా నటీనటులు, దర్శకులు, సంగీత వాయిద్య నిపుణులు, రచయితలున్నారు. ఇక్కడి నాటకసమాజాలు వేల ప్రదర్శనలు యిచ్చారు. మద్యపానం మహమ్మారి, చదువు గొప్పదనం, నక్సలిజం, దుర్వ్యసనాలు, మూఢనమ్మకాలు వంటి అనేక సామాజిక సమస్యలను కథలుగా ఎంచుకుని ప్రదర్శించిన గ్రామవెలుగు, స్త్రీలచేత పౌరాణిక నాటకాలు వేయించిన శారద కళాసమితి, బుద్దులు మారాలి నాటకాన్ని వెయ్యి ప్రదర్శనలు ఇచ్చిన ఓంకార నాటక సంస్థ, శ్రీ జాగృతి, విజయభాను, శ్రీనికేతన్, కేవలం సాంఘిక నాటకాలనే ప్రదర్శించిన కోమలి కళా సమితి, సినీనటుడు నాగభూషణం ఆధ్వర్యంలో వేల ప్రదర్శనలు జరుపుకున్న రక్తకన్నీరును నిర్వహించిన విజయభాను కళాసమితి వంటివి ప్రఖ్యాతి గాంచినవి ఈ జిల్లాలో ఉన్నాయి.

ఒకప్పుడు నాటక రంగం ఉపాధిగా మారినప్పుడు కళాకారులు వృత్తిని నిష్టగా భావించారు. వ్యాపారమయం కావడంతో నాటకం క్షీణదశకు చేరుకుంది. సామాజికమై విస్తృతమయినా, ఆధునికత లోపించి నీరసించింది. ఇప్పుడు నాటక ప్రదర్శన అరుదుగా మారింది. నాటికల ప్రదర్శన అప్పుడప్పుడూ అక్కడక్కడా కనబడుతుంది.

నిడివి, సమయం, పాత్రలు, సన్నివేశాలు కుదించబడే పద్ధతికి మారిపోయింది. రంగాలంకరణ, ధ్వని యిత్యాది విషయాల్లో ఆధునిక సాంకేతికత పెరిగింది. ఆధునిక సామాజిక అవసరాలు, వాదాలకు తగ్గట్టు నాటకాన్ని రాసుకుని ప్రదర్శిస్తున్నారు. అయినా నల్లగొండ ఔత్సాహిక నాటకరంగ సంస్థలు, నిర్వాహకులు, నటులు చాలావరకు వృద్దులయ్యారు. నాటక నిర్వహణ వ్యయం బాగా పెరిగిపోయింది. దీనివలన అడపాదడపా అన్నట్టు నిర్వహించడంతో ప్రేక్షకులు

తగ్గిపోయారు. ఒకప్పుడు టెలివిజన్లు, వెండితెర కారణంతో కరువైన ప్రేక్షకులకు ఇప్పుడు అరచేతిలోనే వినోదం, విజ్ఞానం లభిస్తుండడంతో నాటకాన్ని మరిచిపోతున్నారు. నాటకంపై చలనచిత్రరంగం ప్రభావం చూపితే, దానిపై సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్, ఓటిటి వంటి స్ట్రీమింగ్ వేదికలు ప్రస్తుతం ప్రభావం చూపుతున్నాయి. రాబోయే రోజుల్లో "జేనెరేటివ్ కృత్రిమ మేధ" (Generative AI) ఈ రంగంపై చాలా ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే వీటికి కూడా ఆకర్షణీయమైన విషయం (Content) అవసరం ఉందనే ప్రాథమిక విషయాన్ని గ్రహించినపుడు, నాటకంలోని వేదిక మారిందేమో కానీ నాటకంలోని సాహిత్య అవసరం ముందు తరాలకూ ఉందని భావించాల్సిఉంది. ముఖ్యంగా యువతను నాటకరంగం వైపు మళ్ళించాల్సి ఉంది.

ఇప్పటికీ ప్రభుత్వ పథకాలను గ్రామీణ పేదలకు చేరడానికి, సామాజిక సమస్యల మేలుకొలుపుకు నాటకప్రదర్శన సులువైన, మెరుగైన పద్ధతి. కాబట్టి ప్రభుత్వం, ప్రజలూ అందరూ నాటకాన్ని రక్షించుకోవాలి. దీనికోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటకరంగ ప్రోత్సాహకానికి "నంది పురస్కారాలు" ఇచ్చినట్టుగా నాటకరంగ వ్యక్తులకు రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహం, వేదికలను అందించాల్సి ఉంది. అదేవిధంగా రంగురంగుల రంగాలంకరణతో సింగారించుకునే నాటక రంగం, తెలంగాణ జానపద కళలపై పెద్దగా ప్రభావం చూపకపోవడానికి గల కారణాలు అన్వేశించాల్సిఉంది.

–మూసి మాస పత్రిక, మే 2024

ఆకలిని కథానాయకుడిని చేసిన ఆత్రేయ...
'ఎవరు దొంగ' నాటిక

కావ్యాలనేవి దృశ్యకావ్యాలు, శ్రవ్య కావ్యాలని రెండు రకాలు. దృశ్య కావ్యాన్ని నాటకమని, రూపకమని పేర్కొంటారు. "రూపారోపాత్ రూపకమ్". రూపము ఆరోపించబడడంచేత దృశ్యకావ్యాన్ని రూపకమని అంటారు. భరతుడు పది రూపక బేధాలను పేర్కొన్నాడు. వాటితోబాటు "నాటిక" ను కూడా పేర్కొని, "ఇతివృత్తము ఉత్పాద్యము, నాయకుడు రాజు, నాయిక అంతఃపుర కన్య లేదా సంగీత శాలాకన్య, నాలుగు అంకముల నిడివి, ఐదు సంధులు, రస శృంగారము, కైశికి వృత్తి, ప్రకరణలతో కూడినది నాటిక" అని సవివరంగా నిర్వచించాడు.

నాటకం, నాటిక, ఏకాంకిక మూడు కూడా దృశ్య రూపాలే. 'నాటకం'లో వస్తువు ప్రఖ్యాతముగా నుండి, నాయకుడు ధీరోదాత్తుడుగా ఉంటాడు. ఇది వీర, శృంగార రస ప్రధానంగా ఐదు నుండి పది అంకాల నిడివి కథనం కలిగి ఉంటుంది. 'నాటకం' నాందీ, ప్రస్తావనలతో మొదలై భరతవాక్యంతో ముగుస్తుంది. తెలుగులో మొదట నాటక లక్షణాలను తెలిపినవాడు 'విశ్వనాథుడు'. ఇతను "ప్రతాప రుద్ర యశోభూషణం" అనే లక్షణ గ్రంథం రాశాడు. 19వ శతాబ్దంలో ప్రారంభమైన ఆధునిక నాటకం మొదట మార్గ పద్ధతిలో ప్రారంభమై తరువాత దేశీ విధానంలో వికాసం చెందింది. నాటకమనే రూపకం నుండే దశరూపకాలలో మిగిలిన తొమ్మిది రూపకాలు, ఉపరూపకాలు పరిణామం చెందాయి.

'నాటిక' అనేది ఉపరూపకం. దీనిలో వస్తువు కల్పితము. నాయకుడు ధీరలలితముగా అంగి, శృంగార రసముతో నుండి, నాలుగు అంకాల నిడివిని కలిగి ఉంటుంది. ఇది నాటకం, ప్రకరణం(కల్పిత హాస్య ప్రక్రియ) రెంటి లక్షణాల సంకరం. ఈ లక్షణాలు 'విద్ధసాల భంజిక, రత్నావళి' వంటి ప్రాచీన నాటికలలో గమనించవచ్చు. ఆధునికకాలంలోని నాటికలు రెండు మూడు అంకాల నిడివి కలిగి ఉంటున్నాయి. అయితే భరతుడు పేర్కొన్న నాటికకు, ఆధునిక కాలపు 'నాటిక' లక్షణాలను

పరిశీలించినపుడు వీటి మధ్య సంబంధం దాదాపుగా లేదనే చెప్పాలి. నిడివిపరంగా నాటకం కంటే నాటిక రూపంలో చిన్నది. నాటిక కంటే 'ఏకాంకిక' (One Act Play) మరీ చిన్నది. ఒకే అంకం కలిగిన దృశ్యరూపకం ఇది.

ఈనాటి మూడు గంటల నిడివి కలిగిన సినిమాకు మినీసైజులో షార్ట్ ఫిలిం వచ్చినట్టుగా నాటకానికి వచ్చిన మినీ ప్రక్రియ నాటిక కాగా సామాజిక మాధ్యమాలలో వచ్చే రీల్స్ ఏకాంకికలని స్థూలంగా చెప్పవచ్చు. అలాగే నాటికకు ఏకాంకికకు స్పష్టమైన బేధం ఉన్నప్పటికీ రూప సాదృశ్యం వలన నేడు 'నాటిక'కు పర్యాయపదంగా "ఏకాంకిక" ను కూడా నాటికగానే పేర్కొంటున్నారు.

తెలుగులో తెలుగు నాటిక 20వ శతాబ్దంలో నాటకం అనంతరం ప్రవేశించింది. ఆధునిక నాటిక ప్రదర్శన గరిష్ట కాల వ్యవధి సుమారు ఒక గంట సమయం ఉంటుంది. నాటిక కాల వ్యవధి తక్కువ కావడంతో వీటిని నాటకాలతో కలిపి మధ్యలో ప్రదర్శించేవారు. నాటకాలలో కంటే నాటికలలో 'విషయ క్లుప్తత, చురుకైన ఆలోచనాత్మక సంభాషణలు' చాలా ముఖ్యం. అలాంటివి మాత్రమే వందల సార్లు ప్రదర్శించినా ప్రేక్షకాదరణ పొందేవి. ఆధునిక తెలంగాణ నాటిక రంగాన్ని బహుముఖ ప్రజ్ఞాశీలురు ఒద్దిరాజు సోదరులు, నాటిక సమాజ స్థాపకుడు, నాటిక రచయిత కోదాటి లక్ష్మీ నరసింహారావు, ఎస్.కె. ఆంజనేయులు, సి. నారాయణ రెడ్డి వంటి పలువురు ప్రముఖులు పరవళ్ళు తొక్కించారు. అంధ్రా ప్రాంతంలో విశ్వనాథ, రాజమన్నారు వంటి ప్రముఖులు నాటిక అభివృద్ధికి తోడ్పడ్డారు.

నాటకాలతో పోలిస్తే నాటికలు తక్కువ సమయంలో ప్రదర్శించబడేవి. కాబట్టి వీటికి ప్రజాదరణ మెండుగా ఉండేది. తెలుగునాట నాటికలు ప్రజలకు వినోద, విజ్ఞానవంతంగా ఉండేవి. ఈ నాటికల రచన, ప్రదర్శన, ప్రజాదరణ ప్రధానంగా ఉండేవి. నాటికల ప్రదర్శన ఖర్చుతో కూడి ఉండడం వలన అంధ్రా ప్రాంతంతో పోలిస్తే తెలంగాణ నాటికా రంగం కొంత వెనుకడుగు వేయడానికి ఆర్థిక పరమైన కారణం ఒకటి కావొచ్చు లేదా భాషాపర, సాంస్కృతిక, సాహిత్య వివక్ష, ప్రభుత్వ సహకార లేమి వంటి కారణాలు ప్రధానంగా ఉండొచ్చు. తెలంగాణ ప్రాంతంలో నాటక. నాటిక ప్రదర్శనల ఖర్చులను భరించడం కష్టంగా మారిన సందర్భాల్లో నల్లగొండ జిల్లా రేపాక ప్రాంతం నుండి కె.యల్. నరసింహారావు

లాంటి ఉదాత్తులు నాటికారంగానికి ఎంతగానో సేవచేశారు. వారు తమ యావదాస్తిని నాటికారంగానికి ధారాదత్తం చేసి తెలుగు నాటికను నిలబెట్టిన ఘనత వారికి దక్కింది. నాటికారంగం కళాకారులు మొదట గౌరవాన్ని పొందారు. అన్ని రంగాలపై ప్రపంచీకరణ ఫలితంగా ప్రభావం పడినట్టుగానే ఈ రంగంపై పడడంతో రంగుల వేదిక సిల్వర్ స్క్రీన్ మీదకు మారింది. స్టేజీ నటులు మొదలైన వారి జీవితం రంగులమయం కావడం, జనాకర్షణ సులువుగా లభించడంతో అనంతర కాలంలో కొందరు రాజకీయాల్లో నాయకులుగా సైతం రాణించడం పరిణామంగా పేర్కొనవచ్చు. ఈ సాహిత్య, సామాజిక, కళా పరిణామానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన కవి ఆచార్య ఆత్రేయ. వారి సాహిత్యాన్ని విశ్లేషిస్తే వారు తెలుగు నాటికా రంగ పరిణామానికి సమాంతరంగా పయనించారని అర్ధమవుతుంది. రచయితగా మొదటగా అభ్యుదయ నాటకాలు, ఆలోచనాత్మక నాటికలు రాసిన వారు, అనంతరకాలంలో సినీ గేయాలతో సినీరంగ ప్రవేశం చేశారు. ఆ రంగంలోనూ తనదైన ముద్రతో చిరకాల సంతకం చేశారు.

తెలుగు నాటకాన్ని మరో మలుపు తిప్పి, నాటక రచనలో కొత్త ఒరవడిని దిద్ది అభ్యుదయాన్ని అద్దిన ఆచార్య ఆత్రేయ ఉత్తమోత్తమ నాటికలను రాశాడు. "అశ్వఘోషుడు, ఆత్మార్పణ, ఎవరు దొంగ, ఒక్క రూపాయి, ఓటు నీకే, అంతర్యుద్ధం, అంత్యార్పణ, కళకోసం, కాపలావాని దీపం, చస్తే ఏం?, చావకూడదు, తెరిచిన కళ్ళు, ప్రగతి, మాయ, వరప్రసాదం" వంటి మొత్తం 15 నాటికలు రాశాడు. ఇవి "ఆత్రేయ సమితి" పేరుతో సినీనటుడు కీ.శే. కె. జగ్గయ్యకు చెందిన 'మనస్విని చారిటీ' ముద్రించిన పుస్తకం ద్వారా లభ్యమవుతున్నాయి. తొలినాటి నాటికలు "ఉత్తనుమానం, పిచ్చాసుపత్రి, నిజం ఎవరి కెరుక" వంటివి కొన్ని అలభ్యము. లభించిన నాటికలలో "ప్రగతి(1950), చావకూడదు (1960) నాటికలు "ఆంధ్ర నాటక కళాపరిషత్తు" వారు నిర్వహించిన పోటీలలో రచనకు మరియు ప్రదర్శనకుగాను ఉత్తమ నాటిక బహుమతులను గెలుచుకున్నాయి. ఆచార్య ఆత్రేయ సినీకవిగా, నాటక, నాటిక రచయితగా, సినీ నటుడు, దర్శకుడుగా, నిర్మాతగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా ఇలా బహుముఖ పాత్రలలో ఒదిగిపోయి జీవితంలోనూ రాణించాడు. అదేవిధంగా సాహిత్య చరిత్రలో బంగారు శిలాక్షరాలలో

నిలిచిపోయాడు.

ఆత్రేయకు దాదాపు పది సంవత్సరాలు వెనుకకు పుట్టిన తెలంగాణ ప్రఖ్యాత సినీకవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సి. నారాయణ రెడ్డి మధ్య కొన్ని పోలికలు కనిపిస్తాయి. ఇరువురూ మొదట నాటికలు రాశారు. అనంతర కాలంలో సినీరంగ ప్రవేశం చేసి వందల మధురగీతాలు రాశారు. ఇరువురూ రచయితలుగానే కాకుండా నాటక ప్రదర్శనలో నటులుగా సైతం నాయక పాత్రను పోషించి మెప్పించారు. ఆచార్య ఆత్రేయ 'ఎన్.జి.వో' నాటకం రాసి, గోపీపాత్రను పోషించి రక్తి కట్టిస్తే, సినారె 'సినీకవి' అనే నాటికను రాసి, అందులో 'భావకవి మకరందమూర్తి' అనే పాత్రలో నటించి ఉత్తమ నటుడు బహుమతిని గెలుచుకున్నాడు. సినారె మొట్ట మొదటి రచన గేయనాటిక "నవ్వని పువ్వు". సినారె 1975లో ప్రపంచ తెలుగు మహాసభల సమయంలో "తరతరాల తెలుగు వెలుగు" నృత్య గేయ రూపకాన్ని రచించి ప్రదర్శింపజేశారు. ఇది అనంతర కాలంలో 14 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. వీరిరువురూ మొదట నాటికలను రాసి అనంతరం జనం మెచ్చే సినీకవులవడం ప్రత్యేకించి చూడాల్సిన విషయం.

మానవుని కష్టసుఖాల ప్రదర్శనకు యోగ్యమైనవి కళలు. దృశ్య కళలలో నాటిక శక్తివంతమైన సంక్షిప్త రూపకం. ఇది రచయిత కోణాన్నే కాకుండా ఆనాటి సామాజిక దృక్కోణాలను దృశ్యరూపం జేసే సామకాలీన సామాజిక ప్రతిబింబం. ఆత్రేయ నాటికలలో నాటకీయత ప్రధానంగా ఉంటుంది. సంభాషణలు ఆలోచించే విధంగా ఉంటాయి. అక్షరాల క్లుప్తత, భావ విస్తరిత అధికంగా ఉంటుంది. ఆచార్య ఆత్రేయ మాటలలో పదాల విరుపును, పాటలలో భావ మెరుపును పలికించినట్టుగానే నాటికలలో పాత్రీకరణకు తగ్గ నాటకీకరణను రక్తికట్టించగలడు. ఆత్రేయ పాటలలో 'మనసు, మమత, దేవుడు, విధి' వంటి రకరకాల ప్రయోగాలతో సినీగీతాలు రాశారు. అదే విధంగా నాటికలలో కూడా ఈ ప్రయోగ దృక్పథం, విలక్షణత విస్పష్టంగా కన్పిస్తుంది.

ఆత్రేయ 'ఎవరు దొంగ' నాటికలో ఇతివృత్తంలోకి వెళ్తే, "పచ్చయప్ప ఇంజనీరింగు కళాశాలలో ఈ నాటికను ప్రదర్శిస్తారు. నాటిక ఆరంభంలోనే కళాశాల హాస్టలు స్టోర్ లో దొంగ దూరి, తాళం పగలగొట్టి, తన భార్యాపిల్లలకు అన్నం

మూట కట్టుకొని పారిపోతాడు. నాటకం ప్రదర్శించడానికి అవసరమయ్యే డ్రెస్సుల మూట కనబడడం లేదని విద్యార్థులు వార్డెన్ కు చెబుతుండగా, అదే సమయానికి పోలీసు సబ్ ఇన్స్పెక్టరు కానిస్టేబుల్తో బాటు అక్కడికి వస్తారు. వార్డెన్ ను ఇన్స్పెక్టరు పోలీసు స్టేషన్కు రమ్మని అంటాడు. దొంగ మీద కంప్లయింట్ చేయడానికి రమ్మంటున్నాడనుకున్న వార్డెన్ ఈరోజు కాదు,' రేపు స్టేషనుకు వస్తానని' చెబుతాడు. మిమ్మల్ని అరెస్టు చేయడానికే వచ్చానని వార్డెన్ తో, పోలీసు ఇన్స్పెక్టరు చెప్పడంతో వార్డెన్ తో బాటు నాటిక జూస్తున్న ప్రేక్షకులలో ఉత్కంఠ మొదలవుతుంది.

రెండవ అంకం పోలీసు స్టేషనులో ప్రారంభమవుతుంది. ఒక తల్లి, ముగ్గురు పిల్లలతో పోలీసు స్టేషనుకు చెందిన బావిలో దూకి ఆత్మహత్య జేసుకుంటారు. వారి చావులు ఆకలి చావులని అక్కడికొచ్చిన డాక్టరు నిర్ధారిస్తాడు. ఈ సంఘటన పోలీసు ఇన్స్పెక్టరును తీవ్రంగా కలిచివేస్తుంది. బాపూజీ రైస్ మిల్లు యజమాని సుబ్బయ్య చౌదరి బియ్యంలో రాళ్ళు కలిపి అక్రమాలకు పాల్పడుతాడు. గిద్దలూరు బాపనయ్య నిబంధనలను అతిక్రమించి 200 పుట్ల ధాన్యాన్ని నిల్వజేస్తాడు. వీటిని నిరోధించాల్సిన 'జిల్లా సరఫరా శాఖ అధికారి (డి.ఎస్.ఓ) ప్రసాదు, మిల్లు యజమాని చౌదరి వద్ద ఐదు వేలరూపాయల లంచం పుచ్చుకుంటాడు. డి.ఎస్.ఓ ప్రసాదు బావ స్థానిక ఎమెల్యే. మరొకవైపు మిల్లు యజమాని వద్ద కళాశాల వార్డెన్ అవసరానికి మించి, విద్యార్థుల పేర ధాన్యాన్ని కొనుగోలు చేసి, దాచి నల్ల బజారులో అమ్ముకుంటాడు. వీళ్ళందరినీ పోలీసు స్టేషనుకు పిలిపించి విచారిస్తుంటాడు సబ్ ఇన్స్పెక్టరు. చివరగా డి.ఎస్. ఓ అవినీతికి సాక్ష్యంగా లంచం డిమాండ్ జేస్తూ చౌదరికి రాసిన ఉత్తరం డి.ఎస్. ఓ. జేబులో వెతకగా దొరుకుతుంది. దాంతో అప్పటిదాక బుకాయించిన అందరూ నీళ్ళు నములుతారు.

స్టేషనుకు పిలిపించిన ఆ గ్రామ మునసబు ఎంత వేడుకున్నా డి.ఎస్.ఓ తన ప్రజలకు ధాన్యాన్ని మంజూరు చేయకపోవడం, ఆ గ్రామంలో ఆకలిచావుల గురించి, అర్ధాకలి గురించి సాక్ష్యం చెబుతాడు. గ్రామంలో తిండి కరువు లేదని బలవంతంగా తనతో పత్రికలకు కృత్రిమ కరువు ఉందని డి.ఎస్.ఓ చెప్పించడం గురించి కూడా పోలీసు అధికారికి చెబుతాడు మునసబు. అదే సమయంలో కళాశాలలో దొంగతనం చేసిన దొంగ అక్కడికి వస్తాడు. 'బాయిలో పడి ఆత్మహత్య

చేసుకొన్నది తన భార్యా పిల్లలేనని, వారి ఆకలి తీర్చడానికే హాస్టలులో ఈ అన్నాన్ని దొంగతనం చేశానని' ఒప్పుకుంటాడు. 'భార్యాపిల్లలే లేనపుడు ఆ అన్నం తనకక్కర్లేదని' వార్డెన్ మొకాన ఆ అన్నం మూటను విసిరికొట్టి, సబ్ ఇన్స్పెక్టరు వద్ద నుండి హఠాత్తుగా తుపాకీ లాక్కొని కాల్చుకుని ఆత్మహత్య చేసుకుంటాడు. విచారణలో దోషులుగా తేలిన చౌదరి, డి.ఎస్.ఓ, వార్డెన్, గిద్దలూరు బాపనయ్యలను అందరినీ కటకటాల వెనక్కి నెడుతాడు పోలీస్ ఇన్స్పెక్టరు. అవినీతిని అడ్డుకున్న ఆ పోలీస్ ఇన్స్పెక్టరుకు రాజకీయ పలుకుబడి అడ్డం పడుతుంది. కానిస్టేబుల్ " పోలీస్ ఇన్స్పెక్టరుకు ట్రాన్స్ఫర్ ఆర్డర్"ను తీసుకొస్తాడు. అంతకు ముందే మిల్లు యజమాని ఫోను చేయడానికి బయటకు వెళ్లి వస్తాడు. దాని ప్రభావమే ట్రాన్స్ఫర్ ఉత్తర్వు అని మనకర్థమవుతుంది. ఆత్మహత్య చేసుకున్న దొంగ కుటుంబానికి తాను న్యాయం చేయలేకపోయానని, దోషులు కండ్ల ముందున్నా ఏమీ చేయలేకపోతున్నానే నిస్సహాయత, బాధతో బదిలీపై స్టేషన్ విడిచి వెళ్తూ, స్టేషన్లో సీజ్ చేసిన బియ్యం బస్తాలో నుండి గుప్పెడు బియ్యపు గింజలను తీసుకొని చనిపోయిన దొంగ' నోట్లో పోస్తాడు పోలీసు ఇన్స్పెక్టరు. 'ఈ తిండి దొంగలను, ఏం చేయలేకపోయినాను. మమ్మల్ని క్షమించమనడంతో" ఈ నాటిక పూర్తవుతుంది. ఇదీ స్థూలంగా "ఎవరు దొంగ" నాటిక నేపథ్యం.

"ఎవరు దొంగ" అనేది "ఏకాంకిక' లక్షణాలున్న రెండంకాల లఘు సాంఘీక నాటిక. ఈ నాటికలో ఆనాటి సామాజిక, ఆర్థిక అసమానతలు, పేదరికం, కరువు, అవినీతి, లంచగొండితనం, బంధుప్రీతివంటి వ్యవస్థాగత వైఫల్యాలని ఎండగడుతూ ఉంటుంది. పౌరాణిక నాటకాల ప్రభావం, ఆదరణ మిక్కిలిగానున్న రోజుల్లో ప్రజలను చైతన్య పరిచే ఇలాంటి నాటికను రాయడంలో ఆత్రేయ అభ్యుదయ భావాన్ని, సామాజిక స్పృహను ప్రత్యేకంగా గమనించాలి.

ఈ నాటిక 1951లో వచ్చింది. అది రెండవప్రపంచ యుద్ధానంతర కాలం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజులు. దేశంలో నెలకొన్న నాటి కరువు పరిస్థితులు, ఆకలి చావులను ఈ నాటిక విపులంగా ప్రతిబింబిస్తుంది. ప్రజల జీవన విధానంపై దేశ విభజన ప్రభావం, భూమి అతి కొద్దిమంది చేతుల్లో ఉండడం, తక్కువ వ్యవసాయ దిగుబడి, ఆహారధాన్యాల లోటు, నల్లబజారులో వ్యాపారస్థులు చీకటి గదుల్లో తిండిగింజలను దాచిపెట్టడం వంటివి కనబడతాయి. దీనికి తోడు

ప్రభుత్వ అధికారుల లంచగొండితనం, రాజకీయ నాయకుల ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి, ధనవంతుల చేతుల్లో అధికారులు నలిగిపోవడం వెరసి ప్రభుత్వ నిస్తేజానికి, సామాన్య ప్రజల అగచాట్లు, ఆకలిచావులకు అద్దం పడుతుందీ నాటిక. ఇవన్నీ ఈనాటికీ అక్కడక్కడా నిత్యకృత్యం కావడం గమనార్హం. అందుకే ఈ నాటికకు సర్వకాలాలయందు ప్రాసంగికత ఉంది.

'ప్రశ్నించేవాడు ఉత్తముడు. మాట్లాడే వాడు మనిషి.' "ఎవరు దొంగ?" అని ప్రశ్నించడమే శీర్షికగా ఉన్న ఈ నాటిక దేశంలో 'భూసంస్కరణలు, నీటి పారుదల ప్రాజెక్టుల ఆవశ్యకత, రైతుసంక్షేమ పథకాలతో బాటు, పరిపాలనా సంస్కరణలు, ప్రజాపంపిణీని బలోపేతం' చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. దేశ స్వాతంత్ర్య ఫలాలు కిందిస్థాయి ప్రజల వరకు అందకపోవడం వలన అట్టడుగువర్గాలలో కలిగిన అసంతృప్తి, దిగజారిన జీవన ప్రమాణాలు ఈ నాటికలో కన్పిస్తాయి.

నాటికలో నాయకుడు నిజాయితీగల పోలీసు అధికారి. బాధ్యతను నిర్వర్తించలేని అతని నిస్సహాయతకు లోను కావడానికి గల రాజకీయ, పెట్టుబడిదారీ కారణాలను సహేతుకంగా కళ్ళ ముందుంచాడు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అట్టడుగు సమాజానికి అందించాల్సింది పోయి, వ్యక్తిగత స్వార్థంతో లంచగొండితనంలో మునిగి బడాబాబులకు కొమ్ముకాయడం విద్యావంతుడైన మరో ప్రభుత్వ ఉద్యోగి డి.ఎస్.వో. ప్రసాదు పాత్రలో కనిపిస్తుంది. ఆత్రేయ ఇలా ప్రభుత్వ ఉద్యోగులలో రెండు కోణాలను స్పృశించాడు. ఒకరు నిజాయితీకి ప్రతీక కాగా ఇంకొకరు అవినీతికి ప్రతీకగా నిలబడతారు. నిజాయితీ యొక్క నోరు నొక్కిన రాజకీయవ్యవస్థ, అవినీతిని ప్రోత్సహించిన పెట్టుబడిదారీ వ్యవస్థలను నిజమైన దొంగలుగా ప్రజల ముందు నిలబెడుతాడు రచయిత.

ఈ నాటికలో చర్చించిన ప్రధాన సమస్యలు అవినీతి, ఆకలిచావులు. ఇవి ప్రాంతీయ సమస్య మాత్రమే కాదు ఇది నేటికీ అంతర్జాతీయ సమస్య. నేడు ప్రపంచవ్యాప్తంగా వర్తమాన పేద దేశాల్లో రోజుకు 25 వేల ఆకలి చావులున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ జనాభాలో దాదాపుగా తొమ్మిది శాతం ఖాళీ కడుపుతో పడుకుంటున్నారు. మనిషిని రోగంకంటే ఎక్కువగా బాధించేది ఆకలి.

రోగానికి మందు ఉంటుంది, కానీ ఆకలికి మందు లేదు. ఆహారమే దానికి విరుగుడు. సామాజిక చలనానికి, నిర్మాణానికి, ఉత్పత్తికి ఆధారం శ్రామిక శక్తి. శ్రామిక వర్గాలు నెత్తురును చెమటగా చేసుకొని ఉత్పత్తిని చేస్తే, దానిని కూడబెట్టిన వర్గం ధనిక వర్గంగా మారి అదే శ్రామికుడిని పీడిస్తుంది. రైతు కండలను కరిగించి పండించిన పంట చివరికి వారి నోటికాడికి చేరకపోవడం, చేతికందిన ముద్ద నోటికి రాకముందే ఆధిపత్య మార్కెట్ శక్తులు లాగేసుకోవడం, బ్లాక్ మార్కెట్ దందావంటివి సామాజిక అసమానతలకు ప్రధాన హేతువులు. ఇవన్నీ ప్రతీకాత్మకంగా ఈ నాటికలో ఆత్రేయ చర్చించాడు. ఈ నాటికలో "మనిషిని ఆకలి కబళిస్తే, అవినీతి జాడ్యం వ్యవస్థను కబళించడం' మరో ఆలోచనాత్మక ముగింపు. ఆహార కరువు సమయంలో ప్రజలకు బరువుగా మారిన వ్యవస్థీకృత అవినీతి జాడ్యాన్ని నిర్మూలించాలనుకున్న పోలీసు ఇన్స్పెక్టరును చౌదరి రాజకీయ నాయకుని అండతో బదిలీ చేయించడం, నిజాయితీ అధికారుల "ముందరి కాళ్ళకు బంధం వేయడమే". అవినీతి, కరువు ఆనాటి సామాజిక గడ్డు సమస్యలు. ఆరోజుల్లో సంఘ సంస్కారానికి నాటకాలు మంచి సాధనాలుగా ఆత్రేయ గుర్తించాడు. అందుకే తొలుత అటువైపు ప్రయాణించాడు.

ఈ నాటిక దొంగ ప్రస్తావనతో ప్రారంభమై దొంగ ఆత్మహత్యతో ముగుస్తుంది. దొంగ చనిపోయినా దొంగతనం జరుగుతూనే ఉంటుంది. అంటే నిజమైన దొంగలు వేరే ఉన్నారని, వారు ఎవరో ప్రేక్షకుడు సులువుగా గ్రహించే విధంగా నాటికను మలిచాడు. నాటికలో దొంగతనాన్ని కూడా పెద్దల తరహా, పేదల తరహా అని వర్గీకరిస్తాడు. దొంగ, దొంగ కుటుంబానిది ఆత్మహత్య కాదు. ఒక పథకం ప్రకారం వ్యవస్థ చేసిన హత్యలుగా అర్థమవుతుంది. వ్యవస్థలో భాగస్వామ్యమైన ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు ప్రధాన నేరస్థులు. వారిని గుర్తించి శిక్షించకుండా ఉపేక్షించిన రాజ్యం మరో ముద్దాయిగా ప్రేక్షకుని మదిబోనులో నిలబెడుతుంది.

కథలో కథానాయకుడు ఆకలే. ప్రతి నాయకుడు స్వార్థం, లంచగొండితనం, అవినీతి, బంధుప్రీతి వంటివి. చివరికి ఆకలి ఓడిపోతుంది. స్వార్థమే గెలుస్తుంది. అన్ని కథల్లోలా కాకుండా నిజ జీవితంలోలా కథను నడిపించాడు అనడానికి ఇది ఒక ఉదాహరణ. వ్యవస్థను మార్చాలని చివరివరకు ఆత్మవిశ్వాసంతో ప్రయత్నం చేసిన పోలీసాఫీసరు చేతులెత్తేసి నిస్సహాయతను వ్యక్తం చేయడం వ్యవస్థ వైఫల్యంగా

ప్రేక్షకున్ని నిరుత్సాహపరిచినా, దానిని ఆనాటి వాస్తవికతకు నిదర్శనంగా చెప్పొచ్చు. నాటిక ప్రారంభంలో 'దొంగ ఎక్కడ?' అన్న ప్రశ్నకు సమాధానంగా ప్రేక్షకులనుండి తెలుగు, తమిళం, ఆంగ్లంలో జవాబు చెబుతారు. అవినీతికి ఎల్లలు లేవని చెప్పడానికి ఆత్రేయ ఈ నాటకంలో వివిధ భాషలలో సమాధానం చెప్పించాడు కావొచ్చు. ఒకచోట "నాటకాలు జీవితాలను మార్చవు" అని అంటూనే 'నిజమే! నాటకం కంటే జీవితం గొప్పది' అని ఇన్స్పెక్టరు పాత్ర ద్వారా చెప్పిస్తాడు. ఇలాంటి చురుక్కుమనిపించే సంభాషణలు నాటికలో అక్కడక్కడా ఉంటాయి. నాటకంలో దొంగతనం చేయించింది ఆకలి. అన్నాన్ని దొంగిలించిన దొంగది న్యాయమా? అన్యాయమా? అనే విషయాన్ని పక్కనబెడితే, కడుపు నిండిన వాడు ఖాళీ కడుపులను దోచుకోవడాన్ని చూసినపుడు కడుపు మండిపోతుంది. దొంగ చేసిన ఆహార చౌర్యం విధిలేక చేసిన ప్రయత్నం. సమాజంలో పట్టుబడని దొంగలు చేసే దొంగతనం కావాలని చేసే నిత్యకృత్యం. "దొంగ ఎవరు" అన్న ప్రశ్నకు ఒకచోట ఆత్రేయనే ఒక పాత్ర చేత ఇలా సమాధానం చెప్పిస్తాడు. 'దొంగ ముఖం తెలియదు. కానీ అతను ముష్టివాడులా చిరిగిన చొక్కా చింపిరి తలతో పొట్టిగా ఉంటాడు." అని పాత్రలచే అన్పిస్తాడు. సమాజంలో అన్నీ సమృద్ధిగా ఉన్నా ముష్టితనం చూపే అవినీతి అధికారులు, పేదలను పీడించే దళారులు, వ్యాపారులు ఆ 'కురూపు దొంగలని' మనం ఇట్టే గ్రహిస్తాం. సమాజంలో గుప్పెడు మంది తమ ప్రయోజనాలకోసం మిగిలిన మెజారిటీ సమాజాన్ని ఏ విధంగా క్షోభకు గురి చేస్తారో ఈ నాటిక స్పష్టపరుస్తుంది.

ఈ నాటిక చదివినపుడు నాటికలో పేర్కొన్న పరిమిత పాత్రలు మన మెదడులో శాశ్వతంగా నిలిచిపోతాయి. పాత్రల మధ్య నెలకొన్న ఘర్షణ మన మెదడు పొరలలో సంఘర్షణ పడతాయి. ఆచార్య ఆత్రేయ కాలంతో బాటు నడిచి, కలకాలం నిలిచిపోయే నాటికను రాశాడు. ఆయన వాక్యాలలో ఆలోచనాత్మక సందేశం ఉంటుంది. దొంగ, పోలీసు ఇన్స్పెక్టరు, కానిస్టేబుల్, పత్రికా విలేఖరి, ఎమ్మెల్యే పాత్రలకు పేర్లను సూచించలేదు. కారణం ఆకలిలాగే సార్వజనీన వ్యక్తులకు, చలనశీలా సమాజానికి మంచి, చెడులకు వారు ప్రతినిధులు.

బాపుజీని చంపిన ఈదేశంలో ఆయన చనిపోయిన రోజు ఆయన పేరుతో ఏర్పాటు చేసుకున్న రైస్ మిల్లు యజమాని అక్రమాలు తినే తిండిలో రాళ్ళు కలపడం,

నల్లబజారును ప్రోత్సహించడం, ఉన్నతాధికారులకు లంచాలిచ్చి సామాజికహితాన్ని ఖూనీ చేయడాన్ని నాటికలో బాగా చూపారు. పోలీసుస్టేషనులో ఉన్న ఇద్దరు ఖైదీలు బయట బతకడంకంటే జైలు క్షేమమని తలవడం, 'ఎర్ర కండువా మీదేసుకుంటే చాలు అరెస్టు చేస్తారని' ఆనాటి కమ్యూనిస్టు పోరాటాన్ని, ప్రభుత్వం కమ్యూనిస్టులను చూసే దృష్టిని సులభంగా గ్రహించేటట్టు రాశాడు. పోలీసు స్టేషన్ జైలులో ఉన్న ఖైదీలు "దొంగలెవరో.. దొరలెవరో తెల్చుకోవోయ్ బ్రహ్మయ్య" అని పాడుతూ మనకు సవాల్ విసురురుతారు. "ఇంగ్లీషు వారుండగా చావడానికి స్వాతంత్ర్యం లేదండీ." అని డాక్టరు పాత్రంటే, "స్వాతంత్ర్యం వచ్చింది ఆత్మహత్య చేసుకోడానికా?" అని సబ్ ఇన్స్పెక్టరు పాత్రతో ప్రశ్నిస్తాడు. డాక్టరు 'ఏ ఎమ్మెల్యే బావిలోనో పడితే ఫలితముండేది కదా"అంటే, "తీసేవాళ్ళు లేక చచ్చేది" అంటాడు ఇన్స్పెక్టర్. అంటే నాటి ప్రజా ప్రతినిధులు కూడా ప్రజల పక్షం కాకుండా సంపన్నుల వైపు ఉన్నారని మనకు అర్థమవుతుంది.

సమాజం పట్ల కర్కశంగా ప్రవర్తిస్తారనే అపోహ పోలీసు పట్ల ఉంటుంది. కానీ ఈ నాటికలో ఇన్స్పెక్టర్ పాత్ర కరుణ రసార్ద్రంగా అభ్యుదయ దృష్టితో ప్రవర్తిస్తుంది. ఒక చోట గ్రామపెద్ద మునసబు పాత్ర ఇలా అంటుంది. "నూటికి యాభై చావులు అన్నం లేకనే" అంటాడు. ఈ వాక్యం నాటి సామాజిక దుస్థితిని తెలుపుతుంది. పత్రికా విలేఖరి ప్రశ్నకు జవాబుగా "ప్రభుత్వ ఉద్యోగులైతే నిజం మాట్లాడకూడదంటారా?" అని ఇన్స్పెక్టరు పాత్ర చేత అడిగిస్తాడు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేఖంగా మాట్లాడకూడదనే 'కోడ్ ఆఫ్ కండక్ట్' (ప్రభుత్వ ఉద్యోగుల నియమావళి)ని ప్రశ్నిస్తాడు. ప్రభుత్వ ఉద్యోగికి కూడా వాక్ స్వాతంత్ర్యం ఉంటుంది. దానిని ప్రభుత్వం లాక్కోన్నదని గుర్తుజేస్తాడు. ప్రభుత్వ ఉద్యోగులలో ఒక లంచగొండి ఉద్యోగి డి.ఎస్.వో ను ఒకవైపు చూపిస్తూ, మరోవైపు నిజాయితీ పోలీసాఫీసరు పాత్రను ఉన్నతంగా చూపాడు. గ్రామ మునసబు నిజాయితీని "నిజం మాట్లాడడమే ఒక విద్వాంసకర చర్య" అంటుంది పత్రికా విలేఖరి పాత్ర. అంతిమంగా ఏ సమాజమైన వ్యక్తులు బాగుంటే సమాజం బాగుంటుందని చెబుతూ "మనం బాగుంటే గవర్నమెంటు బాగుంటుంది." అన్పిస్తాడు. 'ఎవరు దొంగ' నాటికలో దొంగగా అభియోగం మోపబడ్డ కుటుంబప్రాణాలు తోడేసిన తోడేళ్ళు చివరికి దొంగలుగా మిగిలిపోతారు. సమాజంలో

దొరలుగా చెలామణి అవుతున్న అనేక మంది దొంగల నిజస్వరూపాన్ని ఈ నాటికలో పట్టి చూపాడు.

ఆత్రేయ నాటిక రచయిత మాత్రమే కాదు. మంచి నటుడు. పాత్రకు అవసరమయ్యే హావభావాలను పలికించే సంభాషణలు, వీటికి తగ్గట్టుగా ఒదిగిపోయే పాత్రలు, నిజజీవితానికి దగ్గరగా ఉండే సామాజిక పరిస్థితులను సజీవత్వాన్ని అక్షరాలలోకి ఒలికించాడు. గుడివాడ నుండి 'ప్రభాకర నాట్యమండలి' వారిచే ఈ నాటిక ప్రదర్శించబడి, తెనాలి పరిషత్ వారి ప్రథమ బహుమతి అందుకున్న ఈ నాటికలోని ఇతివృత్తం ఎప్పటికీ ప్రాసంగికతను కలిగి ఉంటుంది. ఆత్రేయ సాహిత్యంపై పరిశోధన చేసి, డాక్టరేట్ పొంది, వారిపై విస్తృతంగా సదస్సులను నిర్వహిస్తూ, ఆత్రేయ సాహిత్యంపై విలువైన వ్యాస సంకలనాన్ని తీసుకువస్తున్న ఈ పుస్తక ప్రధాన సంపాదకులు డా. తండు కృష్ణకౌండిన్యగారికి హృదయపూర్వక శుభాకాంక్షలు.

– అక్షర యోగి ఆచార్య ఆత్రేయ వ్యాస సంకలనం, 2022

తెలుగు నాటక రంగానికి వెలుగుదీపం...
కోదాటి లక్ష్మీ నరసింహరావు

కోదాటి లక్ష్మీ నరసింహరావు సూర్యాపేట జిల్లా, మునగాల మండలం, రేపాల గ్రామంలో కోదాటి లక్ష్మీ నరసింహరావు, వెంకటరామ నరసమ్మ దంపతులకు 23 అక్టోబరు 1924 లో జన్మించాడు. మెట్రిక్యులేషన్ వరకు చదువుకున్నాడు. రేడియో ఆర్టిస్టుగా ఆకాశవాణిలో ఉద్యోగంచేస్తూ సామాజిక చైతన్యభరిత అంశాలపై రేడియోలో అనేక కార్యక్రమాలు చేబట్టాడు.

కె.యల్ నరసింహారావు తెలంగాణ తొలి తరం నాటక రచయిత. తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత. ఆయన స్వయంగా నటుడు, దర్శకుడు, రేడియో ఆర్టిస్టు, జర్నలిస్టు. పరగణా జమిందారు పీడనకు, వెట్టికి వ్యతిరేకంగా నాటకం ప్రదర్శించి ఉద్యమించిన ప్రజా ఉద్యమకారుడు. సామాజిక సంస్కర్త, యావదాస్తిని కళారంగానికి ధారాదత్తం చేసిన సాహితీ ప్రయోగశీలి. సామాజిక ప్రయోజనకారి.

కె.యల్ నరసింహారావు దాదాపుగా యాభైకి పైగా నాటకాలు రచించారు. వీటిని **'గ్రామ వెలుగు నాట్య మండలి'** ప్రదర్శించింది. వారు 1946 వ సంవత్సరంలో రేపాల గ్రామంలో మిత్రులతో కలిసి "గ్రామ వెలుగు నాట్య మండలి"ని స్థాపించాడు. కె.యల్ నరసింహారావు మొదట కమ్యూనిస్ట్ ప్రభావానికి ఆకర్షితుడై, వెట్టిచాకిరీని నిరసిస్తూ 1945లో "విప్లవ చరిత్రము" అనే నాటకం రచించాడు. ఆ నాటకం ద్వారా ప్రేరణ పొందిన ప్రజలు వెట్టి నుండి బయటపడడానికి ఉద్యమించి సఫలం చెందారు. ఆ సందర్భంగా వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. దాంతో ఆయనకు నాటక ప్రక్రియ గొప్పదనం పూర్తిగా అవగతమయ్యింది. ఆరోజుల్లో ఎక్కువమంది ప్రజలు నిరక్షరాస్యులుగా ఉండేవారు. గ్రంథాలయోద్యమం చదువుకున్న వాళ్లలో చైతన్యాన్ని తేవడానికి తోడ్పడితే, నిరక్షరాస్యులకు నాటకం ఉపయోగపడుతుందని గ్రహించాడు. నిజాం నిరంకుశ పాలన నుండి ప్రజలు విముక్తి చెంది భారత యూనియన్‌లో విలీనం కావాలని **'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం'** నాటకం రాశాడు. ఆ కాలంలో సంఘం యొక్క హింసా ప్రవృత్తి హద్దు మీరింది. దానిని ఖండిస్తూ, జనతా కళామండలి, సూర్యాపేట వారి ఆధ్వర్యంలో **"గెలుపు నీదే"**

నాటకం(1946) రాశాడు. ఈ నాటకం తెలంగాణ అంతటా ప్రదర్శించి, నాటి జనరల్ జె.యన్. చౌదరి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. దాదాపుగా ఇది వెయ్యికిపైగా ప్రదర్శనలు జరిగింది అంటే అది మామూలు విషయం కాదు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆత్మీయులు హత్యగావింపబడడం వారిని తీవ్రంగా ప్రభావితం చేసింది. అహింసను కోరుకునే గాంధేయవాదిగా మార్చింది. గాంధేయవాదం గొప్పదనంపై **"ఆదర్శ లోకాలు"** నాటకం రాశాడు. అందుకే ప్రజలు వీరిని **'తెలంగాణ నాటకాల గాంధీ'** అని పిలుచుకుంటారు.

కె.యల్ నరసింహారావులో స్వీయభక్తి కంటే దేశభక్తి, గ్రామభక్తి అధికం. చైనా దురాక్రమణ నేపథ్యంలో కె.యల్ రాసిన **"అగ్ని పరీక్ష"** నాటకాన్ని మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు రేపాల గ్రామానికి వచ్చి, ప్రేక్షకుల మధ్య నేలమీద కూర్చొని తిలకించారు. నాగార్జున సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టును నెహ్రూ 'ఆధునిక దేవాలయం' అన్నాడు. ఆ మాట ప్రేరణగా **"కొత్త గుడి"** (1957) నాటకాన్ని రాసి ప్రదర్శించాడు. కె.యల్. ఏది రాసినా భాధ్యతగల రచనలే రాశాడు. కె.యల్ నరసింహారావు హింసకు వ్యతిరేకి. శాంతికాముకుడు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నక్సలిజం సమస్య తీవ్రంగా ఉండేది. నాటి ఆంధ్రప్రదేశ్ డిజిపి హెచ్.జే దొర కోరిక మేరకు **"భారత నాటకం"** రాశాడు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించబడి ఆదరణ పొందింది. నక్సలిజం సమస్య తీవ్రత తగ్గించడంలో ఆ నాటకం తోడ్పడింది. **"పాప ఫలం"** అనేది పాకిస్తాన్ యుద్ధ పరిస్థితి వివరించిన నాటకం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను నిరక్ష్యరాస్యుల దగ్గరికి చేర్చడానికి కె.యల్ నాటకాలు ఒక సాధనంగా ఉపయోగపడేవి. బ్యాంకుల జాతీయీకరణ సమర్ధిస్తూ **"ప్రజాధనం నాటకం "**, భూ సంస్కరణల ఆవశ్యకతపై **'దీపాన్ని వెలిగించు, చీకటిని తిట్టకు',** కుటుంబ సంక్షేమ పథకాల ఆవశ్యకతపై **'అక్బర్'** వంటివి రాసి ప్రదర్శించాడు.

సామాజిక సమస్యలే ప్రధానంగా వారి నాటక రచన, ప్రదర్శన ఉండేది. అధికారుల అవినీతి, లంచగొండితనం నేపథ్యంలో వచ్చిన ప్రఖ్యాత నాటకం **"కొడిగడుతున్న దీపాలు".** దేశ ప్రణాళికలు వాటి ఔన్నత్యాన్ని వివరిస్తూ **"అడుగు జాడలు"**(1956), మనిషి నాశనానికి స్వార్థమే కారణభూతమని **"స్వార్థం, అభాగ్యులు"** అనే నాటకం రాశాడు. ఇలా ఆయన రాసిన ఏ నాటికైనా సమాజానికి

ఉపయోగపడేదిగా ఉండేది.

కె.యల్. పత్రికారంగంలో కూడా ప్రవేశం ఉంది. మంచి వ్యాసకర్త. ఆరోజుల్లో 'ప్రగతి, ప్రజావాణి' పత్రికలకు మాజీ ప్రధాని పివి నరసింహారావు సంపాదకుడుగా పనిజేసేవాడు. కె.యల్ ప్రతిభను గుర్తించిన పివి ఆయనకు సహా సంపాదక బాధ్యతలను అప్పగించగా కె.యల్. సమర్ధంగా పాత్రను పోషించాడు. ఆ పత్రికలో కె.యల్. 'భవదీయుడు', 'కొలను కలం' అనే పేర్లతో అనేక వ్యాసాలను రాశాడు. కె.యల్. గోరా శాస్త్రి సంపాదకత్వంలో వెలువడే తెలుగు స్వతంత్ర్య పత్రికలో కె.యల్ రాసిన "తెలంగాణ తీరు తెన్నులు" వ్యాసాలను ధారావాహికగా ప్రచురించారు. ఇది ఆయన తొలి రచన. ఈ వ్యాసాలు అక్షరాస్యులను చైతన్య పరిచాయి. నిరక్షరాస్యులను జాగృతం చేయడానికి పల్లె ప్రజానీకాన్ని ఉత్తేజం చేయడానికి ఆనాటి సామాజిక దురాచారాలను అరికట్టడానికి, సంఘ సంస్కరణ, దేశాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు కింది స్థాయికి అందడానికి నాటకం సరైన ప్రక్రియని కె.యల్ భావించాడు. అందుకే ఆయన నాటక రచనకే మొగ్గు చూపాడు. రేపాల గ్రామాభివృద్ధికి ఆకాశవాణి రేడియోలో ఉద్యోగం మానుకొని కృషిచేశాడు. అక్కడ ప్రతియేటా వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్విహించేవాడు.

నాటకం ఆయన ఊపిరి. కళ ఆయన జీవితం. దీని కొరకు అనేక పర్యాయాలు స్వంత ఖర్చులతో రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి, గ్రామ నాటక పోటీలను నిర్వహించాడు. అక్కినేని నాగేశ్వరరావు, నాగ భూషణం, గుమ్మడి, ఆదుర్తి సుబ్బారావు, ఎ.ఆర్ కృష్ణ లాంటి సినీ దిగ్గజాలతో బాటు, పివి లాంటి రాజకీయ దిగ్గజాలను సైతం రప్పించాడు. అతిథులకు, నటులకు సన్మానాలు, సత్కారాలు, పారితోషికాలు, బస, ఆతిథ్యం భరించడం అంత సులువుకాదు. తనకున్న రెండు వందల ఎకరాల యావదాస్తిని నాటక కళ కోసం, ప్రజా చైతన్యం కోసం వెచ్చించాడు. ఆయన నాటకం చూడడానికి వేలాదిగా జనం ఎడ్ల బండ్లు కట్టుకొని వచ్చి మరీ నాటకాన్ని చూసేవారని రేపాల గ్రామస్థులు ఇప్పటికీ కథలు కథలుగా చెబుతారు. ఆయన సంపాదించుకున్న విలువైన ఆస్తి అదే. తెలంగాణ నాటకరంగానికి ఆయన బొడ్రాయి. జనం గుండెల్లో ఎప్పటికీ కొడిగట్టని దీపం.

– తంగేడు పక్షపత్రిక, డిశంబరు 2023

బహుముఖ సృజనకు చిరునామా
డాక్టర్ యల్. లేఖానంద స్వామి

ఆయన అడుగుపెట్టిన చోట నవ్వులు విరబూస్తాయి. ఆయన గొంతెత్తితే కోయిలలు చిన్నబోతాయి. ఆయన నటనకు కళామతల్లి పరవశిస్తుంది. వేలాది శిష్యుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న డా. లింగనబోయిన లేఖానంద స్వామి బహుముఖ ప్రజ్ఞాశాలి. వీరు లింగనబోయిన ఆదెమ్మ, జగన్నాథం దంపతులకు 16 జనవరి 1957లో ప్రస్తుత సూర్యాపేట జిల్లా, హుజూర్ నగర్ తాలూకా, అప్పన్నపేట గ్రామంలో జన్మించాడు. వారి తల్లిదండ్రులది ఆదర్శ వివాహం. తల్లి ఆదెమ్మ బాలవితంతువు. తండ్రి జగన్నాథం కన్నా వయసులో స్వల్పంగా పెద్దది. అయినప్పటికీ వారి నాన్నగారు ఆమెను ఆ రోజుల్లో వివాహం చేసుకోవడం పెద్ద సాహసమని లేఖానంద స్వామి చెప్పేవారు. చిన్నప్పుడే తల్లి దూరమైన లేఖానంద స్వామి తన తల్లి, తండ్రి ప్రేమ వివాహాన్ని **"కుంకుడు ముండ"** (బాల వితంతువును ఆ రోజుల్లో అలా పిలిచేవారు) అనే పేరుతో చక్కని కథను రాశారు.

లేఖానంద స్వామి నాన్నగారు జగన్నాథం ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఇద్దరు అన్నయ్యలు, అక్కయ్యలు తరువాత పుట్టిన లేఖానంద స్వామి విద్యార్థి దశలోనే కోదాడ ప్రభుత్వ కళాశాలలో ఎన్.ఎస్.యూ.ఐ. విద్యార్థి సంఘ నేతగా చురుగ్గా పనిచేశారు. చదువుకునే రోజుల్లో సాహిత్య అకాడమి పూర్వ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ ఆయన సహాధ్యాయి. లేఖానంద స్వామి వ్యక్తిగా సౌమ్యుడు. మృదుభాషి, స్నేహశీలి, ఆదర్శాలు, నిజాయితీ కలిగిన నిరాడంబరుడు.

చదువు విషయంలో ఆయన చాలా మొండి మనిషి. ఉన్నత విద్యావంతుడు. నిరంతర పఠన, అధ్యయన శీలి. రిటైర్డ్ అయిన తరువాత ఎం.ఈ.డి., ఎం.ఎ. తెలుగు, ఎం.ఎ. సైకాలజీ పూర్తి చేశాడు. వృత్తిరిత్యా శ్రీ రాఘవేంద్ర బి.ఈడి

కళాశాలలో ప్రిన్సిపాల్‌గా, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మూడు దశాబ్దాలపాటు హిస్టరీ లెక్చరర్‌గా సుదీర్ఘ సేవలందించాడు. ఆయన శిష్యులు ఎందఱో ఆయన ఉపన్యాస శైలికి, ఆయన చూపే ఆత్మీయతకు అభిమానులుగా ఉన్నారు. ఆయన బోధనకు నూటికి నూరుపాళ్ళు న్యాయం చేశారు. దానితో పాటుగా "పిచ్చకుంట్ల సామాజిక జీవనం" పై పరిశోధన అనదగిన శ్రమను చేసి, ఎం.ఫిల్. సిద్ధాంత గ్రంథం పూర్తి చేశారు. చరిత్ర పరిశోధనపై గల మమకారం, నాటకరంగంతో ఉన్న పేగు బంధం ఆయనను యాభై ఐదు సంవత్సరాల వయసులో **"నల్లగొండ జిల్లా నాటక సమాజాలు–ఒక పరిశీలన"** అనే అంశంపై పరిశోధన చేసి, పి.హెచ్.డి. పట్టా పొందేలా చేసింది. ఈ గ్రంథం చాలా విలువైనది. తెలంగాణ నాటకరంగానికి మణిదీపం అనదగిన రేపాల వీరి సమీప గ్రామం. తెలంగాణ నాటక రంగానిది ఆంధ్రాప్రాంతంతో పోలిస్తే "సామాజిక రుగ్మతల పట్ల ప్రజలలో చైతన్యాన్ని రగల్చడమే కాదు, స్వేచ్ఛ, స్వాతంత్ర్య కాంక్షను రగిలించే భాధ్యతను" కూడా ఎత్తుకుంది. ఈ పరిశోధన ద్వారా ఆ రోజుల్లో నిస్వార్ధంగా ఆస్తులను అమ్ముకుని మరీ గ్రామగ్రామనికి తిరిగి ప్రజాచైతన్యం తేవడానికి కృషిచేసిన మహనీయులను వెలుగులోకి తెచ్చారు. స్వయంగా ఆయన చక్కని నటుడు. ఆయన తన తల్లిదండ్రుల పేరుమీద "లింగనబోయిన ఆదెమ్మ, జగన్నాథం సాంస్కృతిక, సామాజిక సంస్థ" నాటక సంస్థను ఏర్పాటు చేసి దానిద్వారా జాతీయ స్థాయిలో మైసూరు, చత్తీస్ ఘడ్ లాంటి ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇవ్వడమే కాదు అవార్డులను కూడా పొందడం జరిగింది. ప్రముఖ గాయకుడు, రచయిత, సామాజిక ఉద్యమకారుడు అంబటి వెంకన్న, రచయిత శీలం భద్రయ్య లాంటివారిని ఎందఱో ఈయన ద్వారా నాటక రంగానికి పరిచయం అయ్యారు. "కోమలి కళా సమితి" నల్లగొండ సంస్థ ఆయనకు మాతృసంస్థ. ఆ సంస్థ ఒకరకంగా ఆయన కుటుంబం. బక్కా పిచ్చయ్య, పోషం రఘుపతి, యం.యల్ రావు, ఎల్లయ్య, భాస్కర్, ప్రముఖ దర్శకుడు గోవాడ వెంకట్ ...తదితరులు ఎందఱో ఆయన ఆత్మ బంధువులు.

ఆయన నటించిన అనేక పౌరాణిక, సాంఘిక, జానపద, చారిత్రాత్మక నాటికలు, నాటకాలలో ఆయన పాత్రకు జనం నీరాజనాలు పట్టారు. ఆయన నటించిన నాటకాలలో "మాయాబజార్ (పౌరాణికం), శ్రీకృష్ణ రాయబారం

(పౌరాణికం), రామాంజనేయ యుద్ధం (పౌరాణికం), భక్త ప్రహ్లాద (పౌరాణికం), నలదమయంతి (పౌరాణికం), ఉషా పరిణయం (పౌరాణికం), సత్య హరిశ్చంద్ర (పౌరాణికం), మశ్చకటికం (చారిత్రాత్మకం), గౌడపురాణం (జానపదం), వీర బ్రహ్మేంద్ర స్వామి చరిత్ర (జానపదం, చారిత్రాత్మకం), బాలనాగమ్మ నాటకం (జానపదం), లక్ష్మీ తిరుపతమ్మ తల్లి చరిత్ర (జానపదం), ఆత్మగీతం (సాంఘికం), ఓటున్న ప్రజలకు కోటి దండాలు (సాంఘికం), కన్నీటి కడలి (సాంఘికం), అహం బ్రహ్మ (సాంఘికం), సమాధి కడుతున్నాం చందాలివ్వండి(సాంఘికం), అసలు నేను (సాంఘికం), సరిహద్దు(సాంఘికం), హుష్ కాకి (సాంఘికం), శాంతి స్థాపనం(చారిత్రకం), కోహినూర్(సాంఘికం), నైవేద్యం (సాంఘికం), అన్నట్టు మనం మనుషులం కదూ! (సాంఘికం) వంటి నాటకాలు ఒక్కొక్కటి పదుల సంఖ్యలో జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో, వివిధ నాటక పోటీలలో పాల్గొని ప్రదర్శించారు. వీరు నటించిన "ఆత్మగీతం" నాటికకు ఏడు నందులు లభించాయి. ఉత్తమ నటనకుగానూ "కోహినూర్" అనే నాటికకు 2006లో 'జాతీయ ఉత్తమనటుడు' అవార్డు, ఒరిస్సా రాష్ట్రం కటక్లో ప్రదర్శించిన "హుష్ కాకి" నాటికకు "నటభూషణ్" అవార్డు, "నైవేద్యం" అనే నాటికకు **జాతీయ ఉత్తమ ప్రదర్శన జ్యూరీ అవార్డు** లభించింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో కోమలి కళా సమితి సభ్యుడుగా, ఉత్తమ నటుడుగా ఆయన అందుకున్న బహుమతులకు ఆయన ఇల్లు సరిపోదంటే అతిశయోక్తి కాదు. అది నేను కళ్ళారా చూసిన. "రెడ్ లిస్టు" అనే సినిమాలో నటించారు.

ఆయన అధ్యాపక వృత్తిని, ఒక కొడుకు, ఒక కూతురుతో బాటు కేన్సర్తో బాధ పడుతున్న అర్ధాంగిని చివరిదాకా కళ్ళల్లో పెట్టుకుని కాపాడుకుంటూ, కుటుంబ బాధ్యతలను మోస్తూ కేవలం నటుడిగా మాత్రమే పేరుతెచ్చుకున్నారని చెబితే అన్యాయమవుతుంది. ఆయన ఇంకా బహుజన సామాజిక ఉద్యమకారుడు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ముదిరాజు ఉద్యోగుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా చాలా కాలం పనిజేసి, ముదిరాజు వృత్తికారులను ఆదుకున్నారు. ఆయన గొప్ప గేయ, పద్య రచయిత. కథా రచయిత. నాటక రచయిత. గాయకుడు. వేముల ఎల్లయ్య, సాగర్ల సత్తయ్య, శీలం భద్రయ్య, పెరుమాండ్ల ఆనంద్, చిలివేరు లింగమూర్తి, మాదగాని శంకరయ్య, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, మునాసు వెంకట్,

బెల్లి యాదయ్య, బైరెడ్డి కృష్ణారెడ్డి, డా. తండు కృష్ణ కౌండిన్య, మేరెడ్డి యాదగిరి రెడ్డి, బోధనం నర్సిరెడ్డి, స్కై బాబా, బండారు శంకర్, పున్నమి అంజయ్య, కూరెళ్ళ పద్మాచారి, దాసు జ్ఞానేశ్వర్ వంటి సాహిత్య స్నేహితులు ఆయనకు అత్యంత ఆత్మీయులు. ఆయన రాసిన "పట్వారి"(1975) నాటిక నాటి పట్వారీ వ్యవస్థపై వ్యంగ్యంగా ప్రభావాత్మక రాసిన నాటిక. దీనితో బాటు "క్షమిత"(సాంఘిక) నాటిక మరొక ప్రసిద్ధమైంది. **"తొలగిన తెరలు"** సాంఘిక నాటకాన్ని రచించారు. సుమారు వందకుపైగా జానపద గేయాలు, భక్తి పాటలు, చైతన్య గీతాలు రాసి, రికార్డు చేశాడు. "మా పల్లె", "జయహో రాఘవేంద్ర", "జయహో ముదిరాజ్", దీన బంధు", భక్తి గీతాలు", "అక్షర జ్యోతి", జయహో రమణన్న", "మహా మనిషి మల్లన్న" వంటి గేయాలు రాశాడు. వలిగొండలో జరిగిన రైలు ప్రమాద దుర్ఘటన గురించి రాసిన గీతం చాలా మందిని కదిలించింది. ఆ గేయానికి మెచ్చిన నాటి కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ గీత రచయితగా అవార్డును అందుకున్నాడు.

ఆయన మంచి పద్య రచయిత, దాశరథి శైలిలో ఆయన పద్యాలు ఉంటాయి. దాదాపుగా వెయ్యి పద్యాలు రాశాడు. అందులో ఐదు వందల పద్యాల వరకు "ఊట" పేరుతో పుస్తకాన్ని వెలువరించాడు. ఈ రచనకు ప్రసిద్ధ పద్యకవులు, ఉత్తమ విమర్శకుడుగా జాతీయ అవార్డు గ్రహీత ముడుంబై పురుషోత్తమాచార్యులు, వేణు సంకోజు లాంటి సాహిత్యకారుల ప్రశంసలు అందుకున్నారు.

తెరపై నటుడుగా, జీవిత తెరపై అధ్యాపకుడుగా, పరిశోధకుడుగా, చరిత్ర, నాటకరంగం, సాహిత్యం, సామాజిక, సంగీత రంగాలలో అవిశ్రాంతంగా కృషిచేశారు. రచయితగా గేయం, గీతం, కథ, నాటిక, నాటకం, పద్యం వంటి అనేక ప్రక్రియలలో ప్రాబల్యత చూపారు. అయినా దేనికి ఆయన ఒకరి దగ్గర ఆశపడలేదు. గుండె బైపాస్ సర్జరీ తరువాత కూడా ఎంతో ధైర్యంతో జీవించిన ఆయన, తన జీవితాన్ని, చివరకు తన మరణాన్ని తనే నిశ్చయించుకున్నాడేమో అనిపించేలా 19 జనవరి 2024న హఠాత్తుగా గుండెపోటుతో మరణించారు. లేఖానంద స్వామి భౌతికంగా లేకపోవడం తెలుగు సాహిత్య కళా రంగాలకు తీరని లోటు అయినా తెలుగు సాహిత్యం, తెలుగు నాటకం ఉన్నంతకాలం లేఖానంద స్వామి జీవించే ఉంటాడు.

–విశ్వంభర, 21 ఫిబ్రవరి 2025

భారతదేశ చరిత్రకు సమాంతరంగా నడిచిన తెలంగాణ చరిత్ర

75 వసంతాల వజ్రోత్సవాల సందర్భంగా.... హైదరాబాదు సంస్థానం భారతయూనియన్లో విలీనం చెందిన విధానంపై వచ్చిన రెండు విభిన్న కోణాల గ్రంథాలను తెలుగుపాఠకులకు పరిచయం చేయడానికి చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డిగారి అనువాద కృషిని అభినందించాల్సిందే. అవి:

1. హైదరాబాదు సంస్థానం చివరి ప్రధానమంత్రిగా పనిజేసిన మీర్ లాయక్ అలీ రాసిన "ట్రాజెడీ ఆఫ్ హైదరాబాదు" ను "హైదరాబాదు విషాదం"గా అనువదించాడు. ఇది హైదరాబాదు సంస్తానాధీశుల కోణాన్ని వివరిస్తుంది.

2. నాటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి, రాష్ట్రాల వ్యవహారాల శాఖ కేబినేట్ సెక్రెటరీ వి.పి. మీనన్ రాసిన *The story of the integretion of the Indian states* ను "అసఫ్ జాహీ సంస్థానం విలీన గాథ" రూపంలో తెలుగులోకి అనువదించాడు. ఇది అఖండ భారతావని ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తుంది.

బ్రిటీషు వారి 'విభజించు, పాలించు సిద్దాంతం', స్వీయపాలనపై పట్టును కోల్పోవడంలోనూ, స్వాతంత్ర్య ప్రకటన తరువాత దేశవిభజనలోనూ ముఖ్యపాత్ర పోషించింది. ఆధునిక భారతదేశచరిత్రలో హైదరాబాదు సంస్థాన విలీనానికి చాలా ప్రత్యేకత ఉంది. కారణం జాగ్రఫికల్ ప్రాధాన్యత అనేది అందరూ అంగీకరించేదే. పోరాడి ఓడితే గౌరవంగా ఉంటుంది. పోరాటమే లేకుంటే జీవనమే లేదు. భౌతిక బలం కంటే శత్రువుల బుద్ధిబలం ముందు భారత సార్వభౌమత్వాన్ని కోల్పోవడానికి కారణం భారతీయ రాజుల మధ్య ఏర్పడిన అనైక్యత. విడిపోయి ఓడిపోయారు. తరువాత రాజ్యాలను కోల్పోయారు. ఇక్కడి రాజులు స్వప్రయోజనాలే లక్ష్యంగా తొలుత విదేశీవ్యాపారులకు సహకరించారు. క్రమంగా తమ వ్యక్తిత్వాలను, పాలనా ప్రాభవాన్ని, రాజ్యాలను, చివరికి ప్రాణాలను సైతం కోల్పోయారు. సరిహద్దు రాజులనుండి రక్షణ కొరకు వ్యాపారులకు సహకరించిన రాజులు, వ్యక్తిగత స్వార్ధంతో కాలక్రమేణా అదే వ్యాపారస్తుల ఉచ్చులోపడి ప్రజలను, పాలనను మరిచారు. రాజ్యంయొక్క సార్వభౌమత్వాన్ని తాకట్టుపెట్టారు. పాలన పగ్గాలను వారికి

అప్పగించారు. దానితో అప్పటిదాక రాజుల ఆశ్రయంపొందిన అనుచరులు నిరాశ్రయులైనారు. "రాజ్యసంక్రమణ సిద్ధాంతం" వలన రాజ్యాలు పోగొట్టుకున్న రాజులు, "రాజాశ్రయం పొందిన భంగపడ్డ సమూహాలు" నిరాశ్రయులైనారు. దాంతో "భారత స్వాతంత్ర్య తొలి సంగ్రామం" అనే 1857 పోరాటానికి నాంది పలికారు. ఈ పోరాటం తరువాత కాలంలో భారత స్వాతంత్ర్య పోరాటానికి అస్తిత్వ ఆత్మగౌరవ నినాదానికి పునాదిగా మారింది.

వి.పి. మీనన్ రాసిన "ద స్టోరీ ఆఫ్ ద ఇంటిగ్రేషన్ ఆఫ్ ద ఇండియన్ స్టేట్స్" ఆంగ్ల రచనను, డా. ఏనుగు నరసింహరెడ్డి "అసఫ్ జాహీ సంస్థానం విలీనగాథ" పేరుతో తెలుగు సేత చేశారు. అక్షరాలను కాకుండా చరిత్రను తేటగా, ఆసక్తిగా అనువదించాడు. అనువాదకుడు అనుసరించాల్సిన అన్ని ప్రమాణాలను డా. ఏనుగు నరసింహరెడ్డి పాటించాడు. చారిత్రక సత్యాన్ని, తెలంగాణ విలీనగాథను ఒక కథలా, నవలను చదువుతున్నట్టుగా సులభంగా అనువదించాడు. ఇది చదువుతున్నప్పుడు నాటి చరిత్ర కళ్ళముందు ఒక సినిమాలా కదుల్తుంది. డా. ఏనుగు నరసింహరెడ్డి ఈ పుస్తకాన్ని తెలుగు అనువాదం చేయడం ద్వారా ఈతరానికి గోరుముద్దలు పెట్టినట్టుగా హైదరాబాదు సంస్థానం విలీనగాథ చరిత్రను అందించాడని చెప్పొచ్చు.

"భారత స్వాతంత్ర్య తొలి సంగ్రామం" తరువాత భారతదేశంలో పాలనపై పట్టుకోసం బహుముఖ పోటీ ప్రారంభమైంది. ఒకవైపు కంపెనీ ప్రతినిధులు, ఇంకోవైపు రాచరిక వారసత్వం, మరోవైపు స్వీయపాలనకు ప్రజలు ప్రజాచైతన్య పోరాటం ప్రారంభించారు. సమాజం ఆధునికకాలానికి మారుతున్న ఈ సమయంలోనే ప్రజాచైతన్యాలకు, ఉద్యమాలకు సాహిత్యం, ఆంగ్లచదువు వేదికగా మారింది. దాంతో ఇక్కడి కంపెనీపాలనలో బ్రిటీషుప్రభుత్వం కలుగజేసుకుంది. భారతదేశంలో "బాధ్యతాయుత పాలన" ఏర్పాటు లక్ష్యంగా దశలవారీగా పాలనాసంస్కరణలు చేబట్టింది. "పెట్టుబడిదారీ ప్రైవేటుపాలన" నుండి "విదేశీ ప్రజాస్వామ్యం" ఆరంభమైనది. ఆధునిక కాలంలో ఆధునిక భావాలతో ప్రజలు ఉద్యమించి "రాచరికపాలన" నుండి విముక్తులవడం అంతిమవిజయంగా పేర్కొనవచ్చును. స్వాతంత్ర్య నిర్ణయంలో ఆఖరిదఫా చర్చలు విఫలం కావడంతో మౌంట్ బాటెన్

ప్రకటనలో "స్వాతంత్ర్యంతో బాటు దేశవిభజన" ప్రతిపాదన చేశారు. "విభజించు-పాలించు" సిద్ధాంతంతో ప్రారంభమైన "భారత ఉపఖండ పాలన" అదే ప్రతిపాదనతో అంతం కావడం గమనార్హం.

ఈ చరిత్ర చదువుతున్నప్పుడు నేటి "స్వదేశీ కార్పోరేట్ కంపెనీ" ఆధిపత్యానికి, ఎదుగుదలకు తోడ్పడుతున్న రాజకీయ ఆధిపత్య వ్యవస్థను గమనించినపుడు నాటి సంస్థానాల రాజులు విదేశీకంపెనీలకు అందించిన సహకారం సహజంగానే స్మరణకు వస్తుంది.

ఆశ్చర్యకరమైన విషయమేమంటే భారతదేశంలో స్వాతంత్ర్య ప్రకటన చేసేనాటికి పూర్తిగా రాచరికం లేకుండా పోలేదు. దీనికి బ్రిటీషు పాలనాపర వ్యూహాలు కారణం కావొచ్చు లేదా గులాముగా మారిన ఇక్కడి రాచరికపు విధానం కావొచ్చు. కారణాలేమున్నా దేశంలో అప్పటికీ ఇంకా రాచరికపుగుర్తులున్నాయి. అవి బ్రిటీష్ అధికారం కింద 550 సంస్థానాల రూపంలో సత్తువను, స్వీయవైభవాన్ని కోల్పోయి ఉన్నాయి. అయితే అవన్నీ సులభంగానే నాటి ప్రజాస్వామ్య కాంక్షలకు తలొగ్గి భారతయూనియన్లో విలీనం చెందాయి. కానీ "కాశ్మీర్, జూనాగడ్, హైదరాబాదు" సంస్థానాలు కలవలేదు. కొన్ని వ్యూహాలు, ప్రయత్నాల తరువాత కాశ్మీర్, జునాగడ్ సంస్థానాలు కూడా విలీనం చెందాయి. హైదరాబాదు సంస్థానం మాత్రం దారికి రాలేదు. కారణం చరిత్రకు అందని కారణం కావొచ్చు. లేకపోతే ఇక్కడి సంస్థానాధీశుడికి అజ్ఞాతంగా లభించిన బలమైన అండ కావొచ్చు. మొత్తంగా ఈ విషయం ఇక్కడి ప్రజల స్వేచ్ఛను, ప్రజాస్వామ్య కాంక్షలకు అడ్డంకిగానిలవడమే కాకుండా అఖండ భారతావని ఏర్పాటుకి విఘాతం కలిగించింది. ఇదీ స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్ళనాటికి స్థూలంగా లిఖితబద్ధం చేసిన భారతదేశ చరిత్ర.

ఈ చరిత్రను అధ్యయనం చేస్తేనే గాని నాటి హైదరాబాదు సంస్థానం పరిస్థితులు అంత సులభంగా మనకు అర్థమవవు. భారతదేశ చరిత్ర-హైదరాబాదు చరిత్రను సమాంతరంగా గమనిస్తే పోలికలు, బేధాలు చాలా ఉన్నాయి.

భారత దేశ ప్రజలకు రాచరిక పాలననుండి విముక్తి, "బాధ్యతాయుత పాలన" అనేవి ఆంగ్లేయుల ద్వారా లభించింది. హైదరాబాదు ప్రజలకు మాత్రం ఈ రెండూ.... నాటి నవ భారత యూనియన్ ప్రభుత్వం ద్వారా లభించింది. స్వదేశీ

రాజుల్లాగే నిజాంరాజులు కూడా వ్యక్తిగత స్వార్థం కొరకు, రాజ్యాన్ని కాపాడుకోవడం కోసం బ్రిటీషువాళ్ళ దగ్గర హైదరాబాదు సంస్థాన సార్వభౌమత్వాన్ని తాకట్టుబెట్టారు. ఎంతో వైభవాన్ని, చరిత్రను కలిగిన నిజాం రాజులు తుదకు పాలనలో పట్టును కోల్పోయారు. పాలనలో అనునాయులు, బంధువుల జోక్యంతో చివరికి చేతులెత్తారు. పాలకుడు, ప్రజలకు మధ్య పెద్ద అగాధం ఏర్పడింది. అనునాయులు పెట్టే రాజ్యహింసను ప్రజలు తట్టుకోలేకపోయారు. ప్రజలు తిరుగుబాటు బావుటాను ఎగురవేశారు. దాని ఫలితంగా పాలకునిలో, ప్రజలలో అసహనం మొదలైంది. సంస్థానంలో పుట్టిన ఈ అంతర్గత సంఘర్షణకు, పురోగామి శక్తులు తోడయ్యాయి. భారత యునియన్ లో హైదరాబాదు విలీనం దిశగా సులువైన అడుగులు పడ్డాయి. ఒకవైపు భారత ప్రభుత్వ ఏర్పాటుకు బ్రిటీషువారు అంగీకరిస్తూనే "సంస్థానాల విలీనం" విషయంలో "విలీనం స్వచ్ఛందం" అనే మెలిక పెట్టారు. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కూడా హైదరాబాదు సంస్థాన విలీనం అంగీకరిస్తూనే, మరొకవైపు "విలీనం స్వచ్ఛందం" అనే అవకాశాన్ని తెర మీదకు తెచ్చాడు.

ఇక్కడి పాలకులు తమ పాలనాపరంగా క్రమానుగత వైభవాన్ని కోల్పోతూ, చివరికాలంలో పాలనను ఈస్టిండియా కంపెనీ చేతులలో బెట్టారు. హైదరాబాదు సంస్థానంలో మాత్రం చివరి నిజాం రాజు ఖాసీంరజ్వీతో జతకట్టాడు. భారతదేశంలో రాజ్యాలు పోగొట్టుకున్న సంస్థానంలోని "నిరాశ్రయులు" 1857 తిరుగుబాటును చేసి కల్లోలం సృష్టించారు. హైదరాబాదు సంస్థానంలో కూడా ఆఖరు నిజాం ఆశ్రయం పొందిన ఖాసీంరజ్వీలాంటి సంపన్న ముస్లిం వర్గాలు ఇక్కడి అధికారంకోసం మారణహోమాన్ని సృష్టించాయి. దేశవిభజన సమయంలో ఇండియా పాక్ దేశాలుగా విడిపోతే "మతఘర్షణలు" తప్పవని మేధావులు హెచ్చరించారు. అది పాక్షికంగా మాత్రమే ఆ హెచ్చరికలు నిజమయినా, తరువాత కాలంలో మాత్రం దాయాది దేశాల మధ్య సరిహద్దు ఘర్షణలు మిగిలాయి. ఇక్కడ భారత యూనియన్లో హైదరాబాదు విలీనమయితే, ఇక్కడ కూడా మతఘర్షణలు తప్పవని అంతా భావించారు. దేశవిభజన ఫలితంగా అనేకచోట్ల మతకల్లోలాలు జరిగాయి.

హైదరాబాదు విలీనానికిముందే ఆధిపత్యం పోతుందని ఇక్కడ కూడా మతఘర్షణలు సృష్టించారు. భారతదేశం, పాకిస్తాన్ కలిసుంటే మతఘర్షణలు

ఎక్కువవుతాయని ఆనాడున్న కొంతమంది ప్రభావం చూపే నాయకులు హెచ్చరించారు. హైదరాబాదు సంస్థానం భారతయూనియన్లో విలీనమయితే మతఘర్షణలు ఎక్కువవుతాయని హైదరాబాదులో కొందరు నాయకులు హెచ్చరించారు.

"సామాన్య ప్రజల జీవితాలకు, స్వేచ్ఛకు భంగం వాటిల్లినపుడు మాత్రమే ఉద్యమాలు, పోరాటాలు పుడతాయని, మతం దీర్ఘకాల ఘర్షణను సృష్టించదని భారత స్వాతంత్ర్యం సిద్ధించిన సందర్భంలోనూ, హైదరాబాదు విలీన సమయంలోనూ ప్రజలు నిరూపించారు. సరిగ్గా ఇలాంటి చర్చ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర మలిదశ ఉద్యమ సమయంలోనూ ఇలాంటి అభిప్రాయాలే రావడం గమనార్హం."

నాటి ప్రజా, రాజకీయ చైతన్యాన్ని, ఆనాటి పరిస్థితులను అక్షరబద్ధం చేసిన వి.పి. మీనన్ "భారతదేశ సంస్థానాల విలీన కార్యదర్శిగా" ఉన్నతస్థాయి ప్రభుత్వాధికారిగా పనిచేశాడు. స్వాతంత్ర్యనంతర స్వదేశీ సంస్థానాల విలీనసమయంలో ప్రభుత్వం తరపున ఎదురైన సమస్యలను బాగా తెలిసినవాడు. కాబట్టి వారి అక్షరాలకు విశ్వసనీయత (రిలయబిలిటి) ఎక్కువగా ఉంటుంది. ఈ గ్రంథంలో వారి సొంత అభిప్రాయాలకంటే నాటి ప్రభుత్వ అభిప్రాయాన్నే ఎక్కువగా తెలియజేశాడు.

ఈ పుస్తకంలో భారత స్వాతంత్ర్య సంగ్రామం, హైదరాబాదు సంస్థాన విలీన సమయంలో ప్రజాచైతన్య ఉద్యమాలు సాహిత్యం పాత్రను చెప్పబడలేదు. అయిప్పటికీ చారిత్రక అంశాలను సాధికారికంగా ప్రస్తావించారు. భారతదేశంలో "స్వదేశీ రాజ్యాల అస్థిరతకు కారణాలు, స్థిరరాజకీయాల స్థాపనకు బ్రిటీషు ప్రభుత్వం అనుసరించిన వ్యూహాలను, దశలవారీ చర్యలను" క్రమపద్ధతిగా రచయిత వివరించారు. చివరలో హైదరాబాదు సంస్థానంలో అల్లర్లకు కారణాలు, భారతసంస్థానాల ఏకీకరణ, ప్రజాస్వామ్య ప్రభుత్వానికి నాటి ప్రభుత్వాల నిజాయితీ చొరవను గురించి వివరించారు. ఈ విషయాలను చదివితే సమకాలీన రాజకీయ అంశాలు సైతం మనల్ని ముప్పిరిగొంటాయి. పాఠకులకు కొసమెరుపు ఏంటంటే "అసఫ్ జాహీ సంస్థానం విలీనగాథ" ఆంగ్ల, తెలుగు రచయితలిద్దరూ కూడా ప్రభుత్వ ఉన్నతోద్యోగులు కావడం గమనార్హం.

-0-

-పాలపిట్ట, జూన్ 2025

సత్య వీక్షణం

భారత రాజ్యాంగం 51(A H) ప్రకారం ప్రతీపౌరుడు వైజ్ఞానిక శాస్త్రీయ దృక్పథాన్ని ఏర్పరుచుకోవాలి. లేకపోతే సమాజంలో మూఢ నమ్మకాలు పెరిగి సమాజం అస్థిరమవుతుంది. సత్యమొక్కటే జయిస్తుంది. దైవాన్ని చేరుకునేందుకు సత్యంతోనే మార్గం ఏర్పడుతుంది. నిష్కామమైన రుషులంతా ఆ సత్యమార్గం ద్వారానే పరమాత్మను చేరుకుంటారు. ముండకోపనిషత్తులో మొదటి ఖండంలోని ఆరవమంత్రం నుంచే 'సత్యమేవ జయతే' అన్న నినాదాన్ని రాజముద్రగా గ్రహించారు. చెక్ రిపబ్లిక్ దేశ నినాదం "ప్రావ్దా విటేజీ" అనగా సత్యమే ఉంటుంది.

తైత్తిరీయోపనిషత్తులో "సత్యం వద, ధర్మం చర" అని ఉంటుంది. అంటే సత్యాన్ని మాట్లాడు, ధర్మాన్ని ఆచరించు అని అర్థం. రామాయణంలో నారదుడిని వాల్మీకి అడిగిన ప్రశ్నలో శ్రీరాముడు సత్యసంధత ఒకటి. ఇక్కడ సత్యము అంటే సర్వమూ అనే అర్థంగా భావించాలి. విగ్రహంలో ప్రాణమే ఉండదు. మరి దేవుడెలా ఉంటాడు? శ్రీహరి సర్వాంతర్యామిగా స్తంభంలోనుండి వచ్చి ప్రహ్లాదుడిని రక్షించడంలో ఆధ్యాత్మిక సత్యం కనిపిస్తుంది. ఖురాన్ సూక్తి "నస్‌రుమ్ మినల్లాహి వ ఫతహ్ ఉన్ ఖరీబ్", సత్యం (అల్లాహ్) యొక్క జయం, అతి దగ్గరలో వుంటుంది. నిజానికి మతం అనేది సత్య శోధన, ప్రేమ, ఐక్యత, జీవన సూత్రాల బోధన, జ్ఞానోదయం కొరకు మానవులు ఏర్పరుచుకున్నారు. తరువాత కాలంలో ఇది పిడివాదంగా మారింది. శాస్త్రీయతకు ఆధ్యాత్మికజ్ఞానం, తాత్విక, హేతువాద జ్ఞానం తోడ్పడినా మానవుడు పిడివాదాన్ని విడిచిపెట్టడం లేదు.

గెండెల శ్రీనివాస్ రాసిన సైన్సు ఆధ్యాత్మిక తాత్విక పుస్తకం "సత్య వీక్షణం". నిర్మాణపరంగా 58 పేజీల చిన్న పుస్తకమిది. సారవంతమైన శాస్త్రీయ ఎరుకను ఆసక్తిగా కలిగించడంలో గొప్పపుస్తకం. ఒక రచన వెనుక ప్రభావితం చూపే అనేక అంశాలలో రచయిత నేపథ్యం, వృత్తి, ప్రవృత్తి, నివసించిన సమాజం, ఆసక్తి, అభిరుచులు, మేధస్సు, జ్ఞానం వంటివి ప్రధానంగా ఉంటాయి.

సత్యమంటే నిజం, యధార్థమని అర్థం. జాషువా "జ్ఞానమొక్కటే నిలిచి

వెలుగును" అంటాడు. జగతిలో జ్ఞానం ఒక్కటే ఉంటుంది. అది సత్యం. సత్యమొక్కటే జ్ఞానమైతే.. మరి అజ్ఞానం? అది కూడా సత్యమే. అసత్యమనేది ఉనికిలో లేనిది. సత్యశోధనలో అసత్యం పరిణామం చెంది సత్యంగా గోచరిస్తుంది. ద్వైతం కాస్తా అద్వైతంలా కలిపిస్తుంది. సత్యాన్ని చేరుకోవడానికున్న అనేక జ్ఞానమార్గాలలో శాస్త్రీయత, ఆధ్యాత్మికతత్వం కొన్నిమెరుగైనదారులు. సత్యశోధనలో శాస్త్రవేత్తలు కనిపించని సత్యాన్ని కనుక్కోవడమే జ్ఞానం అంటాడు రచయిత. వారు సత్యాన్ని లేదా జ్ఞానాన్ని కనుగొనడం ద్వారా ఆవిష్కరణలు, విజ్ఞానశాస్త్ర సత్యాలను కనుగొంటారు. సాహితీవేత్తలు విలువల సత్యాన్ని, తత్వవేత్తలు తాత్విక సత్యాన్ని అన్వేషిస్తారు. నిజానికి ఈ విశ్వమంతా సత్యమనే పదార్ధంతో నిండిపోయింది. ఇది వివిధ రూపాలలో విడిపోయింది. పదార్థ సత్యాన్ని బట్టి వస్తువు లేదా జీవి రూపం సాధించుకుంటుందని, జీవి చనిపోయాక నిర్జీవిగానూ, ఏ జీవంలేని రసాయన మూలకాలు జీవంగానూ ప్రాణం పోసుకోవడం వెనుక సత్యమే దాగి ఉందని ఉదాహరణపూర్వకంగా చెప్పాడు. జీవులన్నీ చలన సహితాలై మార్పును కలిగి ఉంటాయి.

కాలపరిమితి జీవులకే కాదు, నిర్జీవులకూ ఉంది. మార్పు నిత్యంగా జరుగుతుంది. నిర్జీవులూ మార్పును చూపిస్తాయి. మార్పు జీవలక్షణమా? నిర్జీవ లక్షణమా? రూపం నిర్జీవులూ సజీవులుగా సజీవులు నిర్జీవులుగా మారుతున్నాయి. సరళం నుండి సంక్లిష్టతవైపు గల ఈ చలనాన్ని క్వాంటం ఫిజిక్స్ అర్థం చేసుకోవడానికి చెప్పిన ష్రోడింగర్ తరంగ సమీకరణం, కర్మ సిద్ధాంతం ఉపయోగపడుతుంది. స్థిరమైన సత్యం దర్శించేంతవరకు సత్యం చరశీలమైనదే. జీవవాహినిలో సజీవులు నిర్జీవులు తరంగచలనం చేస్తూ ఉంటాయి. పదార్థం నశించదు. ఇదే సత్యం. భగవద్గీతలోనూ ఆత్మ నశించదని ఉంటుంది. అక్షరం అంటే నశించనిది అని అర్థం. అంటే సత్యానికి మూర్త (భౌతిక), అమూర్త (అభౌతిక) స్వభావం ఉందని అర్థమవుతుంది. భౌతిక, మానసిక చలనాత్మక సూత్రాలన్నీ సత్యానికి కట్టుబడి ఉంటాయని భావం. మానవునికి సత్యం ఎందుకు? సత్యం జ్ఞానమయం. విజ్ఞానమయం. ఆనందానికి సంతోషానికి జ్ఞానం హేతువు. తెలిసి ఉండడం, ఎరుకతో జీవించడమనేవి మానవుని మేధో అన్వేషణా శాస్త్రీయ ఫలితాలు.

సత్యం శివం సుందరం అనే భావనలో ఆధ్యాత్మికత మాత్రమే లేదు.

శాస్త్రీయతను అర్థం చేసుకోవడానికి ఈ పదాలు ఉపయోగపడతాయి. ఈ పుస్తకంలో రాసిన కొత్తవిషయాల కన్నా, కొత్తగా చెప్పిన విషయాలే మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. సూక్ష్మ జీవులనుండి కాపాడడానికి ధాన్యాన్ని ఎండకట్టడం లేదా అతిశీతలీకరణానికి గురిచేస్తాము. అయితే భూమి చల్లారినా, వేడెక్కినా ఆక్రమంలో జీవుల మనుగడ పెరగడం లేదా యుగాంతానికి కారణాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. మానవాళిపై సుక్ష్మజీవుల ఆధిపత్యంతోనే యుగాంతం జరుగుతుందనే సత్యాన్ని చెప్పాడు. సూక్ష్మ జీవులలో వైరస్ లు జీవుల మీద ఉన్నప్పుడు జీవం పోసుకుంటాయి. జీవులనుండి తొలగినప్పుడు నిర్జీవమవుతాయి. అందుకే వాటిని జీవులకు నిర్జీవులకు వారధి అంటారు. అంటే వాటిని చంపలేము. అవి చచ్చి తిరిగి బతకగలవు. మానవుని కంటే ముందే పుట్టిన జీవులు అవి. భవిష్యత్తులో మానవుని మించిన జీవులు పుట్టవనే గ్యారంటీ ఏం లేదు. ఇలా సత్యాన్ని శోధించే శాస్త్రీయత ఈ పుస్తకంలో కనిపిస్తుంది. టోటీపోటేన్సి అంటే అన్ని అవయవాలు కలిగిన ఒక సంపూర్ణజీవిని ఏర్పాటు చేసే కణం యొక్క అంతర్గత శక్తి. ఫలదీకరణలో పిండకణం (సంయుక్త కణం)కు ఉంటుంది. మొక్కలలో ప్రతీ కణానికి ఉంటుంది. మరి ఈ భూమికి ఎక్కడి నుండి వచ్చిందని రచయిత ప్రశ్నిస్తాడు?

సత్యం అంటే జ్ఞానం. రచయిత దృష్టిలో సత్యం ఏకరూపం. సత్యం బహుముఖం. సత్యం సమూహం. ప్రపంచమంతా సత్యమయం. జీవులు సత్యరూపేణా సజాతి ధ్రువ ఆకర్షణ మేధోజీవులుగా ఆకర్షించబడతాయనే సత్యాన్ని చెబుతాడు. ఆలోచనల తరంగాలతో సత్యప్రయాణంలో అన్వేషించినా కొలది సత్యం బోధపడుతుంది. రచయిత దృష్టిలో సత్యం విశాలమైనది. ఎన్ని తరాలు తవ్వినా తరగని రహస్యాలను కలిగిన గది. ఇది తెలుసుకోవడానికి తగిన ప్రేరణ, ఆసక్తి, శక్తి కావాలి.

ఈ పుస్తకంలో మనకు ఎన్నో ప్రశ్నలు కనిపిస్తాయి. అనేక సమాధానాలు సంతృప్తిపరుస్తాయి. సత్యం ప్రకృతి. అసత్యం వికృతి, కృత్రిమం. సత్యం స్థూలం నుండి సూక్ష్మం వైపు ఆరోహణగా మరియు అవరోహణగా కనిపిస్తుంది. విశ్వంలో వెదజల్లబడిన సత్యాలు, మానవ మెదడులోనూ కనిపిస్తాయి. మానవ దేహాన్ని నడిపించే రసాయనాలే విశ్వాన్ని నడిపిస్తున్నాయి.

రచయిత దృష్టిలో సత్యం ఒక వలలాగ నెట్వర్క్ ను ఏర్పాటు చేసుకుంది. ఈ సత్య గ్రహింపుకు మానవునికి ఇంద్రియాలు దోహదపడుతున్నాయి. కొన్ని జంతువులు మనం పసిగట్టలేని భూకంపాలు, సునామీలను ఎలా గ్రహించగలుగుతున్నాయి. అంటే సత్యాన్ని గ్రహించగలిగే ఇంద్రియాలు మానవునిలో లేనివి ఇంకా ఏవో అదనంగా ఉన్నాయని అర్థమవుతుంది. అలా చూసినప్పుడు మన శాస్త్రవేత్తలు మానవుని ఇంద్రీయ వ్యవస్థను మరింత మెరుగుపరచాల్సిన ఆవశ్యకతను రచయిత తెలియజెప్పాడు. శిలాద్రవం భూమికి అయస్కాంతస్వభావాన్ని కలిగిస్తే సత్యం మనిషిని అన్వేషణవైపుకు నడిపిస్తుంది. ఇలాంటి విషయాలను ఈ పుస్తకంలో రచయిత ఆసక్తికరంగా చర్చించాడు.

ప్లేటో "గూహ యొక్క ఉపమానం" కథలో గూహలాంటి మానవ జీవితంలో ప్రజలు అవాస్తవ వస్తువులు, నీడలు, చిత్రాలను మాత్రమే పరిమితంగా చూస్తారు. వివేకంతో గూహ పరిధిని అధిగమించడాన్ని తిరస్కరిస్తారు. కొద్దిమంది హేతువును వాహకంగా గుహ పరిధి దాటడంతో వారికి సూర్యుడు ప్రత్యక్షమవడంద్వారా కథ ముగుస్తుంది.

"సత్య వీక్షణానికి" అటువంటి హేతువాద సాహసం కావాలని రచయిత ఈ పుస్తకంలో పేర్కొన్నాడు. ఆంగ్ల సాహిత్యంలో బాగా విస్తరించిన ఆదరణీయ శాస్త్రీయత కలిగిన సాహిత్యం తెలుగు భాషలో తక్కువేనని చెప్పాలి. కాబట్టి ఈ పుస్తకం రొటీన్ తెలుగు పాఠకులకు చాలా విలువైనది. భిన్నమైనది. ఈ పుస్తకాన్ని మరింత విస్తరించి, చర్చించాల్సిన అవసరమైతే కనిపిస్తుంది. మనం ఏర్పరుచుకున్న సత్యాలు, విశ్వంలోని సత్యాలమధ్య సిగ్నలింగ్, సత్య సౌందర్యం, రూపం, జ్ఞానేంద్రియాల అవసరం, విశ్వం యొక్క సంతాన పునఃఫలవంతత (టోటీపోటేన్సి), సూక్ష్మ జీవుల ఆధిపత్య జీవన శైలి ఇలా పుస్తకమంతా తాత్విక, శాస్త్రీయ సత్యాలతో నిండిపోయి ఉంటుంది.

–10 ఏప్రిల్ 2025, విశ్వంభర

"మెరిసే ధ్రువతారలే శాస్త్రవేత్తలు"

"విజ్ఞానమనే వినీల ఆకాశంలో మెరిసే ధ్రువతారలే శాస్త్రవేత్తలు. శాస్త్రవేత్తల కృషి, పట్టుదల వారు ప్రపంచానికి అందించిన సేవలు వెలకట్టలేనివి."

–రాజర్షి షా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్

అన్నట్టు, భారతీయ శాస్త్రవేత్తలు మరియు పాశ్చాత్య శాస్త్రవేత్తలు చరకుడు, కనాధుడు, శుశ్రుతుడు, ఆర్యభట్ట, వరాహమిహిరుడు, జగదీష్ చంద్రబోస్, సివి రామన్, ఎల్లాప్రగడ సుబ్బారావు, హెూమి జహంగీర్ బాబా, విక్రమ్ సారాభాయ్, హర గోవింద ఖురాన, ఎపిజే అబ్దుల్ కలాం వంటి ప్రసిద్ధ భారతీయ శాస్త్రవేత్తల కృషిని, ఆయా రంగాల్లో వారు చూపిన ప్రతిభను మరియు వారి ప్రత్యేకతలను చక్కగా ప్రేరణాత్మకంగా వివరించాడు.

అంతేకాకుండా వివిధ రంగాలలో ప్రాముఖ్యత కలిగిన పాశ్చాత్య శాస్త్రవేత్తలైన అరిస్టాటిల్, మైకేల్ ఫారడే, చార్లెస్ డార్విన్, లూయి ప్యాశ్చర్, అల్ఫ్రెడ్ నోబెల్, థామస్ అల్వా ఎడిసన్, నికోలా టెస్లా, మేడం క్యూరీ, అలెగ్జాండర్ ఫ్లెమింగ్, ఐన్ స్టీన్ గురించి విశ్లేషిస్తూ రాశాడు.

మానవునికి శాస్త్రీయ జ్ఞానం ఆధునికతను, అవసరాలను, ఆరోగ్యాన్ని కలిగించేదిగా మారిపోయింది. నూతన ఆవిష్కరణలన్ని మానవునికి సులభతరమైన జీవన విధానాన్ని అలవాటు చేశాయి. నాటి, నేటి, భావి ఆవిష్కరణలన్ని మానవుని శ్రేయస్సును కాంక్షించేవే. ఈ పరిశోధనలకు మూలం మానవుడి అవసరమే పరమావధి. ప్రపంచ శాస్త్ర విజ్ఞాన రంగంలో భారతదేశం చారిత్రాత్మకంగా ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఈ విషయాన్ని బలపరచడానికి రావాల్సిన అవసరం ఉంది. "చరక సహిత" పుస్తకాన్ని రచించిన చరకుడు భారతీయ ఆయుర్వేద పితామహునిగా కీర్తింపబడ్డాడు. మొక్కల పై ఆధారపడే సహజ వైద్య విధానం ఆయుర్వేద విధానం. అల్లోపతిలో కూడా చికిత్స లేనటువంటి మొండి రోగాలకు ఈనాటికీ ఆయుర్వేదమే పెద్దదిక్కు. మానవ శరీరం వాయు, అగ్ని, జల, భౌమ్య, ఆకాశ, తత్వాలైన పంచభూతాలతో తయారవుతుందని, శరీరంలో ఏది తక్కువైనా రోగాల బారిన పడతామని చరక సంహిత తెలియజేస్తుంది. ఈ సందర్భంగా త్రిదోషాలైన వాత,

పిత్త, కఫ విధానాన్ని పాటించే ఆయుర్వేద శాస్త్రం గురించి పరిశోధించి రచయిత రాశాడు. "విశ్వంలోని ప్రతి పదార్థం విడదీయరాని పరమాణువులతో నిర్మించబడి ఉంటుందని దేవుడనే వారు లేరని, ఆత్మ, మనసు కూడా పదార్థాలే" అని చెప్పిన నిరీశ్వర వాది, భారతీయ ప్రాచీన అణు సిద్ధాంత పితామహుడు కణాధుడు. ఈయన ప్రకారం "పదార్థమంతా అణువుల సంయోగం చేత సృష్టించబడి ఉంటుంది." ఆయా అణువుల గుణాలు, ధర్మాలు, సంయోగాన్ని అనుసరించి పదార్థం యొక్క భౌతిక రూపం, స్వభావాలు మారుతూ ఉంటాయని" ఈయన పేర్కొన్నాడు. అణువు రూపంలో ఉండే సహజ భౌతిక శక్తి మరియు సహజ మానవాతీత శక్తిని సవివరంగా చర్చించాడు. పంచభూతాలతో బాటుగా కాలం, అంతరిక్షం, మనస్సు, ఆత్మను కలిపి తొమ్మిది సహజ లక్షణాలను పదార్థానికి అన్వయం చేశాడు. ఇది ఇంకా లోతుగా పరిశోధించవలసిన శాస్త్ర విజ్ఞానం.

భారతీయ శస్త్ర చికిత్సకు పితామహుడు శుశ్రుతుడు. ఈయనే అనస్థీషియాను కనిపెట్టాడు. ఈయన రాసిన గ్రంథంలో "శుశృత సంహిత, చరక సంహిత, వాగ్బట సంహిత" అనే మూడు గ్రంథాల సారాంశాన్ని విస్తృతంగా చర్చించాడు. క్రీస్తుపూర్వం 617 కాలంనాటి ఈ శాస్త్రవేత్త "అష్టాంగ హృదయం" గురించి విపులంగా వివరించాడు. ఆయుర్వేద వైద్యంతో బాటు నయం చేయలేనటువంటి వివిధ రోగాలు, భగవంతుడు ఇచ్చిన శరీర నిర్మాణాన్ని సైతం శస్త్ర చికిత్సల ద్వారా మార్చగలిగే మనిషి యొక్క మేధో గొప్పదనాన్ని సమాజానికి సజీవంగా చేసి నిరూపించి చూపాడు. ఈయన రాసిన ఆయుర్వేద గ్రంథం రవాణా సదుపాయాలు పెద్దగా లేని ఆరోజుల్లో అరబిక్ మరియు ఆంగ్లంలో అనువాదం జరిగి ప్రపంచ దేశాలకు విస్తరించింది. ప్రపంచానికి సున్నాను పరిచయం చేసిన ప్రాచీన భారతీయ అతి గొప్ప గణిత ఖగోళ శాస్త్రవేత్త ఆర్యభట్ట. మానవ శరీరమే కాదు విశ్వ శరీరాన్ని అర్థం చేసుకోవడానికి ఈయన ప్రయోగాలు ప్రపంచానికి ఉపయోగపడ్డాయి. గొప్ప వైద్య శాస్త్రవేత్త ధన్వంతరి, కవి కాళిదాసు కూడా ఈయన సమకాలీకులే. భూమి గుండ్రంగా ఉంటుందని, సూర్యుడు చుట్టూ భూమి ఇతర గ్రహాలు తిరుగుతాయని ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఈయన చెప్పాడు.

వరాహమిహిరుడు మరో గొప్ప ఖగోళ గణిత శాస్త్రజ్ఞుడు. గ్రహగతులను,

జాతకం, జ్యోతిష్యం లాంటి శాస్త్రాలకు అన్వయిస్తూ "పంచ సిద్ధాంతిక" గ్రంథంలో సౌర సిద్ధాంతాన్ని, విశ్వ రహస్యాలను తెలియజేశాడు.

భారతదేశ సంస్కృతిలో చెట్టుతో, పుట్టతో, పాముతో, చీమతో మానవుడు గొప్ప మానవత్వంతో నడుచుకుంటాడు. వాటిపై దైవిక భావన కలిగి ఉంటాడు. శాస్త్రవేత్తలు కూడా సగటు భారతీయుల సంస్కృతిని సమర్థిస్తున్నట్టుగానే పరిశోధనలు జరిపినట్టు అర్థమవుతుంది. అనేక క్లిష్ట సమస్యల పరిష్కారం అత్యంత సాధారణంగా ఉంటుంది. ఈ భూమిపై మనిషికే కాదు మొక్కలకు స్థానం, ప్రాణం ఉంటుందని శాస్త్రీయంగా నిరూపించిన భారతీయ శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్. "కెస్కో గ్రాఫ్" పరికరంతో ఈయన మొక్కలలో ఉండే సజీవ కదలికలను నిరూపించాడు. ఇది ప్రపంచాన్ని నివ్వెరపరిచే అంశం.

జాతీయ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్న ఫిబ్రవరి 28 సివి రామన్ పుట్టినరోజు. సహజంగా వస్తువు చూడడానికి కాంతి అవసరం. కాంతి పడితే వస్తువు దృశ్యమానం అవుతుంది. అయితే "పదార్థంపై కాంతి పడినప్పుడు, కాంతిలో కలిగే మార్పు" ను గురించి రామన్ చేసిన పరిశోధన ప్రపంచవ్యాప్తంగా రామన్ ఎఫెక్ట్ అయింది. ఇవాళ జియో నెట్ ద్వారా వేగవంత డేటా ట్రాన్స్ఫర్ సాంకేతికతను వాడుతున్నం. ఆప్టికల్ ఫైబర్, వైద్య, అంతరిక్ష, సాంకేతిక రంగాలతో బాటుగా రామన్ ఎఫెక్ట్ అనేక రంగాలలో గొప్ప ఆవిష్కరణలకు మూలమైంది. దేశభక్తి, స్వతంత్ర ఆలోచన, శాస్త్రీయ విజ్ఞానంపై జిజ్ఞాస వంటి సివి రామన్ లోని గొప్పగుణాలు ఈ తరం పిల్లలు నేర్చుకోవాల్సిన విషయాలు.

"మిరాకిల్ మ్యాన్ ఆఫ్ మిరాకిల్ డ్రగ్ " గా ప్రసిద్ధిగాంచిన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు మన తెలుగువాడు. మలేరియా, ప్లేగు, ఫైలేరియా, అనీమియా, సోరియాసిస్, స్ప్రూఫ్ మరియు బి12 విటమిన్ లోపం వల్ల వచ్చే అనేక రకాల వ్యాధులకి మందులు కనిపెట్టి ప్రసిద్ధి గాంచారు. ప్రపంచవ్యాప్తంగా నిత్యం అనేక మంది జీవితాలను కాపాడే రోగ నిరోధక ఔషధం "టెట్రాసైక్లిన్". దీనిని కనిపెట్టిన శాస్త్రవేత్త సుబ్బారావు.

భారతీయ అణు భౌతిక శాస్త్ర పితామహుడు హోమి జహంగీర్ బాబా. భారతదేశానికి అణు పరీక్షలను నిర్వహించగలిగే సత్తా ఉందని ప్రపంచానికి చాటిన ధీరుడాయన.

భారతీయ మొట్టమొదటి అణు రియాక్టర్ "అప్సర"అనేది వీరి ఆధ్వర్యంలోనే ప్రారంభించడం జరిగింది.

భారత అంతరిక్ష పరిశోధన పితామహుడుగా విక్రమ్ సారాభాయ్ కాస్మిక్ కిరణాలలో మార్పు, గ్రహాంతర స్థలాలు, సూర్యుడికి భూమికి మధ్యనున్న సంబంధం, భూ అయస్కాంత క్షేత్రం... ఇలా అనేక అంశాలపై పరిశోధన చేసినటువంటి గొప్ప శాస్త్రవేత్త.

సింథటిక్ బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, జన్యు సంకేతం వంటి అంశాలపై పరిశోధన జరిపి ప్రపంచవ్యాప్తంగా పేరు సంపాదించుకున్న నోబెల్ బహుమతి గ్రహీత హర గోవింద ఖురాన. సాంకేతిక శాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎలాగో జీవ సాంకేతిక శాస్త్రంలో మాలిక్యులర్ బయాలజీ అదేవిధంగా అధునాతనమైనది. జన్యు వ్యక్తీకరణను అర్థం చేసుకుంటే ఉత్తమమైన మానవ సమాజాన్ని నిర్మించడానికి సులభమవుతుంది. ఈ అన్వేషణలో మొదటి అడుగు వేసిన వారు ఖురానా. భారత మొదటి పౌరుడుగా, మిస్సైల్ రంగానికి పితామహుడుగా, ప్రొఫెసర్ గా, తత్వవేత్తగా, రాష్ట్రపతిగా, భారతరత్నగా, అజాతశత్రువుగా కీర్తి సంపాదించిన భారతీయ ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం. భారతదేశ అమ్ముల పొదిలో అగ్ని, నాగ్, ఆకాష్, పృథ్వి, త్రిశూల్ లాంటి ఎన్నో క్షిపణులను వారు అందించారు. దేశానికి శత్రుభయం లేకుండా చేశారు. ఈ పుస్తకంలో భారతీయ శాస్త్రవేత్తలనే కాకుండా గొప్ప గొప్ప ఆవిష్కరణలతో ప్రపంచగతిని మార్చిన పాశ్చాత్య శాస్త్రవేత్తల గురించి కూడా ఈ పుస్తకంలో చర్చించడం చాలా బాగుంది.

వీరంతా కేవలం శాస్త్రవేత్తలుగా మాత్రమే చదువుకుంటే సరిపోదని ఈ పుస్తక రచయిత అభిప్రాయపడ్డాడు. అందుకే ఈ శాస్త్రవేత్తల కృషిని ఒకవైపు చెబుతూ, మరొకవైపు వారి వ్యక్తిగత జీవితాన్ని, సామాన్యులుగా ఉన్నటువంటి వారు... ఆసక్తి, జిజ్ఞాస, పట్టుదల, నిరంతర కృషి వారిని పరిశోధన వైపుకు మళ్లించిన పరిస్థితులను చర్చించడం ద్వారా పిల్లలకు ఆసక్తిని కలిగించి, వారిని శాస్త్రీయ రంగం వైపు మళ్ళించడంలో సత్యనారాయణ విజయవంతం అయ్యాడని చెప్పవచ్చు.

-0-

కథానాయకుడు

నా జీవితంలో, సాహిత్యంలోనూ కనపడే కథానాయకుడు మా నాయిన శీలం బుచ్చయ్య. నాయిన జీవితాన్ని ఈ తరం యువతకు చెబితే జ్యోతి బా పూలే జీవితంలా, అంబేద్కర్ కథలా ఉంటుంది. అయన పోరాటాన్ని గురించి చెబితే మహాత్మాగాంధీ జీవితంలా ఉంటుంది. నా అనుభవాలు చెబితే సగటు కొడుకు తండ్రి గురించి చెప్పినట్టుగా ఉంటుంది. ధర్మము, కర్మము, జీవిత మర్మము తెలిసిన ఆయన జ్ఞానయోగి. గౌడు కులంలో పుట్టినా లౌకిక, పురాణ, ఇతిహాస సాహిత్యాన్ని చదువుకుని జానపద భాణీలో చిడతల భజన, కోలాటాలు ద్వారా సమాజాన్ని మేల్కొలిపిన నిత్య చైతన్యశీలి. అన్యాయాన్ని ధిక్కరించిన ఉద్యమజీవి. అసంబద్ధ సామాజిక కట్టుబాట్లను ధిక్కరించి ప్రయోగాత్మక వాస్తవికతను పరిచయం చేసిన ప్రయోగావాది. గీతవృత్తి చేసినా గీతాసారాన్ని వంటపట్టించుకున్న సిసలైన ఆధ్యాత్మికవాది. ఇంటిని, కులాన్ని, సమాజ బాధ్యతలను చక్కగా సమన్వయం చేసుకున్న గొప్ప గాంధేయ మానవాతావాది. ఈ వ్యాసంలో ఆయన వ్యక్తిగత విషయాలు, ఆయన జీవితంలో పెనవేసుకున్న చారిత్రక, సామాజిక, సాహిత్య, రాజకీయ, హేతువాద ఆచరణ గురించి ప్రస్తావిస్తాను.

ఏడవ నిజాం పాలనా కాలంలో నాయిన శీలం బుచ్చయ్య 1934లో నల్లగొండ జిల్లా, నకిరేకల్లు మండలం ఓగోడు గ్రామంలో జన్మించాడు. ఉర్దూ మాధ్యమంలో నాలుగు వరకు చదువుకున్న అక్షరజిజ్ఞాసి. రైతాంగ సాయుధపోరాటానికి ఈ ప్రాంతం పురిటిగడ్డ. కుటుంబంలోని దాదాపు సగం మంది రజాకార్ల దాడిలో హతమయ్యారు. త్రుటిలో తప్పించుకున్న తాత శీలం భద్రయ్య (ఆయన పేరే నాకు పెట్టారు) జ్ఞాపకాలు, ఉపాధి, ఆత్మగౌరవానికి 'మూసినది ప్రాజెక్టు' రూపంలో 1954లో అన్యాయం జరిగింది. వరదలతో అతలాకుతలమవుతున్న హైదరాబాదు ముంపు నివారణకు మూసీనదిపై సోలిపేట ప్రాంతంలో ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించడంతో ఓగోడు గ్రామంతో బాటుగా 18 గ్రామాలు నిర్వాసితులయ్యాయి.

పోలీస్ క్యాంపులతో ప్రజలను బలవంతంగా గ్రామాలను ఖాళీచేశారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో మూసీప్రాజెక్టును కేంపుచెర్వు అనే పిలుస్తారు. నా మొదటి కథ "కేంపుచెర్వు" ఈ నేపథ్యంలో ఉంటుంది. అందరితోబాటుగా మా కుటుంబం సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి మండలం, వెలుగుపల్లి అన్నారం గ్రామానికి వలసబాట పట్టింది. అది మా నాయనమ్మ ఊరు.

వలస కుటుంబం కావడంతో మాపై అయినవారికి, కానివారికి చిన్నచూపే. దీనికి తోడు ఆ ఊరిలో ఉపాధి మార్గంలేదు. గౌడులకు తాడిచెట్లు లేవు. పొరుగూరు కర్విరాలలో ఉన్న తాడిచెట్లు కొత్తగూడెం ఊరివాళ్ళకే సొంతం అన్నట్టుగా ఉండేది. అన్నారం గౌడులు సుదూర ప్రాంతాల నుండి కల్లును మారుబేరం(అంచెకల్లు అంటారు)కు కొనుగోలు చేసి ఊరిలో అమ్ముకునేవారు. ఆ ఊరి గౌడులకు పిల్లను ఇవ్వాలన్నా బాగా ఆలోచించేది. ఇది ఆ తరం గోస. నాయిన అక్షరజ్ఞానం తెలిసిన వాడు కావడంతో గౌడులను కూడగట్టి కర్విరాల తాటివనంలో ఊరి భాగం కొరకు ఉద్యమించాడు. కొత్తగూడెం గౌడులకు మల్లు స్వరాజ్యం, భీంరెడ్డి నరసింహారెడ్డి లాంటి కమ్యునిస్టులు అండగా ఉండేది. గతంలో ఈ విషయంలో రెండు గ్రామాల గౌడులు తలలు పగులకొట్టుకున్నారు. నెత్తురు చిందించినా ప్రయోజనం దక్కలేదు. రజాకార్ల ఒత్తిడిని ఎదుర్కున్న ప్రాంతంలో పుట్టిన నాయిన వయసుకు ఎరుపు నెత్తురు, ఉడుకు ఉన్నా స్పృహ, చైతన్యం కలిగినవాడు. కాబట్టి న్యాయమైన వాటాకొరకు అన్నారం గౌడులను కూడగట్టాడు. మాటల్లో నాయినతో నెగ్గేవారు చాలా అరుదు. చాణక్య నీతితో వ్యూహ ప్రతివ్యూహాలతో అహింసాయుత మార్గంలో ఉద్యమాన్ని ఉధృతం చేశాడు. నాయిన చేస్తున్న ధర్మపోరాటాన్ని తట్టుకోలేని ఎర్రచొక్కాలు ఆయన మీద భౌతికదాడులు చేయడానికి కూడా వెనుకాడలేదు. ప్రతిదాడులు చేస్తామన్న సొంతూరి గౌడులను మాటలతో ఆలోచింపజేశాడు. చివరికి ధర్మయుద్ధంలో అన్నారం గౌడుల చిరకాల స్వప్నాన్ని సాక్షాత్కారం చేశాడు. తాటివనంలో అన్నారం గౌడులకు న్యాయమైన వాటా దక్కింది. ఉపాధి మార్గం దక్కిందనే లోగా గౌడులకు ఎక్సైజ్ అధికారుల రూపంలో బాధలు మొదలయ్యాయి. అప్పటికే నాయినను అక్షరజ్ఞానం తెలిసినవాడు, మేధావిగా గుర్తించిన గౌడకులం ఈ సమస్యను పరిష్కరించాలని కోరడంతో నాయిన సుదూరప్రాంతంలో ఉన్న ఎక్సైజ్ ఉన్నతాధికారుల దృష్టికి

తీసుకెళ్ళడంతో ఆ సమస్య సమసిపోయింది.

ఇప్పటికీ నాయిన గురించి తెలిసిన ఆ తరం "అపర చాణక్యుడు" అంటారు. నాయిన ధర్మాన్ని, చట్టాన్ని విశ్వసించేవాడు. దాంతో అన్నారం గౌడులు నాయినను మూడుసార్లు వరుసగా పదిహేనేళ్ళు గౌడుల కులానికి సర్పంచ్ గా(కులపెద్ద) ఎన్నుకున్నారు. వలస వచ్చిన వాడు పెత్తనాన్ని చెలాయించడం ఇష్టంలేని సొంత గౌడుల కుట్రలనూ, పొరుగూరి గౌడుల కుట్రలనూ చాకచక్యంగా ఎదుర్కున్నాడు. ఉన్న ఊరును వదిలిన బాధతో మంచానపడిన తండ్రి, తన తరువాత నలుగురి సంతానం ఆలనాపాలనా, వారి పెళ్ళిళ్ళు పెద్దకొడుకు బాధ్యతలను సమర్ధంగా నిర్వహించాడు. వ్యక్తిగత జీవితంలో ఒత్తిళ్ళు అందరికీ సహజమే కావొచ్చు. కానీ సమాజాన్ని పట్టించుకోవడానికి చాలా మందికి అవే అడ్డంకిగా మారుతాయి. వ్యక్తిగత అడ్డంకులేవి ఆయన సామాజిక బాధ్యతను అడ్డుకోలేదని నిస్సందేహంగా చెప్పవచ్చు.

చాలామందికి నాయిన అనగానే గుర్తుకు వచ్చే మరొక విషయం చదువు, క్రమశిక్షణ. ప్రతీతల్లిదండ్రులు పిల్లలు చదవాలని కోరుకోవడం అత్యంత సహజమే. కానీ నాయన మా చుట్టూ ఉన్నపిల్లలు, చుట్టాల పిల్లల వరకు చదువు గురించి వాకబు చేసేవాడు. కొన్ని ప్రశ్నలు అడిగి వారి స్థాయిని అంచనా వేసి వారికి, వారి తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చేవాడు. మా ఊరి ప్రభుత్వ బడికి తరచుగా రావడం మా చదువు గురించి అడిగి, పిల్లలు ఎందుకు చదువులో వెనుకబడుతున్నారో ఆయా ఉపాధ్యాయులను కారణాలడిగి నిలదీసేవారు. పాఠశాల ప్రతీ జెండావందనం రోజున హెడ్ మాస్టర్ ఆయన సామాజిక బాధ్యతను అభినందించేవారు. ఈరోజుల్లో అలాంటి నిలదీసే తల్లిదండ్రులు ఉంటే ప్రభుత్వబడులు ఎంత బాగుంటాయో తెలియంది కాదు. 'నాయినా నువ్వెందుకు చదువుకోలేదని అడిగితే, "ఇంటికి పెద్దవాన్ని, నా వెనుక అరడజను మంది పుట్టారు. ఇల్లు వాకిలి మూసీ కిందపోతే, ఈ ఊరికి బతకొచ్చినం. ఇగ నా చదువుకు అవకాశం ఎక్కడిది? మీరు చదవాలి. పంతుళ్లు కావాలి" అని ఎప్పుడూ అనేవాడు. ఇంటిబాధ్యతల వలన చదవలేకపోయిన బాధ ఆయన జీవితాంతం అనుభవించారు. "వో.... శీలం బుచ్చయ్య ఇద్దరి కొడుకులను తాల్లెక్కబెట్టక చదివిస్తుండు. ఇగ వాళ్ళను నౌకరి దార్లను చేస్తడు. వాళ్ళు ఈయన్ను టుంగుటుయ్యాలల్ల కూసోబెట్టి ఊపుతరిగ..." అని సూటిపోటిమాటలను

ఎదుర్కొన్నాడు. వాళ్లందరి మాటను నిజం చేస్తూ ఇద్దరమూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాం. ఆయన బలమైన కోరిక నెరవేరింది. అన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, నేను తెలుగు ఉపాధ్యాయుడుగా స్థిరపడ్డాం. అదీ నాయిన దార్శనికత. నేను సీరియస్ గా తీసుకోలేదు కానీ అన్న ఇంట్లో "టుంగుటుయ్యాల" కట్టించాడు. అమ్మ నాయినను దానిలో కూర్చోబెట్టి ఊపాడు. ఆయన బలమైన కోరిక నెరవేరింది. మా విషయంలో క్రమశిక్షణ–స్వేచ్ఛ సమపాళ్ళలో ఉండేది. మాకు పిల్లలు పుట్టాక మాత్రం 'పిల్లలను కొట్టొద్దు. కండ్ల నోట బెదిరియ్యాలి' అనేవాడు. తరాల అంతరాలనూ అర్థం చేసుకున్న ఆలోచనవాది. ఆచరణ వాది.

ఇది యాభై ఏళ్ల కిందటి మాట. 'సామాజిక అంతరాల నిరసన, సంప్రదాయాల ధిక్కరణ' నాయినలో స్పష్టంగా కనిపించేది. కల్లు తాటిచెట్ల వద్దే అమ్ముడుపోయేది. ఎక్కువ కల్లు అయినపుడు కల్లు ఇంటికి వచ్చేది. కల్లుకు వచ్చే ఎస్.సి., ఎస్.టిలు చాటుగా ఇంటి బయటనుండి తీసుకెళ్ళేవారు. ఇంట్లోకి రాకపోయేవారు. మాతో చదివే విద్యార్థులు కూడా ఇంట్లోకి వస్తే, పైన కూర్చోమని చెబితే కూర్చునేవారు కాదు. కానీ నాయిన దానికి ఒప్పుకునేవారు కాదు. వారిని కసిరి పైన కూర్చుబెట్టేవారు. వినకబోతే ఆ సందర్భంగా వేమన పద్యమో, బ్రహ్మంగారి పద్యమో, రామాయణ మహాభారత ఘట్టమో వర్ణించి అవగాహన కల్పించేవారు. అప్పటికీ వినకబోతే అమ్మనా బూతులు తిట్టి మరీ ఆ పనిజేసేవారు. నాయిన దగ్గర గ్రామకట్టుబాటు ఓడిపోయేది. ఆయనంతే! మాట కటువు. మనసు వెన్న. నాయినలో ఆధ్యాత్మిక, లౌకిక, నైతిక విలువల బోధన, ఆచరణలో వ్యత్యాసం ఉండేది కాదు. సమాజంలో కొన్ని కులాలకే జంధ్యం ఆచారం ఉంటుంది. గౌడులకు జంధ్యం ఉండదు. నాయిన దానిని ధిక్కరించాడు. ఉపనయనం చేసుకుని గుడ్డి సంప్రదాయాలను వ్యతిరేకించాడు. చేతబడి, దుష్టపూజలులాంటివి వ్యతిరేకించాడు. పూజారుల దోపిడీని నిరసించాడు. ఎంతో ఖరీదైన పెళ్ళిళ్ళు, తద్దినాలు, వినాయక, దుర్గాదేవి పూజలు పేదలు భరించలేక అప్పులపాలవడం చూసి తట్టుకోలేకపోయేవాడు. పంచాంగం, జాతకం, వాస్తు, జ్యోతిష్యం పేరుతో దోచుకోవడం తప్పుపట్టేవాడు. పెళ్లికి మధ్యవర్తి అవసరం లేదని చెప్పినా వినకపోవడం వలన, వారి భావోద్వేగాలకు విలువనిచ్చి ఆ కార్యక్రమాలను ఉచితంగా చేసిపెట్టేవారు. అన్ని సంప్రదాయ పూజ నియమాలు,

విధానాలను కూలంకషంగా అధ్యయనం చేశాడు. లోతులను చక్కగా విశ్లేషించేవాడు. ఊరిలో ఒక్క బ్రాహ్మణుడు లేకుండా పోయాడని ఆయనపై కోపం పెంచుకున్న వాళ్ళు ఉన్నారు.

ఇవాళ ఆయన బతికి ఉంటే యూట్యూబ్ లో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని హేతువాదంతో సహేతుకంగా బోధించే ఒక పెద్దాయనలా ఆయనా పేరుతెచ్చుకునేవాడు. నాయిన కల్లు గీత గీస్తూ ఆర్య సమాజ ప్రభావం, అచల తత్వ ప్రభావంతో ఆధ్యాత్మిక రంగంవైపు ఆకర్షితులయ్యాడు. ఆయన కంటే ఇరవైఏళ్ళు పెద్దవారైన పద్మశాలి కులస్తుడు కైరంకొండ అబ్బయ్య గురు ఉపదేశం ఇచ్చాడు. అప్పటి నుండి వారిద్దరూ గురుశిష్యులుగా, సొంత అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్నారు. ఆయన కొడుకు రామచంద్రయ్య అన్నకు, నాకు బడిలో లౌకిక గురువు. మా కుటుంబాలు కులపట్టింపులు లేకుండా ఒక్కటిగానే కలిసి ఉంటాము. కాకతాళీయంగా పెదనాన్న (గురువు), నాయిన నాలుగు నెలల తేడాతో చనిపోయారు. వారు బతికి ఉన్నప్పుడే తమ సమాధిని నిర్మించుకున్న సాహసవంతులు. ఎందుకంటే ఆ సమాధిని వారు కట్టుకున్నప్పుడు ఊరంతా బతికి ఉన్నప్పుడే సమాధి కట్టుకోవడమేంటని వారిని నిందించారు.

ఇప్పుడు ఆ చోటు మా కుటుంబాలకు దేవాలయం. గురుపరంపరలో పెద్దమ్మకు గానీ, అమ్మకు గానీ గాజులు, కుంకుమ, మెట్టెలు తీయలేదు. వారి మరణానంతరం తద్దినాలు లేవు. పిండాలు లేవు. జీవహింస లేదు. అది గురుశిష్యులు వారసులకు ఇచ్చిన చివరి ఆదేశం. చివరి హక్కు. ఇదంతా లోకవిరుద్ధం. వారి సాహసోపేత జీవనం గుర్తు వారి తదనంతరం కూడా వారసత్వం రూపంలో బతికే ఉంది. నాయిన మాటల్లో వడపోత లేని భాష, సూటి‘ధనం’ వ్యక్తమయ్యేది. మనుషుల స్వభావాలను వివేచించగలిగేతనం, హేతువాద దృష్టి, ధర్మాచరణ స్పష్టంగా ఉండేది. రోజూ నూటయాభై తాడిచెట్లు ఎక్కి మా కొరకు కష్టపడిన నాయిన మేం ఉద్యోగాలు సాధించాక క్రమంగా విరామం తీసుకున్నాడు. కొంతకాలానికి నాయినకు కాళ్ళవాపులొచ్చాయి. అన్ని పరీక్షలు చేయించాం. ఏ ఒక్క అవయవయం లేశమాత్రం చెడిపోలేదు. ఎటువంటి చెడు అలవాట్లు లేకపోవడంతో 86 సంవత్సరాలు వచ్చినా బిపి, షుగర్ సాధారణంగానే ఉన్నాయి. టివిలో కాళ్ళవాపుల ఔషధం గురించిన

ప్రకటనను చూసి సూర్యాపేటకు వెళ్లి ఆయుర్వేద మందులు కొని తెచ్చుకుని వాడాడు. దాంతో పేగు రక్తనాళాలు పూర్తిగా చిట్లిపోయాయి. చనిపోయే వరకు ఆయుర్వేద వైద్యం గురించి మాకు తెలియనివ్వలేదు. జీవితాంతం నీటిమీద ఉన్న తామరలా జీవితానికి కష్టసుఖాలను తాకనివ్వలేదు. హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ నుండి ఇంటికి కారులో తీసుకోస్తున్నప్పుడు నాయిన నా ఒడిలోనే 24 నవంబరు 2023న, మధ్యాహ్నం 3:10 గంలకు శాశ్వతంగా నిద్రబోయాడు. గాంధీజీ "భారతీయ ఆత్మ గ్రామాల్లో ఉంది" అంటే, అంబేద్కర్ "గ్రామమంటే అజ్ఞానం" అన్నాడు. ఇవాళ గ్రామాలు, పట్టణాలు తేడాలేకుండా అజ్ఞానాన్ని కాసుల కక్కుర్తితో ప్రచారం చేస్తున్న "ప్రచార, ప్రసార సాధనాలే సమాజ అజ్ఞానానికి ఆత్మలా పనిజేస్తున్నాయి." కలి కాలాన్ని కరెన్సీకాలం చేశాయి. వైద్యం గురించి చెబితే మరో పుస్తకం నిండుతుంది. "వైద్యో నారాయణో హరీ!".

వైయుక్తిక సాహిత్యంలో అధికార కేంద్ర లక్ష్యంగా అనేక కావ్యాలు వచ్చాయి. ప్రేయసిపై మరెన్నో ప్రబంధాలు రాశారు. ప్రతీఒక్కరి జీవితంలో ముఖ్యపాత్రలైన అమ్మా నాయినలో అమ్మ అనుబంధాన్ని తెలుగు సాహిత్యం చాలానే దాచుకుంది. అమ్మను అమ్మలాంటి కమ్మని తెలుగు భాష ఎందుకో నాయినను తక్కువగా యాది చేసుకుంటుంది. భాష అనేది అమ్మ అయితే, నాయిన భావంలాంటివాడు. ఎన్ని భాషలను నేర్చుకున్నా... భావం ఒక్కటే మదిలో ఉన్నట్టుగా అందరి జీవితంలో నాయిన ఒకే భావోద్వేగాన్ని కలిగిస్తాడు. నాయిన కుటుంబ సభ్యులతో ఎలా మెలగాలో మాత్రమే చెప్పడు. సమాజం గురించి చెబుతాడు. అయన బాధ్యత, త్యాగం పరిధిలేనివి. సమాజపరంగా వెలకట్టలేనివి. ప్రపంచానికి ఆయన ప్రేమ తెలిసినా, మనకు తెలిసేసరికి చాలా సందర్భాల్లో ఆలస్యమవుతుంది. నాయిన నాకు ప్రాతస్మరణీయుడు.

-0-



Sheelam Bhadraiah

PERPU

Diverse Essays

శీలం భద్రయ్య సూర్యాపేట జిల్లా, తుంగతూర్తి మండలం, అన్నారం గ్రామంలో 24 డిశంబరు 1980న జన్మించారు. శీలం యాదమ్మ, బుచ్చయ్య వీరి తల్లిదండ్రులు. తెలంగాణ మోడల్ స్కూల్, కనగల్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. కథారచయితగా, కవిగా, నాటక రచయితగా సుప్రసిద్ధులు. తొలికథ 'కేంపు చెరువు' నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైంది. "లొట్టపీసు పూలు", "గంగెద్దు" వీరి కథా సంపుటాలు. వీరు రాసిన "ముస్తాదు" కవిత్వం తొలిగొడ కవితా సంపుటిగా పలువురి విమర్శకులచే ప్రశంసలు అందుకుంది. "ఖూని" నాటకను రాశారు. తెలుగు అకాడమి ప్రచురించిన "తెలుగు భాష, సాహిత్యం" గ్రంథ రచయితలలో ఒకరు. వీరి సంపాదకత్వంలో "అంకురం", "యాస" కవితా సంకలనాలు వెలువడ్డాయి. వీరు తెలంగాణ, బహుజన అస్తిత్వ స్పృహతో రచనలు చేస్తున్నారు. వీరి కథల్లో తెలంగాణ సాయుధపోరాట కాలం నాటి ప్రజల జీవన విధానం, తెలంగాణ భాష, సంస్కృతి ఉంటుందని విమర్శకులు ప్రశంసించారు.

తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చినట్టు, విభిన్న ప్రక్రియలు, వైవిధ్య రచనలపై రాసిన వ్యాసాలు. కూడళ్ళలో ట్రాఫిక్ కానిస్టేబుల్ వాహనాలన్నీటినీ మళ్ళించినట్టుగా విమర్శ పాఠకులను మళ్ళించగలదు. నేడు ఇలాంటి విమర్శ అవసరం ఉంది. పరిశోధక విద్యార్థులకు ఉపయోగపడగలదు.

– రచయిత

విమర్శ మంచి చెడుల పరామార్శ. రచన యొక్క అంతస్సారాన్ని, ఆత్మను ఆవిష్కరించి సమాజానికి ఏ మేరకు ఉపయోగపడుతుందో తేల్చిచెప్పేవాడు విమర్శకుడు. దళిత, బహుజన సాహిత్య విమర్శకు, సామాజిక విమర్శకు శీలం భద్రయ్య వ్యాసాల 'పేర్పు' తెలుగు సాహిత్యానికి విలువైన చేర్పు.

– డాక్టర్ సాగర్ల సత్తయ్య

Price : 150 Rs

978-93-342-9925-0

శీలం ప్రచురణలు